www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 216
సోమవారం | 4-11-2024
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పరాభవం పరిపూర్ణం

11

భారత బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. ఫలితంగా మూడో టెస్టులోనూ రోహిత్ సేన చిత్తయింది. క్లీన్‌స్వీప్‌తో న్యూజిలాండ్ కొత్త చరిత్ర సృష్టించింది. స్వదేశంలో 3 అంతకుమించిన టెస్టుల సిరీస్‌లో తొలిసారి భారత్ వైట్‌వాష్‌కు గురైంది. సొంతగడ్డపై ఈ దారుణ పరాభవంతో ప్రపంచ టెస్టు చాంపియన్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరికపై ప్రభావం పడనుంది.



శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 11.25 తదుపరి చవితి, నక్షత్రం: అనూరాధ ఉ. 8.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ.2.03-3.46, దుర్ముహూర్తం: మ.12.21-1.06, మ.2.37-3.22; అమృతఘడియలు: రా.12.19-2.02, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 5.38



27 లక్షల కోట్ల క్యాష్!



- బఫెట్ వద్ద 32,500 కోట్ల డాలర్ల నగదు
- యాపిల్, అమెరికా బ్యాంక్‌లో వాటా విక్రయం
- సొంత సంస్థ బెర్క్‌షైర్ నుంచి లాభాల వెల్లువ
- కుప్పలు కుప్పలుగా పోగుబడిన నగదు
- రూ.82 లక్షల కోట్లకు బెర్క్‌షైర్ మార్కెట్ విలువ

2

25 వేల కోట్ల అమ్మకాలు

- అమెజాన్‌లో 1.6 కోట్ల షేర్లను విక్రయించిన జెఫ్ బెజోస్
- విలువ 300 కోట్ల డాలర్లు.. ప్రపంచ ధనికుల్లో 2వ స్థానానికి
- అంతరిక్షం, మీడియా రంగాల్లో పెట్టుబడుల విస్తరణ

2

7200 కోట్లు కట్టండి



- ఈ నెల 7లోగా చెల్లించకపోతే విద్యుత్తు ఆపేస్తాం
- బంగ్లాదేశ్‌కు అదానీ పవర్ కంపెనీ హెచ్చరిక
- కొన్ని నెలలుగా పేరుకుపోయిన బకాయిలు
- అక్టోబరు ఆఖరు నుంచి కరెంటు సరఫరా తగ్గింపు
- భారత మార్కెట్లో ఆర్డర్ల కోసం ప్రయత్నాలు

2

హై రయ్.. రయ్

తెలుగు రాష్ట్రాలకు హైస్పీడ్ కారిడార్లు.. తెలంగాణలో 6-7.. ఏపీలో 9

- పోర్ట్ అనుసంధాన రోడ్లు, మిస్సింగ్ లింక్, రద్దీ ఉండే చోట్ల రోడ్ల నిర్మాణాలు కూడా..
- విజన్-2047 కింద దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు
- స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ రోడ్లు, పట్టణాల్లోని ఇరుకు రహదారుల విస్తరణ సైతం..
- రెండు దశల్లో 59 వేల కిలోమీటర్ల మేర..
- భవిష్యత్తులో ఏర్పడే ట్రాఫిక్‌కు అనుగుణంగానే
- కేంద్ర మంత్రివర్గం ఆమోదించాక పనులు



తెలంగాణకు రాబోయే హైస్పీడ్ కారిడార్‌లు

190 కి.మీ.
హైదరాబాద్- బెంగళూరు

83 కి.మీ.
హైదరాబాద్- చెన్నై

244 కి.మీ.
హైదరాబాద్- విశాఖపట్నం

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా హైస్పీడ్ కారిడార్లు, పోర్టు కనెక్టివిటీ, స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీ, లింక్, ఫీడర్ రోడ్లన్నింటినీ కలిపి దాదాపు 59 వేల కిలోమీటర్ల మేర నిర్మాణాలను చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. విజన్-2047లో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పలు ప్రాజెక్టులు మంజూరు కానున్నాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం ఏపీ, తెలంగాణ మీదుగా పలు హై స్పీడ్ కారిడార్లు నిర్మించనున్నారు. ఏపీలో పోర్టులు ఉండడంతో వాటిని అనుసంధానించేలా పలు రహదారులు, రెండు రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకుగా ఉన్న రోడ్లను వెడల్పు చేయడంతోపాటు మిస్సింగ్ లింక్ రోడ్లను నిర్మించనున్నారు. స్ట్రాటజికల్, ఇంటర్నేషనల్ రోడ్ల కనెక్టివిటీ కింద తెలుగు రాష్ట్రాల్లో ఒక్క రోడ్డు లేకపోవడం గమనార్హం. హైస్పీడ్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్‌కు 9, తెలంగాణకు 6-7 (తెలంగాణ మీదుగా ఏపీకి కొన్ని రోడ్లున్నాయి) రానున్నాయి. ఏపీలో పోర్టు కనెక్టివిటీ రోడ్లు 8 వరకు ఉన్నాయి. ఇక పట్టణ ప్రాంతాల్లోని ఇరుకు రోడ్లను వెడల్పు చేసే ప్రాజెక్టులు ఏపీలో 4, తెలంగాణలో 3 చోట్ల ఉన్నాయి. మిస్సింగ్ లింక్, అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో చేపట్టే రహదారుల నిర్మాణాల ప్రాజెక్టుల్లో ఏపీకి 7, తెలంగాణకు 4 చొప్పున ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నింటినీ రెండు దశల్లో

మిగతా 13వ పేజీలో...

మహారాష్ట్రలో బీజేపీ గెలిస్తే

జమిలి?

- దేశ రాజకీయాల్ని ప్రభావితం చేయనున్న ఆ ఎన్నికలు
- పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో జమిలి బిల్లు!
- 2027లో యూపీతోపాటు సార్వత్రిక ఎన్నికలూ?
- కూటమికి వ్యతిరేక ఫలితాలు వస్తే వక్ఫ్ బిల్లుతో సరి

2



మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర, ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో సమావేశమైన సీఎం

బీసీ కులగణనకు
డెడికేటెడ్ కమిషన్

- నేడే ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ
- కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం.. చైర్మన్, ముగ్గురు సభ్యులు!
- చిత్తశుద్ధితో ఉన్నామన్న రేవంత్.. 6 నుంచి రాష్ట్రంలో కులగణన

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనాభా గణనకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీల లెక్కలు తీసేందుకు బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సోమవారంలోగా కమిషన్‌ను ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన జీవో జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలను శాస్త్రీయమైన పద్ధతిలో తేల్చేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో నియమించాలంటూ హైకోర్టు అక్టోబరు 30న ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. బీసీల జనాభాను లెక్కించే పనిని బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదని, ఇందుకు రాజ్యాంగంలోని నిబంధనలు అంగీకరించవని పేర్కొంటూ మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా లెక్కలు తేల్చేందుకు ప్రత్యేక కమిషన్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అందుబాటులో ఉన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల

మిగతా 12వ పేజీలో...

ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

- గిరిజనులకు మినహాయింపు: అమిత్ షా
- 5 లక్షల ఉద్యోగాలు.. 500కే సిలిండర్
- మహిళలకు ప్రతినెలా రూ.2,100
- బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

2

పశ్చిమాసియాకు బీ52 విమానాలు

- ఖమేనీ హెచ్చరికలతో అమెరికా స్పందన
- ఫైటర్ జెట్లు, బాలిస్టిక్ క్షిపణులు, ట్యాంకర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా
- ఇజ్రాయెల్, అమెరికాలను వణికిస్తాం
- అణు విధానాన్ని పునఃపరిశీలిస్తాం: ఇరాన్

2

కరెంటు కాటు

- మణుగూరులో విద్యుదాఘాతంతో ఇద్దరు సెక్యూరిటీ గార్డుల మృతి
- స్కూల్‌లో జెండా పైపు తొలగిస్తుండగా హెచ్‌టీ లైన్‌కు తగలడంతో ఘటన
- ఎమ్మెల్యే ఫ్లెక్సీ తొలగిస్తూ విద్యార్థి మృతి
- హైదరాబాద్ బోయిన్‌పల్లిలో విషాదం

3



షుగర్ ఉన్నా లేనట్టే!

- రక్తంలో చక్కెర స్థాయుల ఆధారంగా పనిచేసే స్మార్ట్ ఇన్సులిన్
- ఇన్సులిన్ హార్మోన్‌లో రెండు చోట్ల మార్పులు చేయడం ద్వారా 'ఎన్ఎన్‌సీ 2215' అభివృద్ధి
- యూకే, డెన్మార్క్ 'ఫార్మా' శాస్త్రవేత్తల ఘనత

మధుమేహ బాధితులకు శుభవార్త. ఇన్సులిన్ డోసులో తేడాల కారణంగా రక్తంలో చక్కెర స్థాయులు పడిపోయే సమస్యకు అడ్డుకట్ట వేసే 'స్మార్ట్ ఇన్సులిన్'ను శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. అంటే.. ఇంజెక్షన్ ఇవ్వగానే రక్తంలో కలిసిపోయి పని మొదలెట్టడం కాకుండా.. కాస్తంత ఆగి.. షుగర్ లెవల్స్ ఎలా ఉన్నాయో చూసి, తక్కువగా ఉంటే నిశ్శబ్దంగా ఉండి, షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటే మాత్రమే పనిచేసే తెలివైన ఇన్సులిన్ అన్నమాట!! ఇది మార్కెట్లోకి అందుబాటులోకి వస్తే.. మధుమేహ బాధితులు చాలావరకూ సాధారణ జీవితం గడిపే అవకాశం ఉంటుంది.

(సెంట్రల్ డెస్క్)

భారతదేశానికి 'మధుమేహ రాజధాని' అనే పేరుంది! ప్రపంచవ్యాప్తంగా ఉన్న చక్కెర వ్యాధి బాధితుల్లో 17 శాతం మంది మనోళ్లే! తాజా గణాంకాల ప్రకారం దేశంలో నమోదైన షుగర్ పేషెంట్ల సంఖ్య 8 కోట్లు. ఇంకా ఆస్పత్రుల రికార్డుల్లోకి ఎక్కని కేసులు మరెన్నో!! 2045 నాటికి రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారమే భారత్‌లో మధుమేహుల సంఖ్య 13.5 కోట్లు దాటుతుందని అంచనా. దీనిబారిన పడితే.. కడుపు నిండా తిండి తినడానికి ఉండదు! ఎంతో ఇష్టమైన స్వీట్లపై మనసు చంపుకోవాల్సిందే!! పదే పదే దాహం వేస్తుంటుంది. మంచినీళ్లు ఎక్కువగా తాగేయడం వల్ల మాటిమాటికీ మూత్రవిసర్జన చేయాల్సి వస్తుంది. క్రమంగా బరువు తగ్గిపోతారు. దీర్ఘకాలంపాటు షుగర్‌తో

మిగతా 12వ పేజీలో...

ట్రంపా.. కమలా?

- అమెరికా ఎన్నికల్లో గట్టి పోటీ
- ఇద్దరూ మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గర్లో!
- ప్రచారానికి మిగిలింది కొన్ని గంటలే
- స్వింగ్ రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు
- అమ్మే స్ఫూర్తి.. క్రమశిక్షణ నేర్పారు..
- మన సంస్కృతిని గౌరవించాలన్నారు
- ప్రవాసులనుద్దేశించి హ్యారిస్ వ్యాసం
- ఎవరు గెలిస్తే.. ప్రపంచానికేంటి?
- 'అంతర్జాతీయం'గా అమెరికా ముద్ర
- నాటో విషయంలో ఇద్దరిదీ చెరోదారి
- ట్రంప్ గెలిస్తే.. పన్నుల బాదుడు
- కమల వస్తే అంతర్జాతీయ అజెండా



న్యూయార్క్, నవంబరు 3: అగ్రరాజ్యం అమెరికా ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. సోమవారం వరకే గడువు ఉండడంతో.. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ స్వింగ్ రాష్ట్రాలు– విస్కాన్సిన్, నార్త్ కరోలినా, మిషిగాన్, జార్జియా, పెన్సిల్వేనియాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. షెడ్యూళ్ల వారీగా సోమవారం వరకు ఆయా రాష్ట్రాలను చుట్టేసి.. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజానాడిని పట్టుకుంటూ అమెరికా ఎన్నికలను అంచనా వేస్తున్న 272టువిన్ డాట్ కామ్, రియల్‌క్లియర్‌పాలిటిక్స్ డాట్ కామ్ వంటి సంస్థలు ట్రెండ్స్ క్షణక్షణం మారుతున్నాయని పేర్కొంటున్నాయి. 272 మ్యాజిక్ ఫిగర్‌కు ఇరువురు అభ్యర్థులు 50లోపు స్థానాల దూరంలో ఉన్నట్లు చెబుతున్నాయి. కమల 226, ట్రంప్ 219 స్థానాల్లో ముందంజలో ఉండగా.. మ్యాజిక్ ఫిగర్‌కు కమల 44, ట్రంప్ 51 సీట్ల దూరంలో ఉన్నట్లు చెబుతున్నాయి. దీంతో కీలకమైన స్వింగ్ రాష్ట్రాలపై ఇరువురు అభ్యర్థులు దృష్టి సారించారు. మరోవైపు 'ఎర్లీ పోలింగ్' సదుపాయాన్ని 6.8 కోట్ల మంది అమెరికన్లు వినియోగించుకున్నారు. ఎన్నికల రోజు ప్రతికూల వాతావరణం, క్యూలైన్ల

మిగతా 2వ పేజీలో...

మరో ఇద్దరికి విషమం

- వాంకిడి విద్యార్థులు నిమ్స్‌కు తరలింపు
- మరొకరికి వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స
- ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన వారిలో 35 మంది ఇంకా ఆస్పత్రుల్లోనే

3



ధాన్యం కొనుగోలు జాప్యంపై ఎల్లారెడ్డిపేటలో రైతుల ధర్నా

67% బియ్యం ఇవ్వాల్సిందే

- రికవరీ శాతం తగ్గింపునకు సర్కారు ససేమిరా
- ఈ మేరకు డీఎస్‌వో, డీఎంలకు ఆదేశాల జారీ
- డీసీపీలో ఉండటంతో మార్గదర్శకాలు కచ్చితం
- సన్నధాన్యం సేకరణకు కేంద్రం ప్రత్యేక అనుమతి
- పీడీఎస్‌కు 36 లక్షల టన్నులు కేంద్రం కోటాలోనే
- షరతుల్లేకుండా ధాన్యం ఇవ్వాలంటున్న మిల్లర్లు

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యాన్ని మర ఆడిస్తే వచ్చే బియ్యం శాతం తక్కువగా ఉంటోందని, 67% బియ్యం ఇవ్వలేమంటున్న మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. కేంద్రం, భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా 67% కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వాల్సిందేనని

మిగతా 3వ పేజీలో...

దీపావళి వేడుకల్లో కెనడా ప్రధాని

» భారత్,కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ చర్య



న్యూఢిల్లీ, నవంబరు 3: భారత్-కెనడాల మధ్య దౌత్య పరమైన ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో దీపావళి వేడుకలు జరుపుకొన్న వీడియోని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "హ్యాపీ దీపావళి... ఈ వారం హిందువులతో ఎన్నో ప్రత్యేక సందర్భాలు గడిచాయి.." అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కెనడాలోని మూడు హిందూ ఆలయాలవారు బహూకరించిన కంకణాలను ట్రూడో చేతికి కట్టుకోవడం ఆ వీడియోలో కనిపించింది. "ఈ కంకణాలు అదృష్టాన్ని ఇస్తాయి.. రక్షణ కల్పిస్తాయి.. అవి ఊడిపోయేంత వరకు వాటిని నేను తొలగించను.." అని ట్రూడో తన పోస్టులో పేర్కొన్నారు. అక్టోబరు 31న కూడా ట్రూడో కెనడియన్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ కెనడాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మందితో దీపావళి జరుపుకోబోతున్నామని ఆ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు, 2023 సెప్టెంబరులో నిజ్జర్ హత్య ఘటన తర్వాత భారత్-కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.

వీధి కుక్కలకు బిస్కెట్లు వేసి.. ఉగ్రవాదిని హతమార్చి

» ఉగ్రకమాండర్ ఉస్మాన్‌ను వ్యూహాత్మకంగా మట్టుబెట్టిన సైన్యం

» శ్రీనగర్‌లో ఉగ్రవాదుల గ్రెనేడ్ దాడి..12 మందికి గాయాలు

శ్రీనగర్, నవంబరు 3: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో భారత బలగాలు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. శనివారం లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రకమాండర్ ఉస్మాన్‌ను మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్‌లో బిస్కెట్లది కీలక పాత్ర అని అధికారులు తెలిపారు. అనంత్‌నాగ్ జిల్లా ఖాన్యార్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారంతో శనివారం తెల్లవారుజామున బలగాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో సైనికులకు వీధికుక్కల రూపంలో సవాల్ ఎదురైంది. అవి మొరిగితే ఉస్మాన్ తప్పించుకునే అవకాశం ఉంది. దీంతో వ్యూహాత్మకంగా వ్యవహరించిన జవాన్లు అవి అరవకుండా ఉండడానికి దారిపొడవునా శునకాలకు బిస్కెట్లు అందిస్తూ వచ్చారు. ఈ వ్యూహంతో ఆపరేషన్ విజయవంతమైందని, ఇలాంటి సమయాల్లో వీధికుక్కల సమస్యకు పరిష్కారం దొరికిందని సీనియర్ అధికారులు తెలిపారు. మరోవైపు, ఆదివారం శ్రీనగర్‌లోని ఆల్‌ఇండియా రేడియో సమీపంలోని టూరిస్టు రిసెప్షన్ సెంటర్ దగ్గరలో గల మార్కెట్ వద్ద ఉగ్రవాదులు గ్రెనేడ్ విసిరారు. రద్దీగా ఉండే వారసంతలో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 12 మంది గాయపడ్డారు.

చెన్నైలో పారిశ్రామికవేత్త ఇంటిలో బాలిక హత్య

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఓ పారిశ్రామికవేత్త ఇంటిలో పనిచేస్తున్న 16 ఏళ్ల బాలిక చిత్ర హింసలకు గురై హతమైంది. ఈ హత్యకేసులో ఆ పారిశ్రామికవేత్త, ఆయన భార్య సహా ఆరుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. పాత కార్ల కొనుగోలు, అమ్మకాల వ్యాపారం చేసే పారిశ్రామికవేత్త మహమ్మద్ నిషాద్ చెన్నై అమింజికరైలో నివసిస్తున్నారు. ఆయన ఇంటిలో తంజావూరుకు చెందిన బాలిక (16) గతేడాది నుంచి పని చేస్తోంది. ఇంటి పనులు సక్రమంగా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిషాద్ ఆయన భార్య నజియా బాలికను హింసించేవారు. దీపావళి రోజున బాలికను ఆ దంపతులతో పాటు నజియా స్నేహితుడు లోకేశ్, అతని భార్య జయశక్తి ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టి, సిగరెట్‌తో కాల్చి చిత్ర హింసలకు గురిచేసి పొత్తికడుపులో కాళ్లతో తన్నారు. బాలిక అపస్మారకస్థితిలోకి జారుకోవడంతో వారంతా భయంతో ఆమెను బాత్రూమ్‌లో పడేశారు. కాసేపటికి ఆ బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఈ విషయం తెలిసి ఇంటికి తాళం వేసి నిందితులు పరారయ్యారు. ఆ తర్వాత మహమ్మద్ తనకు తెలిసిన అడ్వొకేట్ సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. నిషాద్, నజియా, లోకేశ్, జయశక్తితో పాటు బాలికను పనిలో చేర్పించిన సీమా, ఆమెకు తెలిసిన పనిమనిషి మహేశ్వరిని పోలీసులు అరెస్టు చేశారు.

తెలుగు వారు అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చారు

» వాళ్లే ఇప్పుడు తమది తమిళ జాతి అంటున్నారు: నటి కస్తూరి



చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన వారే తెలుగు వారని, అలా వచ్చిన వారంతా ఇపుడు తమది తమిళ జాతి అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ మహిళా నాయకురాలు, తమిళ సినీ నటి కస్తూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. '300 ఏళ్ల క్రితం ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన తెలుగు వారు.. ఇప్పుడు తమది తమిళ జాతి అంటుంటే... మరి ఎప్పుడో ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులను తమిళులు కాదని చెప్పడానికి మీరెవరు..?' అని పరోక్షంగా ద్రావిడ సిద్ధాంత వాదులను ప్రశ్నించారు. ప్రస్తుత తమిళనాడు మంత్రివర్గంలో ఐదుగురు మంత్రులు తెలుగు మాట్లాడేవారు ఉన్నారన్నారు. 'ఇతరుల ఆస్తులు లూటీ చేయొద్దు, ఇతరుల భార్యలపై మోజుపడొద్దు.. ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను చేసుకోవద్దు.. అని బ్రాహ్మణులు చెబుతున్నారు. అందుకే వారికి వ్యతిరేకంగా తమిళనాట ప్రచారం సాగుతోంది' అని కస్తూరి పేర్కొన్నారు.

స్పెయిన్ రాజుపై బురద విసిరిన వరద బాధితులు

వెలెన్సియా, నవంబరు 3: వరదలు వచ్చి సర్వస్వం కోల్పోయినా ప్రభుత్వం సకాలంలో సాయం చేయలేదంటూ స్పెయిన్ దేశం రాజు ఫెలిపే-4పై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై బురద చల్లి, కేకలు వేసి నిరసన తెలిపారు. గురువారం వచ్చిన వరదల కారణంగా 200మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వరద తీవ్రత అధికంగా ఉన్న వెలెన్సియా నగరం శివారు అయిన పైపోర్టాలో కనీసం 60 మంది మరణించారు. వరదబాధితులను పరామర్శించేందుకు తొలిసారిగా ఆదివారం ఆయన పైపోర్టాకు రాణి లెటిజియాతో కలిసి వచ్చారు. బాధితులతో మాట్లాడే ప్రయత్నం చేయగా తమకు సాయం అందలేదంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బురద విసరగా అది ఆయన ధరించిన నల్లని రెయిన్ కోటుపై పడింది. అయితే, రాజు ఫెలిపే మాత్రం సంయమనం కోల్పోకుండా వారిని అనునయించారు. ఒక బాధితుడు ఆయన భుజంపై వాలి కన్నీరు పెట్టుకున్నాడు.

రూ.7,200 కోట్లు కట్టాల్సిందే!

» ఈ నెల 7లోపు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం

» బంగ్లాదేశ్‌కు 'అదానీ పవర్' హెచ్చరిక



న్యూఢిల్లీ, నవంబరు 3: ఈ నెల 7వ తేదీలోపు విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే కరెంటు సరఫరాను నిలిపివేస్తామని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని ఝార్ఖండ్‌లోని అదానీ పవర్ కంపెనీ హెచ్చరించింది. కరెంటు సరఫరాకు సంబంధించిన బకాయిలు 85 కోట్ల డాలర్ల (రూ.7,200 కోట్లు) మేర పెరిగిపోయాయని తెలిపింది. వాస్తవానికి, అక్టోబరు 31వ తేదీలోపే బకాయిలు చెల్లించాలని, లేదంటే, రూ.1500 కోట్లకు 'లెటర్ ఆఫ్ క్రెడిట్' (ఎల్‌సీ) ఇవ్వాలని బంగ్లాదేశ్ విద్యుత్ బోర్డుకు అదానీ కంపెనీ గతంలోనే తెలిపింది. ఈ మేరకు ఎల్‌సీ ఇవ్వటానికి బోర్డు అంగీకరించినప్పటికీ, అది విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు లేదని సమాచారం. దీంతో 31వ తేదీ నుంచి అదానీ పవర్ కంపెనీ బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తున్న కరెంటును తగ్గించింది. ఝార్ఖండ్ గొడ్డాలోని అదానీ పవర్ కంపెనీ మొత్తం సామర్థ్యం 1496 మెగావాట్లు. బంగ్లాదేశ్‌లో మరో 3 కంపెనీలు (వీటిలో ఒకటి భారత్ ఎన్టీపీసీతో కలిసి ఏర్పాటు చేసిన రాంపాల్ యూనిట్) విద్యుదుత్పత్తి జరుపుతున్నప్పటికీ.. అదానీ కంపెనీయే అతిపెద్ద సరఫరాదారుగా ఉంటోంది. అదానీ పవర్ కంపెనీకి బంగ్లాదేశే అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. అయితే, షేక్ హసీనా పదవీచ్యుతితో బంగ్లాదేశ్‌లో అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, ప్రభుత్వం అదానీ కంపెనీకి బకాయిలు చెల్లించడం లేదు.

ట్రంపా.. కమలా?



(మొదటి పేజీ తరువాయి)

సమస్యను పరిష్కరించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ముందెన్నడూ లేని విధంగా.. అమెరికా ఎన్నికలు అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్నాయి. 1945 తర్వాత యావత్ ప్రపంచం ఎన్నడూ అమెరికా ఎన్నికలను ఇంత ఆసక్తిగా పట్టించుకోలేదు. అందుక్కారణం.. ట్రంప్, కమలల్లో ఎవరు గెలిస్తే.. ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంచనాలే.! ట్రంప్ తాను విజయం సాధిస్తే.. అంతర్జాతీయంగా అమెరికా పాత్రను పూర్తిగా మార్చేస్తానని ప్రకటించారు. కమలా హ్యారిస్ అంతర్జాతీయ అజెండాను మరింతగా పెంచుతానని పేర్కొన్నారు. నాటో విషయంలోనూ వీరి అజెండా చెరోదారిగా ఉంది. కమల గెలిస్తే.. నాటోలో అమెరికా పెద్దన్న పాత్ర కొనసాగనుండగా.. ట్రంప్ సభ్యదేశాలపై భారాన్ని పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. నాటోలోని ఇతర 31 సభ్యదేశాల మిలిటరీ బడ్జెట్ మొత్తంలో 2/3 వంతును అమెరికా తమ దేశ రక్షణ రంగంపై వెచ్చిస్తోంది. ట్రంప్ గెలిస్తే సభ్య దేశాలు తమ జీడీపీలో 2% నిధులను నాటోపై వెచ్చించేలా ఒత్తిడి తీసుకువస్తానని ప్రకటించారు. 2024 నాటికి నాటోలోని 23 దేశాలు మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించాయి.

ట్రంప్‌తో 'పన్ను'పోటే?

ట్రంప్ గెలిస్తే.. చైనా నుంచి జరిగే దిగుమతులపై 60-200% వరకు పన్ను(టారిఫ్) విధించే అవకాశాలున్నాయి. ఇతర దేశాల నుంచి దిగుమతులపై 20% పన్ను(యూనివర్సల్ టారిఫ్)ను అమలు చేస్తారని తెలుస్తోంది. ఇలాంటి చర్యలు వాణిజ్య యుద్ధాలు, ప్రతీకార చర్యలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కుదుపులు తప్పవని ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు. తద్వారా జీరో కార్బన్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు ప్రపంచం చేస్తున్న ప్రయత్నాలకు గండిపడే ప్రమాదముంది. జోబైడెన్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు అమలు చేసిన విధానాలను ట్రంప్ రద్దు చేసే ప్రమాదం ఉన్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

యుద్ధం-శాంతి

పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు అమెరికా, నాటో చర్యలు తీసుకోగా.. ట్రంప్ హయాంలో సేనల ఉపసంహరణ జరిగింది. ఫలితంగా అఫ్గానిస్థాన్ తిరిగి తాలిబాన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. రెండేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కమల, ట్రంప్‌లది భిన్నస్వరం. బైడెన్ సర్కారు మాదిరిగా కమల కూడా నాటో ద్వారా మిలటరీపరంగా, ఆర్థికంగా ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే అవకాశాలుండగా.. ట్రంప్ బేషరతుగా రష్యాతో ఒప్పందం కుదుర్చుకునేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తానని చెప్పారు. ఇజ్రాయెల్ విషయంలో మాత్రం ఇరువురి ఆలోచనలు దాదాపు ఒకేలా ఉన్నాయి. తైవాన్ విషయంలోనూ.. చైనా దాడి చేయకుండా చూస్తున్నందుకు తమకు డబ్బులివ్వాలని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. కాగా, ట్రంప్ అధికారంలోకి వస్తే.. అమెరికాలో ఉన్న వలసదారులకు ఇబ్బందేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తల్లితో కమల, చిన్ననాటి ఫొటో

భారత్‌తో అనుబంధంపై కమల వ్యాసం

భారతీయ-అమెరికన్ ఓటర్లలో 32% ట్రంప్ వైపు మొగ్గుచూపారని సర్వేలు వెలువడడంతో.. కమల నష్టనివారణ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తన తల్లి శ్యామల హ్యారిస్‌ను స్మరించుకుంటూ.. దక్షిణాసియా పత్రిక జాగర్నాట్‌లో సుదీర్ఘ వ్యాసం రాశారు. "నా తల్లి శ్యామల హ్యారిస్ 19 ఏళ్ల వయసులో అమెరికాకు వచ్చారు. ఆమె రెండు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగారు. వాటిల్లో ఒకటి రొమ్ము క్యాన్సర్‌ను నివారించడం. రెండోది నన్ను, నా సోదరి మాయను క్రమశిక్షణతో పెంచడం. మాకు భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని గౌరవించాలని బోధించేవారు" అని ఆ వ్యాసంలో చెప్పుకొచ్చారు. రెండేళ్లకోసారి దీపావళి పండుగను జరుపుకొనేందుకు తమిళనాడుకు వస్తామని పేర్కొన్నారు. "నాకు గుర్తుంది. మా తాతగారు పీవీ గోపాలన్ రిటైర్ అయ్యాక.. రోజూ బీచ్‌లో వాహ్యాళికి వెళ్లేవారు. నా చిన్నప్పుడు నేనూ ఆయనతో నడిచేదాన్ని. ఆ సమయంలో ఆయన తన సహచరులతో ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడేవారు" అని వివరించారు.



ట్రంప్ అయితే చంపడు!

అమెరికాలో పతాకస్థాయికి చేరుకున్న అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌కు బహిరంగ మద్దతు ప్రకటించిన ఈలన్ మస్క్.. ప్రస్తుత బైడెన్ పరిపాలనను, అధికార యంత్రాంగాన్ని దుయ్యబట్టే ఏ అవకాశాన్నీ వదులుకోవట్లేదు. తాజాగా ఆయన 'పీనట్' అనే ఉడతను న్యూయార్క్ రాష్ట్ర అధికారులు యుథనేషియా(కారుణ్యమరణం) చేయడంపై మండిపడ్డారు. "ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఉడతలను పరిరక్షిస్తారు" అని ట్వీట్ చేశారు. 'రిప్ (రెస్ట్ ఇన్ పీస్) పీనట్' అంటూ ఏడుపు ముఖం ఎమోజీని కూడా ఆ ట్వీట్‌కు జత చేశారు. ఇంతకీ ఆ ఉడత కథ ఏమిటంటే.. ఏడేళ్ల క్రితం పీనట్(ఉడత) తల్లి రోడ్డు దాటుతూ ఒక కారు కింద పడి చనిపోయింది. పీనట్‌ను మార్క్ లాంగో అనే వ్యక్తి తెచ్చి పెంచుకున్నాడు. ఆ ఉడతతో రకరకాల విన్యాసాలు చేయించి సోషల్ మీడియాలో పెట్టేవాడు. దీంతో అది బాగా పాపులర్ అయిపోయింది. అయితే, అక్టోబరు 30న న్యూయార్క్‌లోని పర్యావరణ పరిరక్షణ విభాగం (డీఈసీ) అధికారులు లాంగో ఇంటిపై దాడి చేసి, సోదాలు చేసి పీనట్‌ను, ఫ్రెడ్ అనే రకూన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటివల్ల మనుషులకు రేబిస్ వచ్చే ప్రమాదం ఉందంటూ తీసుకెళ్లి చంపేశారు! అధికారుల తీరును ఖండిస్తూ మస్క్‌తోపాటు వేలాదిమంది సోషల్ మీడియాలో బైడెన్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు.

పశ్చిమాసియాలో బీ-52 యుద్ధవిమానాలు

» ఇజ్రాయెల్, అమెరికా పళ్లు విరిగేలా బదులిస్తాం: ఖమేనీ




టెల్‌అవీవ్, టెహ్రాన్, నవంబరు 3: అమెరికా బీ-52 భారీ యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు తరలించింది. వీటితో పాటు ఫైటర్ జెట్లు, బాలిస్టిక్ క్షిపణులు, ట్యాంకర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను కూడా తరలించింది. అమెరికా ఇప్పటికే ఇజ్రాయెల్ గగనతల రక్షణ కోసం థాడ్ వ్యవస్థను మోహరించింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను కూడా అరేబియా సముద్రంలో నిలిపినట్లు సమాచారం. దీంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు, అమెరికా భారీ యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు తరలించిన నేపథ్యంలో తమ అణు విధానాన్ని పునఃపరిశీలించాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సలహాదారు కమల్ ఖర్రాజీ ప్రకటన చేశారు. తమకు అణ్వాయుధాలు తయారు చేయగల సామర్థ్యం ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

ఖమేనీ వార్నింగ్

ఇజ్రాయెల్, అమెరికాలకు పళ్లు విరిగేలా గట్టిగా బదులిస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హెచ్చరించారు. శత్రువులు జియోనిస్టులైనా, అమెరికా అయినా ఇరాన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న చర్యలకు తగిన ఫలితం అనుభవిస్తారని, కోలుకోలేని విధంగా దెబ్బకొడతామన్నారు. టెహ్రాన్‌లో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన ఆయన ఇందుకు ఇరాన్ పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. రాజకీయంగానే కాక సైనిక పరంగా కూడా ఇరాన్ పూర్తి సంసిద్ధంగా ఉందని ఖమేనీ స్పష్టం చేశారు. కాగా, గాజాతో పాటు లెబనాన్‌లోనూ ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గాజాపై ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో 23 మంది చనిపోయారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా సీనియర్ ఆపరేటివ్‌ను ఇజ్రాయెల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. దీనిపై లెబనాన్ ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది.

లోకం తీరు



శంషాబాద్‌లో 3 విమానాలకు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆదివారం మూడు ఇండిగో విమానాలు, ఒక ఎయిర్ ఇండియా విమానంలో బాంబులు ఉన్నట్లు ఆగంతుకులు బెదిరింపు మెయిల్స్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పుణె వెళ్తున్న విమానానికి, బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న విమానానికి, హైదరాబాద్ నుంచి గోవా వెళ్తున్న విమానాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. మరోవైపు, గోవా నుంచి కోల్‌కతా వెళ్తున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు మెయిల్ రావడంతో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. భద్రతా సిబ్బంది బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబులు లేవని తేల్చారు.

వాయుసేన- ఉబెర్ ఒప్పందంపై నిపుణుల అభ్యంతరాలు

న్యూఢిల్లీ, నవంబరు 3 : భారత వాయుసేన, అమెరికాకు చెందిన రైడ్ షేరింగ్ యాప్ 'ఉబెర్' మధ్య ఇటీవల జరిగిన అవగాహన ఒప్పందంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందంతో వాయుసేన సమాచార గోప్యతకు, వాయుసేన సిబ్బంది రక్షణకు ముప్పు పొంచి ఉందని వాయుసేన మాజీ ఉద్యోగులు, భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వాయుసేన ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఉబెర్ ఓ ప్రత్యేక అప్లికేషన్‌ను వాయుసేనకు ఇవ్వనుందని సమాచారం. ఉబెర్ సేవలు వినియోగించుకోవడం వల్ల వాయుసేనకు సంబంధించిన కీలక సమాచారం, లొకేషన్లు, ఉద్యోగుల వివరాలు బయటి వ్యక్తులకు బహిర్గతం అవుతాయని వాయుసేన మాజీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

మహారాష్ట్రలో బీజేపీ కూటమి గెలిస్తే జమిలి?

న్యూఢిల్లీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు ముహూర్తం ఎప్పుడు? మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాత ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని.. ఆ ఫలితాల ఆధారంగానే దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు జరిగే అవకాశం ఉందని దేశ రాజధానిలో ఉన్నతాధికార వర్గాల మధ్య చర్చ జరుగుతోంది!! ఇటీవలి ఎన్నికల్లో హరియాణాను హస్తగతం చేసుకున్న కమలనాథులు.. మహారాష్ట్ర కూడా తమ వశమయితే దేశంలో తమకు తిరుగుండదని, అనేక కీలక నిర్ణయాలు తీసుకునేందుకు తమకు ప్రజామోదం లభించినట్లే భావిస్తారని ఆ వర్గాలు అంటున్నాయి. ఈ నెల 23న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార మహాయుతి (బీజేపీ+శివసేన(శిందే)+ఎన్సీపీ (పవార్)) కూటమి గనుక అత్యధిక సీట్లు సాధిస్తే.. ఆ ప్రభావం మహారాష్ట్రలోనే కాక, జాతీయస్థాయిలో ఉంటుందని ఆ వర్గాల అంచనా. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత నవంబర్ 25 నుంచి ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాల్లో ఏ బిల్లులు ప్రవేశపెట్టాలనే అంశం కూడా ఈ ఫలితాలపైనే ఆధారపడి ఉండనుంది. న్యాయశాఖలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జమిలి ఎన్నికలకు సంబంధించి కసరత్తు పూర్తయిందని, ఈ మేరకు బిల్లు కూడా సిద్ధమైంది తెలుస్తోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధిస్తేనే ఆ బిల్లును శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి స్థాయీసంఘానికి సిఫారసు చేసే అవకాశాలు ఉన్నాయని న్యాయశాఖలో ఒక అధికారి చెప్పారు. జమిలి ఎన్నికల బిల్లు ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టారంటే.. 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో పాటు జమిలి ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతుందని భావించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ, 2026లో నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్‌ను అమలు చేసి 2027లో జమిలి ఎన్నికలకు వెళ్లే అవకాశాల గురించి ప్రభుత్వం ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చిందని న్యాయ శాఖ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర ఫలితాలు తమకు వ్యతిరేకంగా వస్తే.. శీతాకాల సమావేశాల్లో కేవలం వక్ఫ్ బిల్లును మాత్రమే ప్రవేశపెట్టి 'జమిలి' ఎన్నికల బిల్లును వాయిదా వేసే అవకాశాలున్నట్లు వివరించాయి.



జమిలి ఎన్నికలు వద్దు.. టీవీకే తీర్మానం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా తమిళ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే) కార్యనిర్వాహక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. పాలకపక్షం డీఎంకే ఏళ్లతరబడి చేస్తున్న నీట్ వ్యతిరేక ప్రతిపాదనను కూడా ఈ సమావేశంలో ఓ తీర్మానంగా చేసి ఆమోదించారు. సామాజిక న్యాయంకోసం రాష్ట్రంలో కులాల వారీ జనగణన జరపాల్సిన అవసరం ఉందని మరొక తీర్మానం చేశారు.

ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

5 లక్షల ఉద్యోగాలు.. రూ.500కే గ్యాస్ సిలిండర్

» మహిళలకు ప్రతినెలా రూ.2,100.. బీజేపీ మ్యానిఫెస్టో విడుదల



ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా, చంపయీ సొరెన్

న్యూఢిల్లీ, నవంబరు 3: ఝార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈనెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న ఝార్ఖండ్‌లో 'సంకల్ప పత్ర' పేరిట బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం ఆయన విడుదల చేశారు. కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, సంజయ్ సేథ్, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ ఝార్ఖండ్ భవిష్యత్తుకు ఈ ఎన్నికలే కీలకమన్నారు. పూర్తి అవినీతి ప్రభుత్వం కావాలో లేక, మోదీ నాయకత్వంలో అభివృద్ధి మార్గంలో పయనించే బీజేపీ ప్రభుత్వం కావాలో ఝార్ఖండ్ ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఝార్ఖండ్‌కు గుర్తింపు, చొరబాటుదారుల నుంచి భూమి, మహిళల రక్షణ బీజేపీ లక్ష్యమని చెప్పారు. ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని, అయితే, దాని నుంచి గిరిజనులకు మినహాయింపు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు సహా మొత్తం 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, దీపావళి, రాఖీ పండుగలకు పూర్తి ఉచితంగా 2 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని పేర్కొన్నారు. గోగో దీదీ స్కీం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని తెలిపారు. పరిశ్రమలు, మైనింగ్ వల్ల నిర్వాసితులైనవారి పునరావాసానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

చొరబాటుదారుల్ని తలకిందులుగా వేలాడదీస్తాం

మహిళలను వేధిస్తున్న చొరబాటుదారులను తలకిందులుగా వేలాడదీస్తామని అమిత్‌షా హెచ్చరించారు. ఝార్ఖండ్‌లో హేమంత్ సొరెన్ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం ద్వారా గిరిజనుల భద్రతపై రాజీ పడిందని విమర్శించారు. చొరబాటుదారులను ఓటుబ్యాంకుగా చూస్తోందని నిందించారు. చొరబాటుదారుల వల్ల రాష్ట్రంలో గిరిజన జనాభా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'చొరబాటుదారులు మన కుమార్తెలకు వలవేసి, వారిని పెళ్లి చేసుకొని ఇక్కడి భూమిని ఆక్రమిస్తున్నారు. దీన్ని ఆపకపోతే ఝార్ఖండ్‌కు భద్రత ఉండదు. ఝార్ఖండ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతోంది. ఈ చొరబాటుదారులందరినీ మేం ఏరిపారేస్తాం. అసోంలోని బీజేపీ ప్రభుత్వం చొరబాట్లను ఆపేసింది. ఇక్కడ కూడా అదే నిబద్ధతతో రోటీ, బేటీ(కుమార్తె), మాటీ(భూమి)ని పరిరక్షిస్తాం' అని అమిత్‌షా స్పష్టం చేశారు.

మోదీ ప్రస్తావన ఎందుకు?

» ఆయనంటేనే మనందరికీ బోర్ కొడుతోంది


» వయనాడ్ ఎన్నికల ర్యాలీలో రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 3: ప్రధాని మోదీ అంటేనే బోర్ కొడుతోందని, ఆయన ప్రస్తావన ఎందుకని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తన సోదరి ప్రియాంక గాంధీకి మద్దతుగా వయనాడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తొలుత ప్రియాంక మాట్లాడుతూ మోదీకి ప్రజాశ్రేయస్సు కంటే తన మిత్రులైన వ్యాపారవేత్తల ప్రయోజనాలే ఎక్కువని ఆరోపించారు. ప్రజలకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్యం, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే ఉద్దేశం మోదీ ప్రభుత్వానికి లేదని, సమాజాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేయడం ద్వారా అధికారంలో కొనసాగడమే వారి లక్ష్యమని ధ్వజమెత్తారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ, 'ప్రియాంక ఎలాగూ మోదీ గురించి ప్రస్తావించారు. ఆయనంటే మనందరికీ బోర్ కొడుతోంది. అయినా రెండుసార్లు ఆయన ప్రస్తావన ఎందుకు?' అని ప్రశ్నించారు. తమ తండ్రి రాజీవ్ గాంధీ హత్యకేసులో నిందితురాలు నళినిని కలుసుకొని, కౌగిలించుకున్న వ్యక్తి ప్రియాంక అని కొనియాడారు. దేశంలో ద్వేష రాజకీయాలు కాకుండా ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రూ. 25 వేల కోట్ల అమ్మకాలు

» అమెజాన్‌లో 1.6 కోట్ల షేర్లను అమ్మేసిన సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్

» వాటి విలువ 300 కోట్ల డాలర్లు.. ప్రపంచ బిలియనీర్ల జాబితాలో రెండో స్థానానికి..




వాషింగ్టన్, నవంబరు 3: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్.. ఆ కంపెనీలో తనకున్న వాటాలో 300 కోట్ల డాలర్ల (రూ.25,240 కోట్లు) విలువైన 1.6 కోట్ల షేర్లను తాజాగా విక్రయించారు. దీంతో కలిపి ఈ ఏడాది ఆయన విక్రయించిన అమెజాన్ షేర్ల విలువ 1300 కోట్ల డాలర్లకుపైనే ఉంటుంది. తాజా అమ్మకంతో జెఫ్ బెజోస్.. ప్రపంచ సంపన్నుల (బిలియనీర్ల) జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నారు. ఆయన నికర సంపద 22,200 కోట్ల డాలర్లు. 26,200 కోట్ల డాలర్ల సంపదతో తొలిస్థానంలో ఎక్స్ యజమాని ఎలాన్‌మస్క్ ఉండగా, మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ 20,100 కోట్ల డాలర్లతో మూడోస్థానంలో ఉన్నారు. ప్రస్తుతం అమెజాన్ ఒక్కో షేరు 200 డాలర్లకు దరిదాపుల్లో ఉంది. 1997లో నాస్‌డాక్‌లో (అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో) నమోదైన తర్వాత కంపెనీ షేరు విలువ ఈ స్థాయిలో పెరగటం ఇదే ప్రథమం. అమెజాన్‌లో బెజోస్ 9% వాటా కలిగి ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికీ అమెజాన్ ఛైర్మన్‌గా ఉన్న బెజోస్.. ఆ కంపెనీలో తన వాటాను ఎందుకు తగ్గించుకుంటున్నారన్న దానిపై స్పష్టత లేదు. అయితే, అమెజాన్ కంపెనీ పలు కొత్త మార్కెట్లకు విస్తరిస్తూ, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకుంటున్నారా అన్న ఊహాగానాలు నడుస్తున్నాయి. మరోవైపు, బెజోస్ కూడా అంతరిక్షంతోపాటు పలు రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. బ్లూ ఆరిజిన్ అనే స్పేస్ కంపెనీని ప్రారంభించారు.

రూ.27 లక్షల కోట్ల క్యాష్!

» వారెన్ బఫెట్ వద్ద 32,500 కోట్ల డాలర్ల నగదు

» యాపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికాల్లో వాటాల విక్రయం



న్యూయార్క్, నవంబరు 3: అమెరికాకు చెందిన దిగ్గజ పెట్టుబడిదారు, వ్యాపారవేత్త వారెన్ బఫెట్ వద్ద ప్రస్తుతం ఏకంగా 32,500 కోట్ల డాలర్ల (రూ.27 లక్షల కోట్లు) నగదు ఉంది. యాపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికా కంపెనీల్లో తాజాగా షేర్ల అమ్మకంతోపాటు, తన సొంత కంపెనీ బెర్క్‌షైర్ హ్యాథవే నుంచి వస్తున్న లాభాలతో బఫెట్ వద్ద కుప్పలు తెప్పలుగా నగదు పోగుపడిపోతోంది. అయినప్పటికీ, దీనిని ఎక్కడా పెద్దగా పెట్టుబడులు పెట్టటానికి బఫెట్ ఆసక్తి చూపించటం లేదు. ఈ ఏడాది మే నెలలో జరిగిన కంపెనీ వాటాదారుల వార్షిక సమావేశంలో బఫెట్ మాట్లాడుతూ, 'పెట్టుబడులు పెట్టటానికి మనం తొందరపడాల్సిన పని లేదు. ఎందుకంటే, చాలా తక్కువ రిస్క్‌తో అత్యధిక లాభాలు వచ్చినప్పుడే ఆ పని చేద్దాం' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం బెర్క్‌షైర్ మార్కెట్ విలువ 97,400 డాలర్లుగా (రూ.81,94,638 కోట్లు) ఉంది.

జాతీయ రహదారులపై 'దీపావళి' రద్దీ

» టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

కేతేపల్లి, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, బీబీనగర్, కొండపాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ, వారాంతపు సెలవులు ముగియడంతో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జాతీయరహదారులు రద్దీగా మారాయి. వరంగల్-హైదరాబాద్, విజయవాడ-హైదరాబాద్ రహదారులతో పాటు గుంటూరు వెళ్లే వాహనాలతో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి సైతం సందడిగా మారింది. దీపావళికి ఏపీతోపాటు తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లిన వారు ఆదివారం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. దీంతో 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రద్దీ మరింత పెరిగింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామశివారులోని టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ లేన్ వాహనాలతో కిక్కిరిసింది. టోల్‌ప్లాజాకు దాదాపు అర కిలోమీటరు వరకు బారులు తీరిన వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ఒక్కో వాహనం టోల్‌ప్లాజా నుంచి బయటకు వెళ్లేందుకు దాదాపు ఐదు నిమిషాల సమయం పట్టింది. సాధారణంగా రోజుకు 20వేల వాహనాలు వెళ్లే ఈ రహదారిపై ఆదివారం మరో 10వేల వాహనాలు అదనంగా వెళ్లినట్లు అంచనా. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్దా వాహనాల రద్దీ పెరిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లిన భక్తులు, సాధారణ ప్రయాణికులతో టోల్‌ప్లాజా నుంచి 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్ పట్టణంలో కిలోమీటరు మేర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి వాహనాలు భారీగా నిలిచిపోయాయి.


యాదాద్రిజిల్లా గూడూరు టోల్‌ప్లాజా మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు

67 % బియ్యం ఇవ్వాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన డీ-సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్ (డీసీపీ) రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉండటంతో.. ఎఫ్‌సీఐ నిబంధనల్ని మార్చేదిలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల భవన్ నుంచి డీఎస్‌వో, డీఎంలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎఫ్‌సీఐ లెక్క ప్రకారం క్వింటాలు ధాన్యం తీసుకున్న రైస్‌మిల్లర్ నుంచి 67 కిలోల చొప్పున సన్నబియ్యం వసూలు చేయాల్సిందేనని ప్రభుత్వం సూచించింది. కానీ, ఈ నిర్ణయాన్ని రైస్‌మిల్లర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. దొడ్డు ధాన్యమైతే 67 కిలోల బియ్యం వచ్చే అవకాశం ఉంటుందని, సన్న ధాన్యంతో 58 నుంచి 60 శాతానికి మించి బియ్యం రాదని అంటున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక, సేకరణ, కేటాయింపులకు అనుగుణంగా నోడల్ ఏజెన్సీగా ఉన్న రాష్ట్రాలు, కార్పొరేషన్లు వ్యవహరించాల్సి ఉంటుంది. ధాన్యం సేకరణ సెంట్రల్ పూల్ (కేంద్ర ప్రభుత్వ కోటా)లో జరుగుతుంది. రాష్ట్రాలు కూడా తమ రాష్ట్ర ప్రజల ఆహార అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఆహార ఉత్పత్తులను సేకరిస్తాయి. మిగులుబాటు ఉంటే ఎఫ్‌సీఐకి అప్పగిస్తాయి. కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఈ విధానాన్నే అనుసరిస్తోంది. అయితే ఈసారి రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు ఏర్పడ్డాయి. 2025 నుంచి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సన్న ధాన్యం సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. సన్న ధాన్యం పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా ఇస్తామని ప్రకటించింది.



మద్దతు ధరకే కొనాల్సి ఉండడంతో..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డీసీపీ సిస్టమ్ ప్రకారం.. కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. అలా చేస్తేనే అన్నిరకాల పారామీటర్లు సరితూగుతాయి. కానీ, సర్కారు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు ఎమ్మెస్పీకి రూ.500 బోనస్ కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఎమ్మెస్పీని ఓపీఎమ్మెస్(ఆన్‌లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో, బోనస్‌ను రిజర్వు బ్యాంక్ ఆపరేషన్‌లో ఉన్న 'ఈ-కుబేర్' సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో రైతులకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి కూడా తీసుకుంది. రాష్ట్ర ప్రజల పీడీఎస్ అవసరాలకు సరిపోయేంత ధాన్యాన్ని సెంట్రల్ పూల్(కేంద్ర ప్రభుత్వ కోటా)లో సేకరించాలని నిర్ణయించింది. పీడీఎస్‌కు, ఇతర సంక్షేమ పథకాలకు కలిపి ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతున్నాయి. ఇంత బియ్యం ఉత్పత్తి కావాలంటే 36 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 50 లక్షల టన్నుల సన్నధాన్యం వస్తుందనే అంచనాలున్నాయి. ఇందులో రాష్ట్ర అవసరాలకు సరిపడా బియ్యాన్ని ఉంచుకొని.. మిగిలిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కనీస మద్దతు ధర నిర్వహణ(ఎమ్మెస్పీ ఆపరేషన్స్)లో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకపోవడంతో కేంద్రం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే దొడ్డు ధాన్యం స్థానంలో సన్న ధాన్యం సేకరించి, మిల్లింగ్ చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసుకుంది. తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పీడీఎస్ కోటాలో నెలవారీగా ఇచ్చే దొడ్డు బియ్యానికి బదులు.. సన్న బియ్యాన్ని డ్రా చేస్తుంది. పేదలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున పంపిణీ చేస్తుంది.

షరతులు వద్దంటున్న మిల్లర్లు..

సీఎంఆర్ డెలివరీ సక్రమంగా చేసిన వారిని, చేయని వారిని ప్రభుత్వం కేటగిరీల వారీగా విభజించింది. 10 శాతం నుంచి 25 శాతం వరకు బ్యాంకు గ్యారెంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ ఇవ్వాలని నిబంధన విధించింది. కానీ, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చినట్లుగానే ఎలాంటి షరతులు లేకుండా తమకు ధాన్యం అప్పగించాలని, బీజీ సిస్టమ్‌ను ఎత్తివేయాలని మిల్లర్లు కోరుతున్నారు. లేకపోతే ధాన్యం దించుకునేది లేదని మెలిక పెడుతున్నారు. కానీ, షరతుల్లేకుండా ధాన్యాన్ని అప్పగిస్తే రైస్‌మిల్లర్లు గతంలో మాదిరిగానే అమ్ముకుంటారని, సీఎంఆర్ సక్రమంగా ఇవ్వరనేది ప్రభుత్వ వాదన. అందుకే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసి, అధ్యయనం చేయించి, అభిప్రాయాలు సేకరించి, క్యాబినెట్‌లో ఆమోదం తీసుకొని జీవో నెం- 27ను వెలువరించింది. బ్యాంకు గ్యారెంటీ/సెక్యూరిటీ డిపాజిట్ సిస్టమ్‌ను వెనక్కితీసుకునే ఆలోచనలో కూడా ప్రభుత్వం లేదు. ఏది ఏమైనా 67 శాతం రికవరీ రేటు చొప్పున సీఎంఆర్ వసూలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉండడం రైస్‌మిల్లర్లకు మింగుడు పడటంలేదు.

రికవరీ విషయంలో తగ్గేదేలే?

కస్టమ్ మిల్లింగ్ నిబంధనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సడలించకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఇటీవల జారీ చేసిన జీవో నంబరు-27లో కేవలం బ్యాంకు గ్యారెంటీ, సెక్యూరిటీ డిపాజిట్ అంశాలనే ప్రస్తావించింది తప్ప.. సీఎంఆర్ రికవరీ శాతం జోలికి పోలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, ఎఫ్‌సీఐ మార్గదర్శకాలు ఎలా ఉంటే.. అలాగే నడుచుకోవాలని మిల్లర్లకు సూచించింది. అయితే క్వింటాలుకు రూ.10 నుంచి రూ.20 ఉన్న మిల్లింగ్ చార్జీలను రూ.40 నుంచి రూ.50కి పెంచింది. ఉప ఉత్పత్తులైన నూకలు, పరం, తౌడు, ఊకపొట్టు కూడా రైస్‌మిల్లర్లకే చెందుతుంది. క్వింటాలు ధాన్యం తీసుకున్న రైస్‌మిల్లరు67 కిలోల సన్నబియ్యాన్ని సీఎంఆర్ రూపంలో ఇవ్వాలనే నిబంధన కచ్చితంగా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 67 శాతం సీఎంఆర్ ఇవ్వలేమని, 58 నుంచి 60 శాతం రికవరీ మాత్రమే వస్తుందని రైస్‌మిల్లర్లు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకోవడంలేదు. దీంతో మిల్లర్లు రూటు మార్చి.. బ్యాంకు గ్యారెంటీ/సెక్యూరిటీ డిపాజిట్ అంశాన్ని తెరపైకి తెచ్చారు.


క్యూకాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

భక్తజనసంద్రం.. యాదాద్రి క్షేత్రం

» కార్తీక మాసం నేపథ్యంలో ఆలయ తిరువీధుల్లో రద్దీ
» ఇష్టదైవాలను దర్శించుకున్న 50 వేలమంది భక్తులు
» ధర్మదర్శనానికి 2గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట

భువనగిరి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం రెండో రోజు, వారాంతపు సెలవుదినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. వాహనాలతో పార్కింగ్ స్థలం నిండిపోగా క్షేత్రం చుట్టూ ఉన్న రింగ్‌రోడ్డులో కూడా వాహనాలను పార్కింగ్ చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సత్యదేవుడి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. కొండపైన గర్భాలయంలో పాంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో వచ్చిన సుమారు 50వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నారు. వీఐపీ టికెట్(రూ.150) దర్శనానికి ఒక గంట, ధర్మ దర్శనానికి 2గంటల సమయం పట్టింది. కాగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.60,82,772 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

3.36 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు

ఓపెన్‌లో 1.98 లక్షలకు ఏ కేటగిరీ సీటు.. 5.36 లక్షల రాన్యక్‌కు బీ కేటగిరీలో

» సీ కేటగిరీలో 13.90 లక్షల ర్యాంక్
» ముగిసిన వైద్యవిద్య కౌన్సెలింగ్



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యవిద్యలో అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ మెడికల్ కౌన్సెలింగ్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లోని కన్వీనర్(ఏ కేటగిరీ), యాజమాన్య(బీ కేటగిరీ), ఎన్నారై(సీ కేటగిరీ) సీట్లను భర్తీచేశారు. నిజానికి అక్టోబరు 31 వరకే అన్ని రకాల కేటగిరీల్లో ప్రవేశాల ప్రక్రియ ముగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయి. అయితే ఈ ఏడాది నీట్ పేపర్ లీకు వ్యవహారం, కోర్టుల్లో అనేక రకాల కేసుల కారణంగా.. నవంబరు 5 వరకు ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. ప్రస్తుతం బీ, సీ కేటగిరీల్లో 8 సీట్లు మినహా.. అన్నింటిలోనూ విద్యార్థులు చేరిపోయారు. ఎనిమిది మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ఆరు బీ కేటగిరీ, రెండు ఎన్నారై కోటా(సీ కేటగిరీ) సీట్లు మిగిలినట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ సీట్లకు అన్ని దశల కౌన్సెలింగ్‌లు పూర్తయ్యాయని, వాటిని భర్తీ చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపాయి. ఆ ప్రకారం అనుమతి కోరామని పేర్కొన్నాయి. అనుమతి రాకుంటే ఆ సీట్లు మిగిలిపోతాయని వైద్యవర్గాలు తెలిపాయి.

సీ-కేటగిరీలో 13.90 లక్షల ర్యాంకుకు

చివరి విడత కౌన్సెలింగ్‌లో ఎన్నారై(సీ-కేటగిరీ) కోటాలో గరిష్ఠంగా 13.90 లక్షల నీట్ ర్యాంకర్‌కు సీటు దక్కింది. అలాగే బీ-కేటగిరీలో గరిష్ఠంగా 5.36 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చిందని హెల్త్ వర్సిటీ వర్గాలు తెలిపాయి. కాళోజీ ఆరోగ్య వర్సిటీ బీ, సీ కేటగిరీలో తుది విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారి జాబితాను ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే కన్వీనర్ కోటాలో అధిక ర్యాంకర్లకు సీట్లు వచ్చాయి. మేనేజ్‌మెంట్ కోటాలో మాత్రం గత ఏడాదికి అటూఇటుగా ఉన్న ర్యాంకర్లకు సీట్లు లభించాయి. ఈ ఏడాది మన రాష్ట్రంలో మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు రెండు డీమ్డ్ యూనివర్సిటీలుగా చివరి నిమిషంలో మారాయి. ఆ రెండు కాలేజీల సీట్లు ఈసారి డీమ్డ్ సీట్లుగా మారాయి. దీంతో ఆ రెండు కాలేజీలలోని సీట్లు రాష్ట్రానికి తగ్గాయి. సీట్లు తగ్గడంతో మేనేజ్‌మెంట్ కోటాలో పెద్ద ర్యాంకు విద్యార్థులు ఈసారి పెరగలేదు. ప్రభుత్వ రంగంలో కొత్తగా 8 మెడికల్ కాలేజీలు రావడంతో కన్వీనర్ కోటా సీట్లు 400 పెరిగాయి. దీంతో అధిక ర్యాంకు సాధించిన విద్యార్థులూ ఎంబీబీఎస్‌లో సీట్లను దక్కించుకున్నారు. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50% సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15% అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే.. వాటిని రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు.

ర్యాంకు లక్షల్లో.. సీటు 'ఏ'లో

ప్రస్తుత కౌన్సెలింగ్‌లో బీసీ-ఏ కేటగిరీలో గరిష్ఠంగా 3.36 లక్షల ఆలిండియా నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఏ-కేటగిరీలో సీటు వచ్చింది. ఈ స్థాయిలో ర్యాంకుకు సీటు దక్కడం ఇదే తొలిసారని కాళోజీ వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి మరో ప్రైవేట్ కాలేజీలో ఏ-కేటగిరీ సీటు దక్కింది. ఎస్టీ కేటగిరీలో 2.93 లక్షల ర్యాంకుకు, బీసీ-బీలో 2.29 లక్షలు, బీసీ-సీలో 3.15 లక్షలు, బీసీ-డీలో 2.14 లక్షలు, బీసీ-ఈలో 2.24 లక్షల గరిష్ఠ ర్యాంకులు సాధించిన వారికి కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు దక్కడం విశేషం. అలాగే ఓపెన్ కేటగిరీ(ఓసీ)లో 1.98 లక్షల ర్యాంకుకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో గరిష్ఠంగా 1.80 లక్షల ర్యాంకు సాధించిన విద్యార్థికి వైద్యవిద్యలో సీటు లభించింది.

మన్నించు మహాత్మా..!!

» గాంధీ విగ్రహం నోటిలో బాంబు పేల్చిన ఆకతాయిలు
» హైదరాబాద్‌లో నలుగురి అరెస్టు


గాంధీ విగ్రహం నోటిలో బాంబును వెలిగిస్తున్న ఆకతాయి

బోయిన్‌పల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు, సోషల్ మీడియా పైత్యంతో కొందరు విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు. ఇదే క్రమంలో కొందరు ఆకతాయిలు మహాత్మా గాంధీ విగ్రహం నోటిలో బాంబు పెట్టి పేల్చి వీరంగం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా, హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి కి చెందిన నలుగురు ఆకతాయిలను పోలీసులు అరెస్టు చేశారు. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో నివాసముండే ఓ యువకుడు(17) తన ముగ్గురు స్నేహితుల(16 ఏళ్ల వయస్సు)తో కలిసి తన బంధువులకు సంబంధించిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అక్కడ మద్యం సేవించిన వారంతా ఆ ప్రాంతంలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఓ యువకుడు గాంధీ విగ్రహం నోటిలో బాంబు పెట్టి వెలిగించాడు. బాంబు పేలిన వెంటనే వారంతా వెకిలిగా నవ్వారు. ఈ వీడియోను వారు స్నాప్‌చాట్‌లో పోస్ట్ చేయగా.. ఆ వీడియోను చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు ఆ నలుగురు ఆకతాయిలను అరెస్టు చేశారు.

మణుగూరులో విద్యుదాఘాతంతో ఇద్దరు సెక్యూరిటీ గార్డుల మృతి

» స్కూల్‌లో జెండాపైపును తొలగిస్తుండగా ఘటన



రత్నం, ఉపేందర్ (ఫైల్)

మణుగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మృత్యువు విద్యుదాఘాతం రూపంలో ఆ ఇద్దరు సెక్యూరిటీ గార్డుల దరి చేరింది. భద్రాద్రి జిల్లా మణుగూరుమండలం వాగు మల్లారంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శివలింగాపురం గ్రామానికి చెందిన బేతం రత్నం (59), కాళీమాత ప్రాంతానికి చెందిన తిగుళ్ల ఉపేందర్ (47) సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ శనివారం రాత్రి పాఠశాల ప్రాంగణంలో జెండా పైపును తొలగిస్తుండగా గోడపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు తగిలింది. దాంతో ఇద్దరూ విద్యుదాఘాతంతో మృతి చెందారు.

విద్యార్థి ఆయువు తీసిన ఎమ్మెల్యే పుట్టినరోజు ఫ్లెక్సీ

» తొలగిస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో మృతి
» హైదరాబాద్ బోయిన్‌పల్లిలో ఘటన

బోయిన్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. దానిని తొలగిస్తున్న క్రమంలో విద్యార్థి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఆదివారం జరిగింది. నాగోల్‌కు చెందిన సత్తు సాయిచరణ్ (19) ఇంటర్మీడియట్ చదువుతూ ఖాళీ సమయాల్లో జేబు ఖర్చుల నిమిత్తం ఫ్లెక్సీలను తొలగించే పనిచేస్తున్నాడు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోని చాయి అడ్డా బస్టాప్ వద్ద ఓ ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. వేడుకల అనంతరం సాయిచరణ్ దానిని తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే అతణ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇద్దరు విద్యార్థినుల పరిస్థితి విషమం

» ఇంకా ఆస్పత్రుల్లోనే 35 మంది వాంకిడి విద్యార్థినులు

వాంకిడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవుతున్న విద్యార్థినుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. శైలజ అనే విద్యార్థినికి వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. వీరికి తోడు శనివారం సాయంత్రం ఇద్దరు, ఆదివారం ఉదయం మరో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వాంకిడి ఆస్పత్రుల్లో చేర్పించారు. శనివారం మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఆస్పత్రులకు తరలించిన విద్యార్థినులు ఇంకా కోలుకోలేదు. ప్రస్తుతం మొత్తం 35 మంది విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. ఈ పాఠశాలలో గత బుధవారం నుంచి ఇప్పటివరకు అస్వస్థతకు గురైన వారి సంఖ్య 60 దాటింది.

బీసీల తెలంగాణ రావాలి: తీన్మార్ మల్లన్న

మిర్యాలగూడ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ సామాజికవర్గం నుంచి ఒక్కరూ ముఖ్యమంత్రి కాకపోవడమే బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిదర్శనమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చెప్పారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించిన బీసీగర్జన సభకు శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, డాక్టర్ చెరుకు సుధాకర్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతులు ఇవ్వకుండా బీసీ ఉన్నతాధికారులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. భూమి, నీళ్లు, నిధులు లేని తెలంగాణ వద్దని, బీసీల తెలంగాణ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీలో తాను నమ్మేది రాహుల్‌గాంధీ ఒక్కడినే అని మల్లన్న చెప్పారు.

ప్రాణాలు తీసిన క్రాస్‌వీల్

» గాలిలో విరిగిన క్రాస్‌వీల్ బాక్స్
» 20 అడుగుల ఎత్తునుంచి కిందపడి ఓ మహిళ దుర్మరణం
» మరొక మహిళకు తీవ్రగాయాలు
» తిరుపతి శిల్పారామంలో దుర్ఘటన


బాక్సు ఊడి కిందపడిన క్రాస్‌వీల్ ఇదే

తిరుచానూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శిల్పారామంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. క్రాస్‌వీల్ బాక్సు ఊడిపోవడంతో 20 అడుగుల ఎత్తుపై నుంచి పడి ఓ మహిళ చనిపోగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి సుబ్బారెడ్డినగర్‌కు చెందిన లోకేశ్వరి (25), చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన గౌతమి స్నేహితులు. ఆదివారం కావడంతో వారిద్దరూ మరికొందరితో కలిసి శిల్పారామానికి వచ్చారు. క్యాంటీన్ వద్ద క్రాస్‌వీల్ (జెయింట్ వీల్ తరహా) ఎక్కారు. లోకేశ్వరి, గౌతమి ఒకే బాక్సులో కూర్చున్నారు. క్రాస్‌వీల్ వేగంగా తిరుగుతుండగా వీరిద్దరూ కూర్చున్న బాక్సు ఉన్నట్టుండి విరిగిపోయింది. దీంతో 20 అడుగుల ఎత్తు నుంచి వీరిద్దరూ కింద పడిపోయారు. ఇద్దరినీ ఆటోలో రుయాకు తరలించగా.. లోకేశ్వరి అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. గౌతమిని మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్రాస్‌వీల్ యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కోమాలో ఉన్న వలస కార్మికుడి వైద్యానికి ముఖ్యమంత్రి సాయం

» పది నెలలుగా ఖతార్‌లో చికిత్స
» హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన కంపెనీ
» కుటుంబం విజ్ఞప్తితో స్పందించిన సీఎం.. నిమ్స్‌లో అడ్మిషన్‌కు చొరవ

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోమాలో ఉన్న వ్యక్తి వైద్యానికి సీఎం సాయం అందించారు. ఖతార్‌లో పనిచేస్తున్న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన బదనపల్లి సాయన్న తీవ్ర అనారోగ్యంతో కోమాలోకి వెళ్లాడు. పది నెలలుగా ఖతార్‌లోని ఆసుపత్రిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఉంటే పరిస్థితి మెరుగు పడవచ్చనే ఉద్దేశంతో కంపెనీ యాజమాన్యం శుక్రవారం ఖతార్ నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. అయితే తమకు ప్రైవేటులో చికిత్స అందించే ఆర్థిక స్థోమత లేదని సాయం చేయాలని సాయన్న భార్య, పిల్లలు సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎస్. వెంకట్రావు, సెక్షన్ ఆఫీసర్ చిట్టిబాబుకు ఆదేశించారు. వారు వెంటనే సాయన్నకు నిమ్స్‌లో అడ్మిషన్‌కు అనుమతి మంజూరు చేయించారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల గల్ఫ్ తదితర దేశాలలో పనిచేసే ప్రవాసీ కార్మికుల పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించడంతో వారికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించడం లేదని కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి అన్నారు. అచేతన స్థితిలో ఉన్న పేద వలస కార్మికుడు సాయన్నను ఆదుకొని నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్


శ్వేత యర్రం

తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీషు భాషా మాధ్యమం ద్వారా గ్లోబల్ తెర పైకి తెచ్చేందుకు ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. ఆ ప్రయత్నాల్లో ఒకటి అజు పబ్లికేషన్స్–ఛాయా పబ్లికేషన్స్ సంస్థలు రెండూ కలిసి 'TILT' (తెలుగు ఇన్ లిటరరీ ట్రాన్స్‌లేషన్) పేరుతో చేపట్టిన ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్. తెలుగు నుంచి ఇంగ్లీషుకు అనువదించే సామర్థ్యం గల అనువాదకులు కొందరిని ఎంపిక చేసి, వారికి ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్ మెంటార్‌షిప్‌లో, ఇతర ప్రపంచ స్థాయి అనువాదకుల ఆధ్వర్యంలో అనువాదంలో మెళకువలను బోధిస్తూ, అనుమానాలను నివృత్తి చేయటం ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అజు పబ్లికేషన్స్ కో ఫౌండర్/ డైరెక్టర్ శ్వేత యర్రం, ఛాయా పబ్లికేషన్స్ రిప్రజెంటెటివ్ మైత్రిలతో 'వివిధ' జరిపిన సంభాషణ ఇది.




మైత్రి

అనువాద వ్యాకరణం మనకింకా అలవాటు కావాలి!

ఈ ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్ గురించి చెప్పండి. ఈ ఆలోచన ఎలా కలిగింది?

రెండు ప్రచురణ సంస్థలు ఒక వేదిక మీదికి రావడం కావొచ్చు, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమైనా వ్యయ ప్రయాసలకు వెనుకాడకుండా ముందడుగు వేయడం కావొచ్చు... ఇలాంటి వర్క్‌షాప్ ప్రయత్నం మాకు తెలిసి బహుశా భారతీయ భాషల్లో మొదటిసారిగా జరుగుతున్నది.

తెలుగు భాషా సాహిత్యాన్ని ఇక్కడి స్థానిక రచనలతో పాటూ అనువాదాలూ సుసంపన్నం చేశాయి. రష్యన్ సాహిత్యం, శరత్ నవలలు, ఇంకా ప్రేమ్ చంద్, కిషన్ చంద్, తగళి శివశంకర పిళ్ళై, మహాశ్వేతా దేవీ, బిభూతి భూషణ్‌ల రచనలు... ఇలా చెప్పుకుంటే పోతే బోలెడంత మంది ఇతర భాషల రచయితలు తెలుగులో పరిచయమయ్యారు. అలానే, పక్క రాష్ట్రాల సాహిత్యం నుంచి ఇంగ్లీష్‌లోకి అనేక రచనలు వెళ్ళాయి. అక్కడి పాత తరమే కాదు, కొత్త తరం రచయితల రచనలు కూడా ఇంగ్లీష్ లోకి అనువాదం అవుతున్నాయి.



అలా చూసుకున్నప్పుడు, తెలుగు భాషా, తెలుగు సాహిత్యమూ ఎక్కడ ఉన్నాయీ అన్న ప్రశ్నే ఈ వర్క్‌షాప్‌కి బీజం వేసింది.

తెలుగు నుంచి ఇంగ్లీష్ అనువాదం మన దగ్గర చాలా తక్కువగా జరుగుతున్నది. అందువల్ల ఆ స్కిల్ సెట్ ఎక్కువగా పరిణతి చెందలేదు. అనువాదం అంటే కేవలం పదాల అనువాదం కాదు. ఆ రచన, రచయిత ఆత్మను పట్టుకోవడం. టార్గెట్ రీడర్స్ ఎవరని తెలుసుకొని అందుకు తగ్గట్లుగా అనువదించడం. అందుకు కసరత్తు అవసరం. అనువాదం ఇండియన్ ఇంగ్లీష్ లోకి వెళ్ళడం ఒక ఎత్తయితే, దాన్ని ఇంటర్నేషనల్ ఇంగ్లీష్‌లోకి తీసుకు వెళ్ళడం మరొక ఎత్తు. మేం ఎంచుకున్న అనువాదకులందరూ తెలుగు – ఇంగ్లీష్ భాషలపై పట్టు ఉన్నవారే, అంతర్జాతీయ సమకాలీన సాహిత్యం చదువుతున్నవారే. వారికి కాస్త శిక్షణ ఇస్తే అద్భుతాలు చేయవచ్చు అనిపించింది. పైగా ఎక్కువ శాతం పార్టిసిపెంట్స్ 35 ఏళ్ల లోపు వాళ్ళు కనుక స్కోప్ ఫర్ ఫ్యూచర్ డెవలప్మెంట్ ఎక్కువ.

ఈ ఆలోచన ఆచరణ దాకా రావటానికి జరిగిన ప్రయత్నం ఏమిటి? వర్క్‌షాప్ నిర్వహణకు ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్‌నే ఎందుకు ఎంపిక చేశారు?

మాటల మధ్యన వచ్చిన విషయాన్నీ ఇక్కడి దాకా తెచ్చింది మిత్రుడు అనిల్. ఆయన హర్షణీయం అనే పోడ్కాస్ట్ నడుపుతున్నాడు. అంతర్జాతీయ రచయితలూ, అనువాదకులతో అనేక ఇంటర్వ్యూలు చేశాడు. రాస్ ష్వార్జ్ ఈ ఆలోచనకి తగిన వ్యక్తి అని సలహా ఇచ్చింది తనే. ఐతే, రాస్ ఫ్రెంచ్ – ఇంగ్లీష్ అనువాదకురాలు కాబట్టి, తెలుగు తెలిసిన లోకల్ చెక్ పాయింట్స్ కూడా వర్క్ షాప్‌కి కావాలి అనుకున్నప్పుడు మాకు తట్టింది– రచయిత ఉణుదుర్తి సుధాకర్, అనువాదకుడు అవినేని భాస్కర్‌లు. అడగ్గానే వాళ్ళు కూడా ఒప్పుకొని మాకు భారం తగ్గించారు. రాస్ విషయానికి వస్తే ఆమె నాలుగు దశాబ్దాలుగా వంద పుస్తకాలను అనువాదం చేశారు. ఎన్నో ప్రసిద్ధ అంతర్జాతీయ బహుమతులూ అందుకున్నారు. ఆమె ఆధ్వర్యంలో మా పార్టిసిపెంట్స్ వివిధ పార్శ్వాలతో కలిసిన అనువాద వ్యాకరణం నేర్చుకుంటారని మా నమ్మకం.

వర్క్‌షాప్‌లు జరిగే తీరు ఎలా ఉంటుంది?

ఇది ఆరు నెలల వరకు, నెలకి మూడు గంటల పాటు జరిగే ఆన్‌లైన్ వర్క్‌షాప్. ఈ ఆరు నెలల్లో మా ఆరుగురు అనువాదకులు ఒక్కొక్కరూ సెషన్‌కు రెండేసి కథల చొప్పున అనువదిస్తారు. ప్రతి వర్క్‌షాప్ లోనూ ఆ అనువాదాల గురించి లోతుగా రాస్‌తో చర్చిస్తారు. రాసినదాన్ని మెరుగుపరిచే పద్ధతులను నేర్చుకుంటారు. ఇవన్నీ తరువాతి సెషన్‌కి వారు చేసే అనువాదాల్లో ఇంప్లిమెంట్ చేసుకుంటూ, కొత్త సమస్యలు ఎదురైతే వాటిని చర్చకు తీసుకొస్తారు. ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్, ఇడియమాటిక్ ఎక్స్‌ప్రెషన్స్ (నుడికారం), పఠనీయత లాంటి అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చిస్తారు, నేర్చుకుంటారు. ఇందుకు రాస్ ష్వార్జ్‌తో పాటు గెస్ట్ స్పీకర్స్ కూడా సహకరిస్తారు. తమ రచనల్ని చర్చిస్తూ, మెంటార్ల సలహాలు పరిగణిస్తూ సమన్వయంతో సాగే ఒక పూర్తి ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ ఇది.

తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు అనువదించే క్రమంలో ఎదురయ్యే ఏ అంశాలపై, సమస్యలపై ఫోకస్ పెడుతున్నారు?

అనువాదం అంటే కేవలం వెర్బాటిమ్ (ప్రతి పదం యథాతథంగా చేయటం) మాత్రమే కాదని చదువర్లుగా మేం నమ్ముతున్నాం. ఎంత కాదనుకున్నా అనువాదంలో కొంత నష్టం జరుగుతుందని మనం ఒప్పుకోవాలి. అలాగని పూర్తిగా భావమే విడిచిపెట్టి సొగసుగా నాలుగు మంచి పదాలు పొదిగి ఇచ్చేసి అనువాదం అంటే పెద్ద మోసమే కదా! పైన చెప్పినట్లుగా– అనువాదాల్లో సమస్యలు– ముఖ్యంగా ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్, రాస్ అన్నట్లు 'మ్యూజిక్ ఆఫ్ ది టెక్స్ట్', ఇవన్నీ చూసుకోవాల్సిన అంశాలు. దీనినే అనువాద వ్యాకరణం అని చెప్పుకోవచ్చు. దీని పైనే మా వర్క్‌షాప్ పూర్తి శ్రద్ధ పెడుతుంది.

వర్క్‌షాప్‌లో భాగంగా పార్టిసిపెంట్స్ చేసే అనువాదాలు కేవలం వర్క్‌షాప్ కోసమే గాక ASYMPTOTE, WORDS WITHOUT BORDERS లాంటి అనేక ప్రఖ్యాత అంతర్జాతీయ సాహిత్య జర్నల్స్‌లో ప్రచురితం అయ్యేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయాలన్నద దానిపై కూడా మెంటార్స్ ఫోకస్ చేస్తున్నారు.

తెలుగులోని ఏ రచనలను ఇంగ్లీషులోకి తీసుకువెళ్ళాలీ అన్న ఎంపిక ఏ ప్రాతిపదిక మీద చేయబోతున్నారు? అనువాదం జరిగాక ఆ పుస్తకాల మార్కెటింగ్ స్ట్రాటజీ ఏమిటి?

అనువాదం కేవలం సాహిత్య ప్రక్రియే కాదు, ఒక భాషా సమాజాన్ని మరో భాషా సమాజానికి పరిచయం చేయగలదు కూడా. మేము ఇంగ్లీష్ లోకి అనువాదం చేయించే రచనల్లో సమకాలీనతకి ప్రాధాన్యత ఇస్తున్నాం. లోకల్ ఈజ్ గ్లోబల్ అన్నవిధంగా– ఇక్కడి స్థానికత ఉట్టిపడుతూ, యూనివర్సల్ అప్పీల్ కూడా ఉన్న కథలని ఎంచుతున్నాం. ప్రస్తుతానికి, ఈ వర్క్‌షాప్ కోసం మా రెండు పబ్లిషింగ్ హౌసుల నుంచి వచ్చిన రచయితల కథలు మాత్రమే తీసుకున్నాం. ఇవన్నీ ఒక ఇంగ్లీష్ ఆంథాలజీగా తీసుకురావాలనేది మా ఉద్దేశం. ఏవి తీసుకోవాలీ అన్నది పూర్తిగా మా విచక్షణ. ముందుగా కథలను అనువదింపజేసి, వాటిని అంతర్జాతీయ సాహిత్య పత్రికల్లో ప్రచురణార్థం అయ్యేలా చూసి, తద్వారా అంతర్జాతీయ ప్రచురణకర్తలతో మాట్లాడి పుస్తకంగా తేవాలి అనుకుంటున్నాం.

పుస్తకాల మార్కెటింగ్ విషయంలో తప్పనిసరిగా ఒక స్ట్రాటజీ ఉండాల్సిందే అని నమ్ముతాం. పబ్లిషర్లుగా మేం ఇప్పుడు తెలుగులో ఇన్ని వేల పుస్తకాలు అమ్మగలుగుతున్నామంటే అదే కారణం. ఈతరం తెలుగు మాట్లాడే వాళ్ళందరూ తెలుగు చదవగలిగే వాళ్లు కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉండే ఇంగ్లీష్ భాషా పాఠకులు, మన దేశంలోని ఇంగ్లీష్ పాఠకులు, తెలుగు చదవలేక కేవలం మాట్లాడగలిగేవారు... వీరంతా మా టార్గెట్. వీళ్లదాకా మా అనువాద సాహిత్యం తీసుకు వెళ్ళడం కోసం అన్ని టచ్ పాయింట్స్‌నూ మేము దృష్టిలో ఉంచుకుంటాం. సోషల్ మీడియాలో కొత్త పాఠకులని చేరడం కూడా ఇందులో పెద్ద భాగమే. సమకాలీన తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీష్ పాఠకులకి అందించడం మా అనువాద లక్ష్యాల్లో ముఖ్యమైనది.

వర్క్‌షాప్ తొలి సెషన్లు ఎలా జరిగాయి?

వచ్చిన అప్లికేషన్స్‌ని ఫిల్టర్ చేసి ఆరుగురిని ఎంపిక చేశాం. మొదటి సెషన్ సెప్టెంబర్ 12న జరిగింది. పార్టిసిపెంట్స్ అనువాదం మొదలు పెట్టిన కథలని ఒక్కొకటిగా ఎంచి రాస్ ష్వార్జ్ వారి తోనే చర్చించారు. రాస్ ఇచ్చిన సూచనలు, సలహాలు, రేకెత్తించిన ప్రశ్నలు అన్నింటికీ పార్టిసిపెంట్స్ నుంచి గొప్ప స్పందన లభించింది. మున్ముందు సెషన్స్ కోసం ఉత్సుకంగా ఎదురు చూస్తున్నాం మేమంతా. ■

నూతన శిశువు బోసినవ్వు లాంటి పుస్తకం

'రాయడం అనేది సిగ్గు విడిచి చేసే ప్రక్రియ' అంటాడు ధీరజ్. విమర్శ మరీ సిగ్గు విడిచిన ప్రక్రియ అంటాను నేను. 'క్షణికాలు' అనే ఈ పుస్తకం చాల కొత్తగా ఉంది అని చెప్పడానికి నేనేం సిగ్గు పడడం లేదు. ధీరజ్ ఒక తాజా రచయిత. ఇప్పుడిప్పుడే పుట్టిన పాపాయి బోసినవ్వు ఈ రచనల సంపుటి.


సస్పెన్స్ అనిపించని సస్పెన్స్, సంఘస్పృహ అనిపించని సంఘస్పృహ ఈ రచయిత ప్రత్యేకత. ఆ రెండు లక్షణాలకు మచ్చుగా ఆయన అందించిన మొదటి రెండు కథలు చాలు. మిగతా అన్నిటిదీ అదే కోవ. ఆవు బొమ్మ గీసి కింద ఆవు అని రాస్తే తప్ప తృప్తిపడని సందేశాత్మకుడు కాదు ధీరజ్. మౌనానికి, ధ్యానానికి చోటు ఇచ్చే రచయిత.

మొదటి కథ ఉత్తమ పురుషలో ఉంటుంది. చెప్పే మనిషి పేరేందో తెలిసిపోతుంది గాని, ఈయన పేరు అదేనా, ఈ 'ఉత్తమ పురుషుడు' మరెవరిదో కథను ఇలా చెబుతున్నాడా అని ఒక రకం సస్పెన్స్ కథను చివరి కంటా చదివిస్తుంది. ఏతత్పురుషుడి మామ పెంచిన కుక్కల్లో ఒకదానికి ఇతడి పేరే పెట్టేరని క్లూ. ఆ కుక్క పేరు దత్తు. కథలో ఉన్నది అతగాడి బాల్యమని కథ శీర్షికలోనే ఉంది. మరి, మన 'ఉత్తమ పురుషుడి' పేరేంటబ్బా అని అడగాలనిపిస్తుంది ఒక్క క్షణం. 'సంజీవరెడ్డీ నీ కులమేమిటని అడుగుతావేంట్రా' అని 'రక్తకన్నీరు' నాటకంలో నాగభూషణం డైలాగు గుర్తుకొస్తుంది, లోలో విరిసే చిరునవ్వుతో పాటు. సో, మనోడి పేరు దత్తుగాడు అన్నమాట అనుకుంటాం, ఏదో పేద్ద సస్పెన్సు తొలగినట్టు. ఈలోగా కథలో కదిలే తెలంగాణ భాష సొగసు ఓ మంచి అనుపానం.

రెండో కథ 'సంభాషణ'. 'ఆయమ్మ' ఒక పేదరాలు. అంత పేదరికంలో తన రోగిష్టి మొగుణ్ని చక్కగా చూసుకుంటున్న ఆమె గొప్పదనాన్ని, అలాగని ఏ సతీ సావిత్రో కాకుండా 'గలీజు' అని అయినోళ్లతో అనిపించుకున్న ఆమె ఆడతనాన్ని చాల హృద్యంగా బొమ్మలు కట్టిందీ కథ. కథ ఎక్కడా బండగా అనిపించదు. కాలేజీ టీచర్స్ డే ఉత్సవాల ముగింపులో, రూములో చివరికి మిగిలిన ఇద్దరు టీచర్లు, ప్లస్ అక్కడికి ఊడవడానికి వొచ్చిన ఆయమ్మ... వీళ్ల మధ్య సంభాషణ... సరదాగా మొదలై మెల్లగా చాల నొప్పి కలిగించే బతుకు వాస్తవాలలోకి మనల్ని లాక్కుపోతుంది. ఆయమ్మ ముసలిదైంది. ఏమాత్రం డబ్బున్నా ఇంట్లో విశ్రాంతి తీసుకోవలసిన వయసు. కాలేజీలో కసవులూడ్చి శుభ్రాలు చెయ్యడం వంటి అలసట కలిగించే పనులకు వయసు కాదు. భర్త కడుపులో గడ్డతో మంచం దిగలేని స్థితిలో తిండి తినడానికి కూడా ఆయమ్మ సాయం కోసం ఎదురు చూస్తూ ఇంట్లో. అయితే ఏం చేయాలి? పోరాడాలి! ఎవరి మీద? ఆమెను గదమాయించే సార్లూ మేడమ్‌ల మీదనా, పనికి బొటాబొటి కూలీ, చేయని రోజుకు ఏమీ ఇవ్వని పీనాసి యజమానుల మీదనా, ఆమెను గలీజు మనిషి అనేసి తప్పుకునే దగ్గరివాళ్ల మీదనా, కథలో మన ఇద్దరు సార్లు వాళ్ల మనస్సులలో చేసినట్లు మన మీద మనమే పోరాడాలా? అన్నీ సరైన సమాధానాలే. అన్నిటికి తలుపులు తెరిచి ఉంచే సవినయ కథనం 'సంభాషణ'.

దిగంబర కవులు తమ రచనలను వచన పద్యాలని అననివ్వం, 'దిక్కు'లు అంటామన్నారు. ఇక్కడ తన పుస్తకంలో రచనలకు 'కొన్ని కథలు', 'కొన్ని క్షణాలు', 'కొన్ని తారలు', 'కాసింత శూన్యం'... అని సరదా పేర్లు పెట్టారు ధీరజ్. పఠన సౌలభ్యం కోసం కథలు, మ్యూజింగ్స్, కవితలు అని పేరు పెట్టుకుని చదువుకోవచ్చు. పుస్తకం శీర్షిక సూచించినట్టు అన్నీ 'క్షణికాలే'. అంటే రచయిత అనుభవించిన స్థలకాల శకలాలే. "పాడుతాతీయగాలాంటి ప్రోగ్రాం ఏదో వచ్చి వెళ్లిపోయే ముందు, మనుషుల మీదుగా టైటిల్స్ పోతూ ఉంటే వీళ్లకు గుల్‌గుల్ ఎందుకు అవ్వట్లేదు అని నోరెళ్లబెట్టి ఆశ్చర్యపడ్డ జ్ఞాపకం" అంటాడొక చోట. ఇలాంటి చిన్న చిన్న జ్ఞాపకాల సమాహారమే జీవితం. చాల అణువులు కలిసి ఒక దేహం, ఒక విశ్వ గోళం. చాల క్షణాలతో కలిసి జీవితం. ప్రతి క్షణాన్నీ జీవించాలి. ఆ క్షణంలోనే జీవించాలి. మునుపటి క్షణం మీద నిలబడిన ఇప్పటి క్షణమే మరు క్షణానికి పునాది.






సస్పెన్స్ అనిపించని సస్పెన్స్, సంఘస్పృహ అనిపించని సంఘస్పృహ ఈ రచయిత ప్రత్యేకత. ఆవు బొమ్మ గీసి కింద ఆవు అని రాస్తే తప్ప తృప్తి పడని సందేశాత్మకుడు కాదు ధీరజ్. మౌనానికి, ధ్యానానికి చోటు ఇచ్చే రచయిత.

ఇప్పటి తరం మునుపటి తరాల కన్న మెరుగ్గానే జీవిస్తోంది. అలా నడు ఇలా మాట్లాడు ఆ చిరుగుల టైట్ ప్యాంట్లేంటి, ఆ తెలుగుమీరిన ఇంగ్లీషేంటి అని మునుపటి తరాలు గొణగుతాయి. ఇవాళ ఉన్నవన్నీ మాండలికాలే. కొత్త తరం ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడుతోంది. కొత్త తెలుగు తయారవుతోంది. తప్పు కాదు. ఈ వ్యవహారాల్లోంచి పుట్టుకొచ్చే భాషే వ్యావహారిక భాష. ఈ పుస్తకంలో చాల చోట్ల ధీరజ్ ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడుతున్నాడని అనిపించింది. అది సహజం అనిపించింది కూడా. "...కొత్త ఉదయాల్లో ఉండే అర్థం కాని వెచ్చదనానికి ప్రతిచర్య పడదామని ఇదంతా" అంటాడు 'ఒక చిన్న సంగతి' అనే పుస్తక ప్రవేశికలో. 'రియాక్ట్ అవుదామ'ని ఆంగ్లంలో ఆలోచించిన తెలుగిది. మునుపు విద్యావంతులు సంస్కృతంలో ఆలోచించి తెలుగులో పద్యాలు రాశారు. ఆదికవులయి, కాలాన్ని వెలిగించారు. ఇప్పటి రచయితలు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగు మాట్లాడుతున్నారు. ఇక్కడ ఇచ్చిన ఉదాహరణ మరీ గహనంగా ఉంది గాని, ఈ భాష ఆహ్వానించదగినదే. ఈ చర్నింగ్‌లోంచే కొత్త జీవితానికి అవసరమైన, అనుగుణమైన భాష తయారవుతుంది. ఈ చర్నింగ్ ప్రాసెస్‌కు చక్కని ఉదాహరణ ధీరజ్ కశ్యప్ వేముగంటి.

■ హెచ్చార్కె
95023 45716



నేను అప్పటికి కొన్ని కథలు వ్రాసి వున్నప్పటికీ పుస్తకం వేసుకోవాలన్న ఆలోచన లేదు. అంటే నేను కూడా కథలు వ్రాయగలను పుస్తకం వేసుకోవచ్చు పరవాలేదు అనుకోలేదు. మీరు బాగా రాస్తున్నారు అని చెప్పి సంకలనం వేసుకోమని ప్రోత్సహించిన వారు పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు. ఆ సమయంలో ఆయన సీతా బుక్స్ పేరుతో తన 'ఇల్లాలి ముచ్చట్లు' వేసుకుంటున్నారు. పుస్తకాలు చదవడమే గానీ వాటి ప్రచురణ, ముద్రణల గురించి నాకేం తెలీదు. నా కథలు చాలావరకూ ఆంధ్రజ్యోతిలో వచ్చినవే. అందులో ఒక ప్రథమ బహుమతి కథ కూడా వుంది. నా పుస్తక ప్రచురణ బాధ్యత పురాణం గారికే అప్ప చెప్పాను. ఆయన కొడుకు నానీ గారు ముఖ చిత్రం వేశారు. అది నా మొదటి కథా సంకలనం. పురాణం నన్ను మెచ్చుకుంటూ ముందుమాట వ్రాసారు. కొంచెం ఉబ్బి తబ్బిబ్బులే!



ఆవిష్కరణ సభ పెట్టడం అదంతా నాకు తెలియదు. అసలు విషయం ఏమిటంటే నేను కూడా సభ పెట్టడం ఏమిటి? అని చాలా మొహమాటం. అది too humble కావచ్చు, ఆత్మవిశ్వాసం తక్కువ కావచ్చు కానీ అప్పట్లో అంతే. కానీ పురాణంగారు పట్టుపట్టడంతో కాంధారీ హోటల్‌లో చిన్న గెట్ టుగెదెర్‌లా పెట్టాను. పురాణం, నండూరి రామ్మోహనరావు, భమిడిపాటి జగన్నాథరావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, టి.ఎల్. కాంతారావు, వీరాజీ, నా స్నేహితురాలు సి. సుజాత అలా పదిహేనుమంది వచ్చారు. నా కథల గురించి సుబ్బరామయ్య గారు తప్ప అందరూ మాట్లాడారు. నిజంగా నేను కథలు బాగానే రాయగలనని నాకు తెలిసి పోయింది. మాకు ఫొటోగ్రాఫర్ లేదు, పత్రికా ప్రతినిధులను పిలవలేదు. సుజాత ఉదయం పత్రికలో మంచి రిపోర్ట్ వ్రాసింది. తరువాత పత్రికల్లో సానుకూలమైన ప్రోత్సాహజనకమైన సమీక్షలొచ్చాయి.

అదంతా ఒక ఎత్తు అయితే తరువాత ఒక రోజు జరిగిన అద్భుతం నిజంగా అద్భుతమే. ఆరోజు నేను మా బాల్కనీలో కూర్చుని బయటికి చూస్తున్నాను. మా గేటు దగ్గర ఒక రిక్షా ఆగింది. అందులో నుంచి దిగిన తెల్లబట్టల పెద్దాయన అచ్చం కాళీపట్నం మాస్టారులా వున్నారు. నా చిత్తభ్రమ కాకపోతే ఆయన ఎందుకు వస్తారు అనుకుంటూ వుండగా మా కాలింగ్ బెల్ మోగింది. నేను కలలో కూడా ఊహించని విధంగా కారా మాస్టారు మా ఇల్లు వెతుక్కుని వచ్చారు. నా జీవితంలో ఒక అద్భుతమైన క్షణం అది. ఆయన పుస్తకంలో లోపాలు చెప్పారు.

కారా మాస్టారు మా ఇల్లు వెతుక్కుని వచ్చారు!

నా మొదటి పుస్తకం

■ పి. సత్యవతి

కథల్లో లోపాలు కాదు. కథల కింద వాటి ప్రచురణ తేదీలు వేయకపోవడం, కథల్ని క్రానలాజికల్ ఆర్డర్‌లో పెట్టకపోవడం, అలాంటివి. మాస్టారు ఇంకో మాట కూడా అన్నారు– "ఇంత చక్కగా కథలు వ్రాసే నువ్వు బయటికెందుకు రావు? అందుకే నేను రావాల్సి వచ్చింది," అని. చాలా మొహమాటంగా వుండేదాన్ని. మెల్లగా బయటికి వచ్చాను నేను. కొన్ని కథల వలన కొంతమంది గుర్తుపట్టడం మొదలు పెట్టారు నన్ను. ఇదంతా 1989లో సంగతి. అప్పటి నుంచి మాస్టారు నాకు మంచి మిత్రులయారు. చివరి చివరలో నేను వ్రాసిన 'సప్తవర్ణ సమ్మిశ్రితం' కథ గురించి కూడా నాకు ఫోన్ చేసి మాట్లాడారు. నా మొదటి కథా సంకలనం వలన నాకు మంచి పరిచయాలు అయ్యాయి, స్నేహితులు దొరికారు, నమ్మకం వచ్చింది– నేనూ వ్రాస్తానని వ్రాస్తూ పోగలనని.

ఈమెయిల్: sathyavathi.pochiraju@gmail.com

కాళీపట్నం శత జయంతి సదస్సు

సాహిత్య అకాడమీ – రైటర్స్ అకాడెమీ, విశాఖపట్నం సంయుక్త నిర్వహణలో కాళీపట్నం రామారావు శత జయంతి సదస్సు నవంబర్ 9 ఉదయం 10 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు విజ్ఞానకేంద్రం, దాబాగార్డెన్స్, విశాఖపట్నంలో జరుగుతుంది. ఈ సందర్భంగా కాళీపట్నంపై మోనోగ్రాఫ్‌ను కె. శ్రీనివాసరావు ఆవిష్కరిస్తారు. అధ్యక్షత సి. మృణాళిని, గౌరవ అతిథి వి.వి. రమణమూర్తి, కీలకోపన్యాసం వివిన మూర్తి. సభలో ప్రసాద వర్మ 'కాళీపట్నం కథల్లో రాజకీయ సాంఘికాంశాలు', కె.ఎన్. మల్లీశ్వరి 'కాళీపట్నం కథల్లో కుటుంబ సంబంధాలు', జి. వెంకటకృష్ణ 'కాళీపట్నం కథా శిల్పం', జి.ఎస్. చలం 'కాళీపట్నం వ్యాసాలు', దాసరి రామచంద్రరావు 'కథా నిలయం కాళీపట్నం రామారావు', డి. హరనాథ్ (అర్నాద్) 'గురువుగా కాళీపట్నం' అంశాలపై ప్రసంగిస్తారు.

సాహిత్య అకాడమీ

ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డు ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీలో కవిత్వ విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ.40వేల బహుమతికి ఎంపిక కాగా, రాళ్ళబండి శశిశ్రీ 'అనుమంద్రం', తెలుగు వెంకటేష్ 'కబోధి చేపల కబుర్లు' ప్రత్యేక ప్రశంసకు ఎంపికయ్యాయి. ఎన్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' విశిష్ట పురస్కారానికి ఎంపికైంది. కథల విభాగంలో కె.వి. మన్ ప్రీతమ్ రూ.25వేల ప్రథమ, సయ్యద్ గఫార్ రూ.15వేల ద్వితీయ, కరీం రూ.10వేల తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కథలతో మరో తొమ్మిది కథలు కలిపి సంపుటిగా ప్రచురిస్తాం. వీటి రచయితలు– జి. ఉమామహేశ్వర్, సింహప్రసాద్, వేల్పుల నారాయణ, రాజా నరసింహ, రోహిణి వంజారి, సుగుణారావు, శాంతి ప్రబోధ, పి. కిషన్, శివప్రసాద్. డిసెంబర్ 15న ఖమ్మంలో పురస్కార ప్రదానం.

రవి మారుత్

దాపు

ఎంతకనీ అల్లుకపోను
ఎండి పోతవుంటే
కన్నీళ్లు వొంచుకోని
ఇగురేసుకుంటున్న

కార్తి ఎకసెక్కాలాడుతుంటే
సాలు మీద ఇత్తనం ఇగిలిస్తుంది
ఉలుకు లేదు పలుకు లేదు
ఊ అంటే ఉప్పనే
పేరుకే ఊయ్యాల జానయ్య
ఊగింది లేదు సచ్చింది లేదు అన్నట్టూ
ఒక దాని ఎనుక ఒకటి
ఎటు చూసినా కంప ఎట్టాలే
చెలగేసి చెలగేసి
దాపు కోసం...
దారులు వెతుకుతున్న

నిలబడ్డ కాడల్లా
నిన్నటి పొద్దే నిలదీస్తుంది
నీడలు సుట్టు ముట్టీ
కొలుపు చెబుతున్నయి
కనిపించని తెడల నేల
ఈద లేక కొట్టుక పోతున్న
మాయ చిక్కంలో పెద్ద చాపను

చెర్ల చాపలు కూడ
రంగు రంగుల జెండాలోలే తిరుగుతున్నయి
ఒడ్డు మీద కొంగలతొ పాటు
చాపల సేటు ఉండు
హౌరా లారీలెక్కుతుంటే చాపలు
నేను గులకరాల్లేంటా పడి పోతున్న

ఏముంది నాకు
ఏలు మీద ఎన్నికల మరక తప్పా
కళ్లతోనే కాంటా కొడుతున్రు
అమ్మ అడుగుల్ని
పొత పోసుకున్నా బాగుండేది
అడుగెనుక అడుగు పడేది

కట్టకు ఇటు కట్టకు అటు
వొడిపిల్లు లేదు వొలకసత్త లేదు
ఏసువాసు పట్కకు
సూరు కింద సుట్టకుదురై సుట్టుకున్న
కన్నీల్ల ఎసరు
కల్లం మొకం తిప్పుకుంది
కాలం కడకు జరిగింది
ఎవడు దిగి ఎవడు ఎక్కిన
దిగులు మేఘమే కమ్ముకునేది

కండ్లల్లా కనగులు తిరిగిన
కట్ట మైసమ్మ కట్ట దిగకుండ
కాకిచిత్తర కాల్చి పెట్టిన
ఎద్దుల్లేవు సుద్దుల్లేవు
ఎల్లమ్మ ఎల్లి పోతుంటే కాళ్ల ఏళ్ల పడ్డా
ఉప్పలమ్మా పోకుండా
ఊరి పొలిమేర దగ్గర నిలబడ్డా
బతుకు పందెం పడని పచ్చీసు
పడి మీద పక్షి కన్నీళ్లు కార్చిన
ఇమానం తప్పిన కొడుకు
విమానం దిగలే
చెట్టూ పుట్టే ఆకరి తానమాడే ఊరి పాలోల్లు
లో లోపలి దాపులోకి నిశబ్దంగ జారుకున్న

■ మునాసు వెంకట్
✆ 99481 58163



సిద్దిపేట్ టూ మస్కట్ వయా హైదరాబాద్

పోవాలని ఏనాడూ ఉండదు,
నిమ్మళం లేని బతుకు ఉండనీయదు.

కాలు ఇంట్లో ఉంటే కడుపాకలి తీరదు,
రెక్క విచ్చుకున్న మరుక్షణం
కంటతడి ఆరదు...

ఇదే చివరిదని తలచిన ప్రతిసారీ,
చివర్లన్నీ కొత్త కలతలకు చివుర్లేస్తూ...
కలతలన్నీ మొదలుకంటా చిదిమేస్తూ...

అప్పుడే పుట్టిన చంటిబిడ్డనూ,
మంచం పట్టిన ముసలి తండ్రినీ,
తొక్కు నూరిన పొట్లాల్ని
ముప్పై కిలోల మూటలో సర్దుతూ,
కంటి చెమ్మను కప్పెట్టి కలియదిరుగుతున్న
ఆలి అవస్థనూ,
తోలీయనీకొచ్చిన ఎదురింటి జరీనాపను అలుముకుని పుట్టెడు శోకాన్ని కుమ్మరించిన తల్లి
కన్నపేగు తీపినీ,
ఇట్లా బంధాలన్నిటినీ విడిచేసి,
నావైన చేతుల్ని విరిచేసి,
నావి కాని రెక్కల్ని తొడుక్కున్నప్పుడల్లా,
దేహమొక దుఃఖ మేఘం,
ఇల్లేమో దిగులు కార్ఖానా...

"సిద్దిపేట్ టూ మస్కట్
వయా హైదరాబాద్"

ఒక్కో ఊరూ దాటిపోతోంది,
ఒక్కో చుక్కా రాలిపడుతోంది,
అశ్రువులన్నిటినీ పోగేసి,
కాలం దుఃఖపు పంటను సాగుచేస్తోంది...

అంధకారం నుండి అంధకారం వైపు
పయనిస్తున్న తొవ్వలో,
కళ్లల్లో సముద్రాలు మొలుస్తున్న అలికిడి,
కలవరింతల కత్తులు, కలల్ని పొడుస్తున్న
సలపరింత...

పైకంతా ప్రశాంతం గానే ఉంటుంది,
ముఖం లోనూ ఎలాంటి అలజడుండదు...
లోపల్నుండి ఉబికిన వాళ్ళు జలపాతాలై
జారుతున్న స్పర్శ...

"లేడీస్, అండ్ జెంటిల్మెన్ దిస్ ఈజ్ యువర్
కెప్టెన్ స్పీకింగ్, వీ విల్ బీ అరైవింగ్ ఎట్ అవర్
డెస్టినేషన్ షార్ట్‌లీ..."

✣✣✣

"జత్తన్ సే జా బేటా" అంటూ,
నా హిఫాజత్‌కై దువా చేసి,
తడికళ్ళతో తడిమిన ఇమామెజామిన్‌ను
భుజానికి ముడేసింది అమ్మీ....

విప్పేటప్పుడు
తాయత్తులోంచి జారిపడ్డ రూపాయి
బిళ్ళ శబ్దానికి రియాల్ కలలు రక్తం
కక్కుకున్నట్టు తనకెట్లా చెప్పను...?!

■ జాబేర్ పాషా
✆ 00968 78531638 (మస్కట్)

- జత్తన్ = జాగ్రత్త
- హిఫాజత్ = క్షేమం
- దువా = ప్రార్థన
- ఇమామెజామిన్ = సురక్షితంగా వెళ్లి, రావాలని భుజానికి కట్టే తాయత్తు
- రియాల్ = మస్కట్ కరెన్సీ



మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

మడికొండలో సీఎం రేవంత్‌రెడ్డి

- జంగా రాఘవరెడ్డి కూతురి వివాహానికి హాజరు
- నూతన వధూవరులకు ఆశీర్వాదం
- డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు సైతం
- సీఎం పర్యటన సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు

8



ప్రజలకు సీఎం అభివాదం



మడికొండలోని సత్యసాయిగార్డెన్‌లో నూతన వధూవరులతో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు

బడ్జెట్‌లో ఘనం ఇచ్చింది తృణం



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఈ యేడు ప్రకటించిన బడ్జెట్ వరంగల్ నగర ప్రజలకు అందని ద్రాక్షలా మారింది. 2024-2025 సంవత్సరాలకు గాను బల్దియా రూ.650.12 కోట్లు ప్రకటించింది. అయితే 15వ ఆర్థిక సంఘం మిగులు నిధులు కలుపుకుని బల్దియా బడ్జెట్ ప్రకటించినా.. ఇప్పటికీ అతీ గతీ లేదు. ప్రకటించిన బడ్జెట్‌లో ఇప్పటి వరకు 4శాతం మాత్రమే నిధులు విడుదల కావడంతో ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం విడుదల చేసిన రూ.26కోట్ల నిధులు ఒక్క ఇంజనీరింగ్ విభాగానికే ఖర్చు చేశారు. కాగా, బడ్జెట్ విడుదల అంశంపై ప్రజాప్రతినిధులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని బల్దియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మాత్రమైనా నగరం అభివృద్ధి చెందిందీ.. జంక్షన్‌లలో సుందరీకరణ జరుగుతోందంటే అది స్మార్ట్‌సిటీ నిధులనుంచేనని అధికారులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇంకా బల్దియా పన్నులు, ఇతర ట్యాక్స్‌ల రూపంలో వసూలు చేస్తున్న డబ్బులు.. సిబ్బంది జీతాలకు, ఇతరత్రా ఖర్చులకే సరిపోతున్నాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్లనే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల మంజూరులో జాప్యం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. అయితే బల్దియా ఉన్నతాధికారులు, పాలకవర్గం మాత్రం డాంబికాలు చెప్పుకోవడం తప్ప.. ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి.

కిందటేడు 17 శాతం నిధులే విడుదల

వరంగల్ బల్దియా పాలకవర్గం 2023-2024 బడ్జెట్‌లో వివిధ అభివృద్ధి పనులకుగాను రూ.523 కోట్లు ప్రకటించింది. బల్దియాకు వివిధ రకాల ట్యాక్స్‌లు, భవనాల అద్దెలరూపంలో వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. సుమారు వంద కోట్ల రూపాయల వరకు బల్దియాకు పన్నుల రూపంలో సొంత ఆదాయం రాగా, మిగతా నిధులు ఎమ్మెల్యే, ఎంపీ ల్యాడ్స్‌తో పాటు నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, విలీన గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, లోతట్టు ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం చేపడతారు. అయితే ప్రకటించిన బడ్జెట్‌లో రూ. 90.75కోట్ల నిధులు మాత్రమే విడుదలైనట్టు అధికారులు వెల్లడించారు. అంటే ప్రకటించిన బడ్జెట్‌లో 17 శాతం నిధులే విడుదలయ్యాయి. మిగులు నిధులతో పాటు ఈ యేడు బడ్జెట్ ప్రకటించినా ఇప్పటికీ 4 శాతం మాత్రమే నిధులు బల్దియా ట్రెజరీ విభాగంలో జమ కాగా, ఉన్న నిధులనే కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు కొద్ది కొద్దిగా బిల్లులు చెల్లించినట్టు తెలుస్తోంది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

బల్దియాలో గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులకు మోక్షం రాకపోవడంతో తీవ్ర మనోవేదనతో ఉన్నారు. బడా, చోటా కాంట్రాక్టర్లకు కలుపుకుని సుమారు రూ.వెయ్యి కోట్లకు పైనే బకాయిలు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో విలీన గ్రామాలతో పాటు నగరంలో కొత్త పనులతో పాటు మధ్యలో నిలిచిపోయిన పనులకు టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కొందరు చిన్నపాటి కాంట్రాక్టర్లు భార్య, పిల్లలపై ఉన్న బంగారం విక్రయించి రోడ్లు, డ్రైనేజీల పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయకపోవడంతో బల్దియా కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కమిషనర్‌ను కలిసి గోడు విన్నవించడంతో వరుస క్రమంలో బిల్లులు మంజూరు చేస్తామని చెప్పడంతో కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే అకౌంట్ సెక్షన్ నుంచి ఎప్పుడు పిలుపు వస్తుందా? అని కొందరు కాంటాక్టర్లు చెట్ల కింద కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు బల్దియాకు రూ.1000కోట్లు విడుదల చేస్తే తప్ప.. వరంగల్ బల్దియా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించే సంక్షోభం నుంచి బయటపడదనే వాదనలు వినిపిస్తున్నాయి. మేయర్‌తో పాటు కమిషనర్ రాష్ట్ర నాయకత్వంతో పాటు సీడీఎంఏ అధికారులపై ఒత్తిడి తేస్తే తప్ప బల్దియాలో అభివృద్ధి పనులు ముందుకు సాగవని కార్పొరేటర్లు చెప్పుకొస్తున్నారు.

- బల్దియా బడ్జెట్ కేటాయింపులో 4 శాతం నిధులే విడుదల
- ప్రకటించిన పద్దులపై పట్టింపులేని కార్పొరేషన్ అధికారులు
- నిధులు లేక నగరంలో నిలిచిన అభివృద్ధి పనులు
- బిల్లులు అందకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- కార్పొరేటర్లకూ అందని ప్రత్యేక నిధులు

బడ్జెట్‌లో బల్దియాకు కేటాయించిన నిధులు :	రూ.650.12కోట్లు
ఇప్పటి వరకు విడుదలైన నిధులు :	రూ.26 కోట్లు
తక్షణమే విడుదల చేయాల్సిన నిధులు :	రూ.1000కోట్లు

కార్పొరేటర్లకు అందని నిధులు

66 డివిజన్‌లలో కార్పొరేటర్‌లు కాలనీలను అభివృద్ధి చేసుకునేందుకు గత ప్రభుత్వం ప్రతీ కార్పొరేటర్‌కు రూ.5లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే ఈ రెండేళ్లుగా నయాపైసా ఇవ్వలేదని కార్పొరేటర్లు మండిపడుతున్నారు. నిధులు, పనులు లేక డివిజన్‌లో తలెత్తుకోలేకపోతున్నామని కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ తీరును జీర్ణించుకోలేక కొందరు సొంత పార్టీకి చెందినవారే అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఇప్పటికీ సన్నాహాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి పరుస్తాం..

- భద్రకాళి చెరువు కబ్జాదారులపై కఠిన చర్యలు
- అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేస్తాం..
- కేంద్రం అనుమతి ఇస్తే అందుబాటులోకి మామునూరు ఎయిర్‌పోర్టు
- మీడియాతో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో రాజధానిగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరుస్తామని, భద్రకాళి చెరువు స్థలాలను కబ్జా చేసిన కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం వరంగల్ పర్యటనకు విచ్చేసిన మంత్రి.. స్థానిక ఎమ్మెల్యేలు, మేయర్, ఎమ్మెల్సీ, కలెక్టర్లు, కుడా అధికారులతో కలిసి భద్రకాళి బండ్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం చారిత్రక భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన వరంగల్‌ను రాష్ట్రంలోనే రెండో రాజధానిగా అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దశాబ్దాల కాలం తరువాత మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఉన్న అవంతరాలన్నీ తొలిగిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే మామునూరు ఎయిర్ పోర్టు ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. దాదాపు 600 ఏళ్ల కిందటి భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. అమ్మవారి ఆలయానికి మాఢవీదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయానికి ఆనుకుని ఉన్న భద్రకాళి జలాశయం 250 ఎకరాల పైచిలుకు ఉండేదని, కానీ స్టోరేజీ వాటర్ నిల్వ రోజురోజుకూ తగ్గుతోందన్నారు. పరిస్థితులను దృష్టిలో పెట్టి భద్రకాళి జలాశయాన్ని తాగునీటి జలాశయంగా మారుస్తామని మంత్రి చెప్పారు. చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయిందని, చెట్లుచేమలతో ఉందని, దాన్ని శుభ్ర పరుస్తామన్నారు. భద్రకాళి చెరువు స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో మంత్రి ప్రత్యేక పూజలు

భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆలయ ఈవో శేషు భారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళి శేష పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి పొంగులేటి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, అమ్మవారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రాలను ఈవో అందజేశారు. ఈ సందర్భంగా మాఢవీదుల నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో చర్చించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్యశారద, ఈవీ శ్రీనివాస్, స్థానిక నేతలు అధికారులు పాల్గొన్నారు.



సీతంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూల వనంలా సీతంపేట

- వైభవంగా దీపావళి బతుకమ్మ వేడుకలు
- ముగిసిన మూడురోజుల సంబురం
- పెద్దఎత్తున పాల్గొన్న నేతకాని కులస్థులు

8

పట్టణ భూములకూ పక్కా నక్షాలు

శ్రీకారం చుట్టిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు

పైలెట్ ప్రాజెక్టు కింద వర్ధన్నపేట, మహబూబాబాద్ మున్సిపాలిటీలు ఎంపిక

ఈ రెండింటిలో త్వరలో సమగ్ర భూముల సర్వే

బహిర్గతం కానున్న కబ్జాల బాగోతం

6

సమాచారం

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

- బడ్జెట్‌తో సంబంధంలేని హామీలతో మోసం
- ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు..
- కాంగ్రెస్ పాలనలో చీకట్లు తొలగాయనడం అబద్ధం
- నిర్మల్ ఎమ్మెల్యే, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రజలు ఎగవేతల రేవంత్‌రెడ్డి అని అభివర్ణిస్తున్నారని నిర్మల్ ఎమ్మెల్యే, శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని వేదబ్యాంకెట్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్‌తో సంబంధలేని 420 హామీలు ఇచ్చి అమలుచేయకుండా రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మాటలు చూస్తుంటే.. మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్‌ను అభాసుపాలు చేసే విధంగా అమలుకు నోచుకొని హామీలిచ్చి రేవంత్‌రెడ్డి పార్టీని తప్పుదోవ పట్టించాడని ఖర్గే వాఖ్యలు ఉన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల్లో చీకట్లు తొలగి వెలుగులు నిండాయని ప్రధానికి బహిరంగ లేఖ రాయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. ప్రజల్లో వెలుగులు రావడం కాదు.. తన కుటుంబం, కోటరీ, గుత్తేదారుల్లో వెలుగులు వచ్చాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లు తయారైందని అన్నారు. ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టించేవిధంగా అవాస్తవాలతో ప్రధానికి లేఖ రాశారన్నారు.

కాంగ్రెస్ హామీల్లో ఏ ఒక్క హామీ అమలుచేసినట్లు ఒప్పుకున్నా.. బహిరంగ చర్చకు రావాలని మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. వరంగల్ గడ్డ సాక్షిగా రాహుల్‌గాంధీని తీసుకువచ్చి రైతు డిక్లరేషన్‌తో రాష్ట్ర రైతాంగానికి హామీ ఇచ్చి 11 నెలలైనా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదన్నారు. యువ డిక్లరేషన్ పేరుతో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి గద్దెనెక్కి 10శాతం కూడా నింపలేదన్నారు. వృద్ధులకు పెన్షన్ రూ.2000 నుంచి రూ.4000 వరకు పెంచుతానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. రాష్ట్రంలోని వృద్ధులకు ఒక్కొక్కరికి 11నెలల నుంచి రూ.22,000 కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. సోనియాగాంధీ జన్మదినం రోజు మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పారని, ఆపై ఆర్థిక మంత్రి డబ్బులు ఇవ్వలేమని చెప్పారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అని చెప్పి ఆయా వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వరి కోతలు పూర్తవుతున్నప్పటికీ రైతాంగంపట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేదన్నారు. డిసెంబర్ 7న అభయహస్తంను చట్టబద్ధత చేస్తానని చెప్పి మళ్లీ డిసెంబర్ వచ్చినా చట్టబద్ధతకు జాడే లేదన్నారు. అభయహస్తం.. భస్మాసుర హస్తం, కపట హస్తం, కుటిల హస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, అరాచకం బాగా పెరిగిపోయిందన్నారు. సీఎంకు, మంత్రుల మధ్య సఖ్యత లేదని, పొంగులేటికి, రేవంత్‌రెడ్డికి పదవీ గండాలు పొంచి ఉన్నాయన్నారు. ఈడీ విచారణ పూర్తైన తర్వాత పొంగులేటి పరిస్థితి ఏంటో చూడాలన్నారు. తనకు ఉన్న సమాచారం మేరకు ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు విలేకరుల అడిగిన ప్రశ్నలకు మహేశ్వర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, తోపుచర్ల మధుసూదన్, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

వడ్డేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని బీఆర్ఎస్ జిలా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఆటోడ్రైవర్ల కోసం కార్మిక బోర్డును ఏర్పాటు చేసి నెలకు రూ.12వేల భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియర్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాలో యూనియన్లకు అతీతంగా ఆటోడ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు రవీందర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరామ్, యాదగిరి, స్వామి, శ్రీధర్‌రెడ్డి, కుమారస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చాలి

- ఎమ్మెల్సీ కోదండరామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరామ్

వడ్డెపల్లి, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ ఉద్యమకారులను ఆకాంక్షలను ప్రభుత్వమే నెరవేర్చాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నెరెళ్ల వేణుమాధవ్‌కళా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక చైర్మన్ కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఉద్యమకారుల గర్జన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

గత బీఆర్ఎస్ హయాంలో నిత్యం నిర్బంధమే ఉండేదని, కనీసం మిలియన్‌మార్చ్‌కు సైతం వెళ్లకుండా తనతో పాటు ఉద్యమకారులను అడ్డుకున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ఉద్యమంలో పాల్గొన్నవారే రాయాలని, లేదంటే ఉద్యమంలో లేని వారు ఉద్యమ చరిత్రను తప్పుగా లిఖించే ప్రమాదం ఉందన్నారు. ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు సాగితే వారి హక్కులను సులభంగా సాధించవచ్చని స్పష్టం చేశారు. తెలంగాణ వనరులు తెలంగాణకే దక్కాలనే నినాదంతో ఉద్యమకారులు సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సమాజ విముక్తి కోసం, స్వయం పాలన కోసం త్యాగపూరిత పోరాటాలు చేసిన ఉద్యమకారులే కేసీఆర్ దుష్టపాలనకు చరమగీతం పాడారన్నారు. ఈ సందర్భంగా బుల్లెట్ వెంకన్న బృందం కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ సభలో అంబటి శ్రీనివాస్, సాయిని నరేందర్, సోమ రామమూర్తి, కొండ్ర నర్సింగరావు, జయ్‌సింగ్‌రాథోడ్, అంజన్‌రావు, డాక్టర్ అనిఖ్ సిద్ధిఖీ, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, సోమిడి శ్రీనివాస్, నయీమోద్దీన్, వినోద్‌కుమార్, సాంబన్న పాల్గొన్నారు.

ఎంజీఎంలో మందుల కొరత లేదు..

డాక్టర్ చిలుక మురళి, సూపరింటెండెంట్ ఎంజీఎం వరంగల్

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: ఎంజీఎం ఆస్పత్రిలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయా..?

డాక్టర్: గతంలో కంటే మందుల సరఫరా చాలా మెరుగైంది. ఎంజీఎం ఏ రకమైన మందుల కొరత లేదు.

ఆంధ్రజ్యోతి: సాయంకాలం ఓపీ నడుస్తోందా?

డాక్టర్: ఆరు విభాగాలలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నడుస్తున్నాయి. రోగుల సంఖ్యకూడా పెరిగింది.

ఆంధ్రజ్యోతి: ఓపీ రిజిస్ట్రేషన్‌లో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

డాక్టర్: ప్రస్తుతం ఇరుకైన గదుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తోంది. పాత రేకుల షెడ్డులో ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. త్వరితగతిన పూర్తిచేసి రోగుల ఇబ్బందులు తొలగిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఎంజీఎంలో పార్కింగ్ సమస్య అధికంగా ఉంది కదా?

డాక్టర్: రోగులు, సిబ్బంది సంఖ్య పెరగడంతో పార్కింగ్ సమస్య కూడా అధికమైంది. ఇటీవలే రెండు ప్రదేశాలలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం. మరోచోట కూడా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం.

ఆంధ్రజ్యోతి: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చాలా సమస్యలు ఉన్నాయి?

డాక్టర్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సెంట్రల్ ఏసీ పని చేస్తోంది. ఆపరేషన్ థియేటర్లు అన్ని కూడా అందుబాటులో ఉన్నాయి. రోగుల సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: డయాలసిస్ గురించి?

డాక్టర్: డయాలసిస్ రోగుల కోసం 24 పడకలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నీళ్ల సమస్య కూడా తీరింది. ఓ ప్రత్యేక పైపులైన్‌కూడా ఏర్పాటు చేశాం. మరో బోరు కూడా వేయిస్తాం. అదే విధంగా ఎంజీఎం నుంచి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌ను సూపర్ స్పెషాలిటీ పంపిస్తాం.

- వరంగల్ మెడికల్ (ఆంధ్రజ్యోతి)

పట్టణ భూములకూ పక్కా నక్షాలు

● శ్రీకారం చుట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● పైలెట్ ప్రాజెక్టు కింద వర్ధన్నపేట, మహబూబాబాద్ మున్సిపాలిటీల ఎంపిక ● తేలనున్న ప్రభుత్వ భూములు.. బహిర్గతం కానున్న కబ్జాల బాగోతం



మానుకోట మునిసిపాలిటీ కార్యాలయం

హనుమకొండ, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ భూములకు పక్కాగా లెక్కలుండేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. సాగు భూములకు నక్షా పటాలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అందులో భూములకు సరిహద్దులు, దారులు, బావులు, సర్వే నెంబర్లు ఇలా సమాచారం అంతా ఆ నక్షా పటాల్లో ఉంటుంది. నక్షా పటాల ఆధారంగానే సాగు భూముల సర్వే నిర్వహిస్తుంటారు. పట్టణాలకు సైతం నక్షా పటాలు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణాలకు సైతం నక్షా పటాలు రూపొందించేలా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 పట్టణాలకు నక్షా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. అందులో రాష్ట్రం నుంచి ఎనిమిది పట్టణాలుండగా, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రెండు మున్సిపాలిటీలు వర్ధన్నపేట, మహబూబాబాద్ ఉన్నాయి. వీటిని పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మిగతా పట్టణాల్లో విర్యాలగూడ, జగిత్యాల, మణుగూరు, జడ్డర్ల, (బాదెపల్లి మున్సిపాలిటీ) హుస్నాబాద్, కొడంగల్ ఉన్నాయి.

ప్రాపర్టీ కార్డులు

సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక భూమి కొలతలు, దస్త్రాల నిర్వహణ, రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కింద పట్టణాలకు నక్షాలను రూపొందిస్తారు. ప్రతి ఇల్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నిక్షిప్త పరుస్తారు. అనంతరం ఇల్లు లేదా ఆస్తికి 'ప్రాపర్టీ కార్డులు' అందచేజేస్తారు. వచ్చే డిసెంబరు నాటికి పైలెట్ సర్వే పూర్తిచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన వర్ధన్నటపే, మహబూబాబాద్ పురపాలికల పరిధిలోని భూములను సమగ్రంగా సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉందని అంటున్నారు.

తేలనున్న భూముల వివరాలు

ఈ సర్వే ద్వారా వర్ధన్నపేట, మహబూబాబాద్ పురపాలిక పరిధిలోని ప్రభుత్వ స్థలాలకు సంబంధించి విస్తీర్ణాలు, వాటి హద్దులను అధికారులు గుర్తించనున్నారు. ఇప్పటివరకు అన్యాక్రాంతమైన భూముల వివరాలు తేలనున్నాయి. ఈరెండు పురపాలిక పరిధిలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటల భూ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మురికి వాడలు, బస్తీలు, కాలనీల్లోని చిన్నచిన్న ఇళ్ల స్థలాలకు సైతం పటాలు రూపొందించనున్నారు. తొలుత రాష్ట్రంలో ఎంపిక చేసిన పట్టణాల్లో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్లతో ఛాయాచిత్రాలు రూపొందిస్తోంది. అనంతరం వాటి పరిశీలన పూర్తి చేసి క్షేత్ర స్థాయిలోసర్వే చేయనున్నారు. పురపాలక సంఘాల్లోని ప్రభుత్వ స్థలాల గుర్తింపు అనంతరం అవి భూనిధిగా ఉపయోగపడనున్నాయి. ఆక్రమణలూ తేలనున్నాయి. అయితే 1/70 చట్టం పరిధిలోని పురపాలికలో భూములు కొని నివాసముంటున్న గిరిజనేతరుల ఇళ్లు, ఇస్తులకు ప్రాపర్టీ కార్డులు ఎలా జారీ చేస్తారనే విషయంపై స్థానికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గిరిజనేతరులు కొన్ని భూములకు బ్యాంకులు సైతం రుణాలివ్వడం లేదు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వమే ప్రాపర్టీకార్డులు జారీ చేసి వాటి ద్వారా రుణాలు పొందే వెసులుబాటు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వర్ధన్నపేట, మహబూబాబాద్ మున్సిపాలిటీలు 1/70 చట్టం పరిధిలోకి రావు. కనుక ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు.



వర్ధన్నపేట మునిసిపల్ కార్యాలయం

సెకండరీ గ్రేడ్ టీచర్లపై పనిభారం తగ్గించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లపై పనిభారం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాడుగుల పర్వత్‌రెడ్డి, జి.సదానందంగౌడ్ అన్నారు. హనుమకొండలో కామగోని రాంబాబు అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లపై పనిభారం ఎక్కువగా ఉందని, ప్రాథమిక పాఠశాలల పనివేళలు 1 గంట భోజన విరామంతో కలుసుకొని 7గంటల పనివేళలు మాత్రమే ఉండాలని విద్యాహక్కు చట్టం సూచిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షకులైన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాల టైం టేబుల్స్ పాటించాలని, ప్రాథమిక పాఠశాల పనివేళలు పెంచుతూ ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా విద్యాహక్కు చట్టం ప్రకారం పనివేళల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రవి, సాంబయ్య, రమేశ్, సుధాకర్‌రెడ్డి, మధులిమాయే, నాగరాజు, మధుసూదన్, సతీష్ కుమార్, గణేష్, తిరుపతి, విద్యాసాగర్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

బీసీ గణన పారదర్శకంగా నిర్వహించాలి

మెపా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జగన్ మోహన్ ముదిరాజ్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల, సామాజిక, ఆర్థిక గణనను సమర్థవంతంగా నిర్వహించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బీసీ కులాల ప్రజలు వెనుకబడి ఉన్నారని, వారికి న్యాయం చేయాలనే ఆలోచనతో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన సామాజికవర్గం ముదిరాజ్ అని పేర్కొన్నారు. ఈ సర్వే ఆధారంగానే ఇక మీదట ప్రభుత్వ పథకాలు వర్తింపజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వే అధికారులకు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని చెప్పారు. మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగాల్లో, ఉపాధి అవకాశాల్లో ముదిరాజ్ బిడ్డలు ముందువరుసలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సంజీవ్ కుమార్, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, ఈరబోయిన వినోద్ ముదిరాజ్, పోలు శ్రీనివాస్, దండు చిరంజీవి, చిరుత వెంకటేశ్వర్లు, పెండ్యాల కృష్ణ, నూనె శివ, కొలిమి ప్రభాకర్, బోయిని సత్యనారాయణ, వంచర్ల వేణుగోపాల్, దేవర రవీందర్, బోయిని రవీందర్, పులి సదానందం, కూతురు రాజు, పిట్టల రమేశ్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జగన్ మోహన్ ముదిరాజ్

రైలు కిందపడి సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఆత్మహత్య



కాంతయ్య(ఫైల్)

గిర్మాజీపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న సింగరేణి రిటైర్డు ఉద్యోగి కుసుమ కాంతయ్య (74) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ విలే ఖరులకు తెలిపిన ప్రకారం.. జయశంకర్ భూపా లపల్లి జిల్లా కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కుసుమ కాంతయ్య.. కొంతకాలంగా భుజం నొప్పి, నరాల సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నాడు. అయితే అనారోగ్య సమస్య తీవ్రం కావడంతో ఆదివారం ఉదయం 4 గంటలకు భూపాలపల్లిలోని ఇంటి నుంచి బయటకు వచ్చి ఉదయం 5.20గంటలకు భూపాలపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో ఉదయం 8 గంటలకు వరంగ ల్‌కు చేరుకున్నాడని సీఐ తెలిపారు. అనారోగ్యం సమస్య తీవ్రతతో జీవితంపై విరక్తిచెందిన కాంతయ్య.. ఆదివారం ఉదయం 8.05 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్-అండర్‌బ్రిడ్జి మధ్య తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న స్పెషల్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సురేందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కాంతయ్య మృతదేహాన్ని కుమారులు కృష్ణమోహన్, చంద్రశేఖర్‌లకు అప్పగించా మన్నారు. హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కాజీపేట, నవంబరు 3: రైల్వే క్యాంటీన్‌లో పనిచేసే దినసరి కూలీ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సందీప్‌సింగ్ (22) ఏడాది కిందట బతుకు దెరువు కోసం కాజీపేటకు వచ్చి రైల్వే క్యాంటీన్‌లో కూలి పనిచేస్తున్నాడు. తోటి స్నేహితులతో కలిసి కాజీపేటలో అద్దెకుంటున్న సందీప్‌సింగ్ ఆదివారం స్నేహితులు పనికిపోగా, అతడు రూమ్‌లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిత్రులు వచ్చి చూసేసరికి సందీప్‌సింగ్ మృతి చెంది ఉన్నాడు. మిత్రుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసకుని ఎంజీఎంలో భద్రపర్చారు. మృతుడి సెల్‌ఫోన్‌లో ఉన్న ఫోన్‌నంబర్ల ప్రకారం కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.


కాలువలో పడి వృద్ధురాలి మృతి



చంద్రమ్మ(ఫైల్)

సంగెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌లో గల తన కూతురు ఇంటికి వెళతానని చెప్పి వెళ్లి కాలువలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన జరిగింది. సంగెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మం డలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన పాతూరి చంద్రమ్మ(95).. గుంటూరుపల్లిలోని తన కుమారుడి ఇంటినుంచి ఆదివారం ఉదయం ఆటోలో బయలు దేరి తీగరాజుపల్లి గ్రామ బస్టాండ్ వద్ద దిగింది. ఆపై పక్కన గల ఎస్ఆర్‌ఎస్‌పీ కాలువలో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు రామారావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సంగెం ఎస్సై నరేష్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నట్లు గ్రామస్తులు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

కాజీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు, పొడవైన ముఖం, ఎత్తు 5.6, బ్లూకలర్ జీన్‌ప్యాంటు, ఆరెంజ్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో మృతిచెంది ఉన్నట్టు తెలుస్తోందని, మృతుడిని గుర్తించడానికి అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్‌స్టేషన్ నంబర్‌లకు 87126 85122, 87125 09781 సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ : ఎమ్మెల్యే నాయిని

వడ్డెపల్లి నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లోని గాంధీనగర్‌లోని గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డితో పాటు కమిటీ సభ్యులతో అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 57వ డివిజన్‌లో ఇప్పటికే కోటి పై చిలుక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి- సుధాకర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ-సంపత్‌యాదవ్, కాంగ్రెస్ శ్రేణులు ఈ.వి శ్రీనువాస్‌రావు, బైరపాక జయాకర్, సట్ల సత్తయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో గాంధీవిగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

మహిళా ప్రాంగణంలో రోడ్డు సౌకర్యం కల్పిస్తాం..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రాంగణానికి రోడ్ల సౌకర్యం కల్పిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మడికొండ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శిశు వికాస కేంద్రం జిల్లా అధికారి పి. జయశ్రీ, చైర్ పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సీపీ సత్కారం

హనుమకొండ, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో త్యాగాలు, కష్టనష్టాలు అధిగమించి విజయవంతంగా విధులు నిర్వహించిన పోలీసులు స్ఫూర్తిదాయకం అని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. పోలీసు విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులను ఘనంగా సత్కరించారు. శనివారం వరంగల్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్ఎస్ఐ అబ్దుల్ ఖయ్యుమ్, ఎస్ఐ గణపతి, ఏఎస్ఐలు సాంబయ్య, రుషేంద్రమణి, నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్ కుమార్, ఏసీపీ ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీధర్, ఆర్ఎస్ఐ సాయి కిరణ్‌తోపాటు పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న సీపీ

సురక్షా బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

● 18 నుంచి 70 ఏళ్ల వరకు వర్తిస్తుంది ● రూ.456తో రెండు పాలసీలు, రూ. 4 లక్షల బీమా ● అక్టోబరు 15 నుంచి జనవరి 15 వరకు గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ● లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపెయిన్

వరంగల్ చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల ఉపయోగార్థం బీమా సౌకర్యాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొం దించింది. దేశ వ్యాప్తంగా అన్ని బ్యాంకులలో ఖాతా దారులుగా ఉన్న ప్రజలందరికీ రెండు రకాల పాలసీలను రూ.456తో బీమా చేయించి వారికి ఆరోగ్య భద్రతను కల్పిస్తోంది. దీన్ని మరింత విస్తరించడానికి అక్టోబరు 15 నుంచి 2025 జనవరి 15 వరకు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడానికి లీడ్ బ్యాంకు అధికారులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఈ అవకాశాన్ని ప్రజలందరు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పాలసీలు రెండు రకాలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీలు రెండు రకాలు. రూ. 456తో రెండు స్కీంలు రూపొందించగా ఇందులో రూ.20తో ప్రవేశపెట్టిన పాలసీ పీఎంఎస్‌బీవై (ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన), మరో పాలసీ రూ. 436 పీఎంజేజేవై (ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం)ఈ రెండు పాలసీలను బ్యాంకులో ఖాతా కలిగిన ప్రజలు ఇన్సూరెన్స్‌ను చేసుకోవాలని ఇన్సూరెన్స్ ప్రతీ సంవత్సరం ఖాతాదారుడి ఖాతాలో ఉన్న డబ్బునుంచి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తారు.

ఎన్ని బ్యాంకుల్లో ఖాతాలున్నా ఒక్క పాలసే వర్తిస్తుంది..

రెండు పాలసీలు ఇన్సూరెన్స్ చేసుకున్న ఖాతాదారుడికి ఎన్ని బ్యాంకుల్లో ఖాతాలున్నా రెండు పాలసీలు మాత్రమే వర్తిస్తాయి. ఖాతా నుంచి ఖాతాదారుడు ఇన్సూరెన్స్‌కు ఒక బ్యాంకు నుంచే చేస్తారు. మిగతా బ్యాంకుల నుంచి రూపాయలు ఏవీ కట్ కావు. **ప్రమాదం జరిగితే పాలసీ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది..** ఖాతాదారుడు ఇన్సూరెన్స్ చేసుకున్న అనంతరం ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.20 లతో చేసిన పీఎంఎస్‌బీవై పథకం నుంచి రూ. 2 లక్షలతో పాటు పీఎంజేజేవై పథకం నుంచి మరో రూ. 2లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షలు అందుతాయి. ఈ రెండు ఇన్సూరెన్స్‌లు కలిగిన సభ్యులు ప్రమాదవశాత్తు గాయప డితే ఎముకలు విరిగి కన్ను గాయపడితే రూ. 2 లక్షలు వైద్య ఖర్చులకు అందిస్తారు. 50 శాతం గాయపడి ప్రమాదం జరిగిన వ్యక్తికి రూ. లక్ష అందిస్తారు. ఇన్సూరెన్స్ కలిగిన సభ్యుడు ప్రమాదం జరిగిన లేదా మృతి చెందిన 30 రోజుల్లో బ్యాంకు ద్వారా సమాచారం అందిస్తే ఇన్సూరెన్స్ డబ్బులు నావిఎనీకి అందజేస్తారు.

పాలసీదారుడి వయసు, అర్హత..

రూ. 20 లతో చేసే పీఎంఎస్‌బీవై పాలసీ బీమా చేసే సభ్యుడి వయసు 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలు ఉండాలి. పీఎంజేజేవై పాలసీ బీమా చేసిన సభ్యుడి వయసు 18 నుంచి 50 సంవత్సరాల వరకు అర్హుడు.

గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం..

- రాజు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

జిల్లాలోని అన్ని గ్రామాల్లో అక్టోబరు 15 నుంచి 2025 జనవరి 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇందుకు సంబంధించి జిల్లాలోని అన్ని బ్యాంకు అధికారులకు 90 రోజులకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహణ, ప్రోగ్రాం షెడ్యూల్‌ను అందజేశాం. ఆధార్ నంబర్‌తో బ్యాంకులో రెన్యూవల్‌ను వేగవంతం చేయడానికి ప్రత్యేక సదస్సుల ద్వారా ప్రజలను సమాయత్తం చేస్తున్నాం.

నేడు విద్యుత్‌కు అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ ఏరియాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్జీవోస్‌కాలనీ-2, వెంకటేశ్వరకాలనీ, శ్యామలగార్డెన్, అమరావతినగర్ ఏరియాలో సాయంత్రం 3 గంటల నుంచి 5గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువా జంక్షన్, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటేశ్వర్‌కాలనీ భీమారం రోడ్డు, అరుణోదయకాలనీ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూబస్టాండ్ రోడ్డు, చౌరస్తా మెయిన్‌రోడ్డు, టైలర్‌స్ట్రీట్, గాంధీనగర్, కాకాజీకాలనీ, కాంగ్రెస్‌భవన్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫాతిమానగర్, అబ్బుల్‌నగర్, దర్గా ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

ఆటోనగర్, (ఆంధ్రజ్యోతి): వరంగల్ డివిజన్‌లో 11కేవీ ఫీడర్ మెయింటనెన్స్‌లో భాగంగా శివనగర్, ఏఎస్‌రెడ్డి నగర్, మామునూరు మెయిన్ రోడ్డు, మామునూరు పోలీస్ స్టేషన్, మామునూరు గ్రామం, డైరీ ఫామ్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని వరంగల్ డీఈఈ శంకేసి మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయకట్టు రైతులు అనుమతులు పొందాలి

హసన్‌పర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసన్‌పర్తి, ఎల్లాపూర్ పెద్ద చెరువు పారకంపై రైతులు స్థానిక తహసీల్దార్ లేదా ఐబీ అధికారుల అనుమతి పొందాలని ఐబీ ఏఈ నాగుల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. హసన్‌పర్తి, ఎల్లాపూర్ ఆయకట్టు రైతులు వ్యవసాయ సాగు కోసం చెరువు నీటిని వినియోగించే సమయంలో తూములు ఎత్తి నీటిని ఇష్టారాజ్యంగా వదలడంవల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. తూముల క్రమబద్ధీకరణ, వాటి పారకం విషయంలో ఐబీ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని తూముల ద్వారా నీటి విడుదల కోసం తప్పని సరి సంబంధిత అధికారుల అనుమతులు పొందాలని సూచించారు. అనుమతి లేకుండా ఎవరు పడితే వారు తూముల ద్వారా నీటిని వదిలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయకట్టు రైతులు తప్పని సరిగా అనుమతులు తీసుకొని తూముల ద్వారా నీటి విడుదలకు సహకరించాలని ఐబీ ఏఈ నాగుల శ్రీనివాస్ సూచించారు.

తప్పతాగి వాహనం నడిపితే..

తోటలో గడ్డి పీకాల్సిందే..

మందుబాబులు తస్మాత్ జాగ్రత్త. ఇకనుంచి పీకల్లోతు మద్యం తాగి రోడ్లపై ఇష్టాను సారంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. పోలీసులు పట్టుకొని కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అంతేగాకుండా కోర్టులో హాజరుపరిచి రోజంతా ప్రభుత్వ కార్యాలయాల్లో గడ్డి పీకిస్తారు. అయినా మారకపోతే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.



హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలో గడ్డి పీకుతున్న వాహనదారులు (ఫైల్)

హనుమకొండ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తప్పతాగి డ్రైవింగ్ చేయకుండా అడ్డుకునేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వాహనదారులు ఖాతరు చేయడం లేదు. ప్రధానంగా నగర శివార్లు లేదా నగరం నడిబొడ్డునే మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని పోలీస్‌శాఖ తెలుపుతోంది. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేట్ ఉద్యోగులు, యువకులు నిబంధనలు ఉల్లంఘించి రాత్రి పగలు అనే తేడా లేకుండా పోలీసులకు పట్టుబడుతున్నారు. పోలీసులకు చిక్కగానే ముందుగా తమను ఆపడానికి మీకు హక్కు ఎక్కడిది అంటూ రూల్స్ మాట్లాడుతూ పోలీసులతో వాగ్వాదం చేస్తున్నారు. చివరికి తాము పనిచేస్తున్న శాఖలోని ఉన్నతాధికారికి సమాచారం ఇస్తారని తెలియగానే కాళ్లు, వేళ్ల పట్టుకొని బతిమాలాడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇదే తరహాలో ఇటీవలే ఓ కార్పొరేట్ ఆస్పత్రి లో పనిచేస్తున్న ఉద్యోగి హనుమకొండలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడి నానా హంగామా చేశాడు. మద్యం మత్తులో తాను చేసిన బాగోతాన్ని పోలీసులు తమ సంస్థకు చేరవేస్తున్నారనే సమాచారం తెలియగానే జాబ్ నుంచి తొలిగిస్తే రోడ్డున పడుతానని ప్రాదేయ పడ్డట్లుగా చెబుతున్నారు. అదేవిధంగా ఎన్పీడీ సీఎల్ కార్యాలయం ఎదుట ఇటీవల జరిగిన ఆర్టిజన్ల మహాధర్నాకు వచ్చిన విద్యుత్ ఉద్యోగుల్లో అనేకమంది పోలీసులకు పట్టుబడి ఇబ్బందులకు గురైనట్లుగా సమాచారం. కాగా, సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలిచి విలువలతో జీవించాల్సిన ఉద్యోగులే మద్యం మత్తులో పట్టుబడి నడిరోడ్డుపై విలువను దిగజార్చుకుంటున్నారు. చివరికి పోలీసుల నుంచి బయటపడటానికి పడరాని పాట్లు పడుతూ చులకన అవుతున్నారు.

కొత్త చట్టం ప్రకారం కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష..

గతంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు శిక్ష విధించేవారు. కాని కొత్త చట్టం బీఎన్ఎస్ వచ్చిన తర్వాత రిపీటెడ్‌గా పట్టుబడుతున్న వారికి కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇస్తోంది. గత జనవరి నుంచి అక్టోబరు 25 వరకు కాజీపేట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 56 మంది, వరంగల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 33 మంది, హనుమకొండ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 42 మంది కలిపి మొత్తం 131 మంది కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్షకు గురైనట్లుగా ట్రాఫిక్ పోలీసులు వెల్లడిస్తున్నారు. కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్షలో పట్టుబడ్డ వారిని మండలాల్లో తహసీల్దార్‌లు, నగరంలో మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో అప్పగిసు ్తన్నారు. వారికి రెండు రోజుల పాటు అక్కడి ఉన్నతాధికారులు కార్యాలయంలో ఏ పని అప్పగిస్తే ఆ పని చేయాల్సి ఉంటుంది. వరంగల్ ట్రాఫిక్ డివిజన్‌లోని మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో 9051 మంది పట్టుబడగా పట్టుబడి 72 మందికి జైలు శిక్ష, 131 మందికి కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష పడింది. మిగితా వారికి కోర్టు 1,11,59,368 రూపాయల జరిమానా విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

పట్టుబడినవారికి వినూత్న తీర్పు ఇస్తున్న కోర్టులు

అంతర్మథనంలో మందుబాబులు

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు..
టి.సత్యనారాయణ, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ



మద్యం తాగిన తర్వాత వాహనాలను నడుపొద్దు. ప్రజలను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన మాకు లేదు. వారి ప్రాణాలను కాపాడటానికే మేం వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనదారులు మద్యం తాగి, హెల్మెట్ లేకుండా, నెంబర్ ప్లేట్ లేకుండా, పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే సెలెన్సర్లను బిగించుకొని, త్రిబుల్ రైడింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా రోడ్లపైకి వస్తున్నారు. పెద్దగా శబ్దం వచ్చే సైలెన్స ర్‌లు వినియోగిస్తున్న వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేందుకు పోలీస్‌శాఖ కార్యచరణ సిద్ధం చేసిం ది. దీనిపై ప్రత్యేకంగా రాత్రి వేళల్లో నిఘా పెంచ బోతున్నాం. ప్రధానంగా యువతకు వాహనాల ను అప్పగిస్తున్నప్పుడు తల్లితండ్రులు జాగ్రత్తలు పాటించాలి. ఆన్‌లైన్‌లో సైలెన్సర్లను కొనుగోలు చేసి వాహనాలకు బిగించుకొని రోడ్లపై న్యూసెన్స్ చేస్తున్నారు. ఇప్పటికే అలాంటి 1300 వాహనాలను పట్టుకొని వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి సైలెన్సర్లను తొలగించాం.

'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

మట్టెవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.ప్రభాకర్ అన్నారు. ఆదివారం వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో పెన్షనర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరువరంగం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పెన్షనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. ఈహెచ్ఎస్ అమలు, పీఆర్‌సీ మంజూరు, ప్రధాన సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో జేఏసీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, పెన్షనర్లు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొనండి..

కాజీపేట జంక్షన్ (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న పరకాల, భీమదేవరపల్లి మండలాల సబ్ ట్రెజరీ కార్యాలయాల ఎదుట అలాగే హనుమకొండ సబ్‌ట్రెజరీ కార్యాలయం ఎదుట ఈ నెల 6న జరిగే ధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని సెయింట్‌పీటర్స్ స్కూల్లో నిర్వహించిన పరకాల, భీమదేవరపల్లి, హనుమకొండ మండలాలకు చెందిన పెన్షనర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే మూడు డీఏలు వెంటనే ఇస్తామని, ఆరు నెలల్లోగా పీఆర్‌సీ అమలు చేస్తామని, సీపీఎస్‌ను రద్దు పరిచి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ 11 నెలలైనా వాగ్దానం నిలుపుకోలేదని అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దశలవారి పోరాటంలో భాగంగా ఈ నెల 5,6 తేదీల్లో ధర్నాలు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ధర్నాల్లో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.విద్యాదేవి, అబ్దుల్ రహీం, జిల్లా కార్యదర్శి కెజ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపు కేవీపీఎస్ ఘనత

కాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ మెస్ చార్జీల పెంపు కేవీపీఎస్ పోరాటఫలితమే అని కేవీపీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, సహాయ కార్యదర్శి గడ్డం అశోక్ అన్నారు. కాజీపేట బీసీ హాస్టల్ విద్యార్థులతో ఆదివారం వారు సమావేశమై మాట్లాడారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడకండి

● పెన్షన్‌దారులకు డీఎస్పీ విజయ్‌కుమార్ సూచన

కాజీపేట జంక్షన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో 46శాతం వరకు వృద్ధులు, పెన్షనర్లు ఉన్నారని డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తమకు తెలియని ఫోన్ నెంబర్ల నుంచి కాల్ వచ్చినప్పుడు ఏ సమాచారం అడిగినా ఇవ్వవద్దని పెన్షనర్లకు సూచించారు. ఒకవేళ బ్లాక్‌మెయిల్ చేస్తే వెంటనే ఫోన్ కట్ చేయాలని, తెలియకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అయితే వెంటనే 193 సైబర్ ఫోన్ నెంబరుకు ఫోన్ చేయాలని వివరించారు. సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పెన్షనర్ల రాష్ట్ర స్థాయి సమస్యలను వివరించి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా ఒక్క డీఏ మాత్రమే మంజూరు చేసి మిగతా సమస్యల పరిష్కారానికి కమిటీలకు అప్పగించి ప్రభుత్వం నిరాశపరిచిందన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్లకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంటును అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో అందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తం పెన్షనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

327 యూనియన్ డివిజన్ కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ తొర్రూరు డివిజన్ సర్వసభ్య సమావేశం ఆదివారం హనుమకొండ వడ్డెపల్లి మెయిన్‌రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి తులసీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.భోజాలు, కార్యదర్శిగా ధరావత్ సికిందర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా జి.కిషన్, పి.నాగరాజు, అడిషినల్ సెక్రటరీగా ఎం.ముని ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్‌గా సైదులు, ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా సతీష్, సురేశ్, ఆఫీస్ సెక్రటరీగా సునిల్‌కుమార్, కోశాధికారిగా రవికుమార్‌లను ఎన్నుకున్నారు.

కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను, మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డీఎంహెచ్‌వో ఎ.డాక్టర్ అప్పయ్య ఆదివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల షాపులో మందుల లభ్యత, రికార్డులను తనిఖీచేసి ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ల్యాబ్ టెస్ట్‌లకు సంబంధించిన రియేజెంట్లు, డెంగీ, మలేరియా కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మందులు పంపిణీ చేసే ముందు విధిగా ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, పారా మెడికల్ సిబ్బందికి డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

వడ్డెపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదవుల సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం జీవో నెంబరు 317ను విడుదల చేసిన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీరోడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 6న సాయంత్రం 5 గంటలకు హనుమకొండ గోకుల్‌నగర్‌లో సదర్ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లాలోని యాదవ సమాజం పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

శ్రీనగర్‌కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక

వడ్డెపల్లి నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ శ్రీనగర్ కాలనీ (సౌత్) అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందల రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బెడిద అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి, మాలకొండారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ముత్యాల కుమారస్వామి, వీరభద్రయ్య, ఆర్థిక కార్యదర్శిగా హింగె మనోహర్‌రావు ఎన్నికయ్యారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్



పోచమ్మమైదాన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేశాయిపేటకు చెందిన జన్ను అనిల్‌కుమార్ నియామకమ య్యారు. ఈ మేరకు ఆదివారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జన్ను అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు.

'జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయండి'



ఎంసీపీఐ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గిర్మాజిపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు - మతోన్మాద ఫాసిస్టు కార్పొరేట్ శక్తుల ప్రమాదం - వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యంపై జరుగు జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్‌లు పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలోని అండర్‌బ్రిడ్జి సమీపంలో ఆదివారం ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయంలో జాతీయ సెమినార్ పోస్టర్‌ను నాయకులు జగదీశ్వర్, ప్రతాప్‌లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంసీపీఐ(యు), కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాతీయ సెమినార్‌లో సీపీఐ శాసనసభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యులు కిరణ్‌జిత్‌సింగ్ సెఖోన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ తదితర వామపక్ష పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) నాయకులు నగేష్, ఐలయ్య, రవి, శివ, రాజేందర్ పాల్గొన్నారు.

సంజీవరెడ్డిని సన్మానించిన పెన్షనర్లు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 3: తెలంగాణ రాష్ట్ర విశ్రాంత పోలీసు అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన హనుమకొండకు చెందిన రాధారపు సంజీవరెడ్డిని ఆదివారం రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కమిటీ ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో శాలువా, బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గత నెల రాష్ట్ర విశ్రాంత పోలీసు సంఘం ఎన్నికల్లో తనకు కీలక బాధ్యతలు అప్పగించిన నాయకులకు, జిల్లా పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఈ.నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మారెడ్డి, నాయకులు వీరస్వామి, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు ఉన్నారు.



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నిరుద్యోగ సమస్యలపై నిరంతర పోరాటం



డీవైఎఫ్ఐ ఆవిర్భావ సభలో నినాదాలు చేస్తున్న నాయకులు

జూలైవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ అన్నారు. ఆదివారం 49వ డివిజన్‌లోని ప్రగతినగర్‌లో డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూమాలలు వేసి, డీవైఎఫ్ఐ జెండావిష్కరించారు. అనంతరం నోముల కిశోర్ మాట్లాడుతూ... డీవైఎఫ్ఐ సంఘం 1980వ సంవత్సరం నవంబరు 3న పంజాబ్ రాష్ట్రంలో ఆవిర్భవించిందన్నారు. అందరికి ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఏర్పడిన సంఘం విద్య ఉపాధి కోసం పోరాడుతూనే ఉందని తెలిపారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివరాత్రి కరుణాకర్, రచపూడి యువన్, పద్మ, ఉమారాణి, శ్రావణి, యేసు, రవి, వినయ్, రిశీత, శివ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణరాష్ట్రస్థాయి బాలబాలికల సబ్‌జూనియర్ 7వ నెట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ లాంఛనంగా ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే 7వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, రోయింగ్ అసోసియేసన్ అధ్యక్షుడు బిన్ని లక్ష్మణ్, నెట్‌బాల్ జిల్లా సెక్రటరీ సూర్యారావు, లిల్లీ ఫ్లోరెన్స్, కాకతీయ యూనివర్సిటీ పీడీ భాస్కర్ ఘాటు, కార్తీక్, అల్తాప్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్

కొత్తపేట ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కొత్తపేట ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు

పోచమ్మమైదాన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లోని కొత్తపేట గ్రామం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటైంది. కొత్తపేట విలీన గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈసంపెల్లి రాజుమాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇసంపెల్లి డాక్టర్ వేణుమాదిగ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ కొత్తపేట గ్రామ అధ్యక్షుడిగా ఈసంపెల్లి పవన్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి తరుణ్‌మాదిగ, ఉపాధ్యక్షులు చిలువేరి సుమన్, ఈసంపెల్లి సుధీర్, ఈసంపెల్లి ప్రశాంత్, ప్రచార కార్యదర్శి ఆరెపల్లి సర్దార్, సహాయ కార్యదర్శులు గణిపాక గణేష్, ఇసంపెల్లి విజయ్, ఆర్గనైజర్ ఇసంపెల్లి ప్రవీణ్, గౌరవ సలహాదారులు ఈసంపెల్లి శ్రీనివాస్, సలహాదారులు ఇసంపెల్లి రాకేష్, ఇసంపెల్లి పాల్సన్, ఈసంపెల్లి విక్రం ఎన్నికయ్యారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం లోకో షెడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్‌కె జానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాక వేదప్రకాశ్, కార్మిక నేతలు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదప్రకాశ్, ఎస్‌కె జానీ మాట్లాడారు. డిసెంబరు 4, 5, తేదీల్లో నిర్వహించే వన్ యూనియన్, వన్ ఇండస్ట్రీస్ ఎన్నికలో ప్రతీ కార్మికుడు తమ ఓటు హక్కు వినియోగించుకుని, మజ్దూర్ యూనియన్ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ట్రెజరర్ జి.రాజేశ్వర్, అసిస్టెంట్ సెక్రటరీ యాదగిరి, నాయకులు నరేశ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, గుర్రం నాగరాజు, ఐలయ్య, దేవేందర్, సాయిలు, లక్ష్మణ్ సింగ్‌తోపాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెజోనెన్స్ స్కాలర్‌షిప్ పరీక్షకు విశేష స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

హనుమకొండ టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): రెజోనెన్స్ కళాశాల వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రెజోనెన్స్ స్కాలర్‌షిప్ ఎగ్జామ్‌కు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న సుమారు 2800మంది విద్యార్థులకు పైగా పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యత పెరుగుతుందని, పోటీతత్వం అలవరుచుకోవడానికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏఓ లెక్కల రమ్యారెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఆర్య వైశ్యుల కార్తీక మాస వనభోజనాలు

వరంగల్ కల్చరల్, నవంబరు3 (ఆంధ్యజ్యోతి): వాసవీ మాత ఆర్యవైశ్య పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసం వనభోజనాలు నిర్వహించారు. భద్రకాళి ఆలయ సమీపంలోని భద్రీ తటాకాంజనేయ శివ పంచాయతన దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సామూహికంగా శ్రీ లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. గౌరి మాతకు పూజలు నిర్వహించి ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఇరుకుల రమేష్, అక్కినపెల్లి సత్యనారాయణ, బెజగం రజినీకాంత్, యెలగందుల రమేష్, కె.వీరభద్రయ్య, తోట నవీన్, పెద్ది ప్రభాకర్, కాసం నమఃశివాయ, దివ్వెల శ్రీనివాస్, నీర రాజన్న, నాగరాజు, సర్వేశ్వర్‌రావు, అయ్యప్ప గురుస్వామి పోల ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రామప్ప దేవాలయం

రామప్ప ద్వీపం.. నీటి మూటేనా ?

ఇలాండ్‌లో భారీ శివలింగం జాడెక్కడ ?

- పర్యాటకశాఖ మంత్రి చెప్పినా పట్టింపేదీ?
- అధికారుల తీరుపై పర్యాటకుల ఆగ్రహం


రామప్ప ద్వీపంలో ఏర్పాటు చేసే నమూనా

వెంకటాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామప్పలో ద్వీపం ఏర్పాటును పర్యాటక శాఖ పట్టించుకోకపోవడంతో ఆ హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. సాక్షాత్తు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని కోరినా పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోక పోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ స్థాయి లో రామప్పకు ప్రాచుర్యం తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పానికి అధికారుల సహకారం లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాస్కి స్కీం అనే ప్రోగ్రాంలో భాగంగా రామప్ప సర్కిల్‌ను అభివృద్ధి చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారే ప్రమాదం ఉందని పర్యాటకులు భావిస్తున్నారు.

ద్వీపంలో ఏర్పాటు చేసేవి ఇవే..

రామప్ప సరస్సు ద్వీపంలో 4వేల రకాల ఔషధ మొక్కలు పెంచాలని, పచ్చదనం కనిపించేలా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ఫలితం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే అక్కడే ధ్యాన మందిరం కూడా నిర్మాణం చేపట్టాలని, ఇక చెరువు కట్టపైకి కనిపించేలా భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేయాలని వాటితో ఆధ్యాత్మిక కళ సంతరించుకునే డీపీఆర్ తయారు చేశామన్న మాటలు ఉత్తి మాటలుగానే మిగులుతున్నాయని పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ద్వీపంలోనే అన్ని రకాల ఆహారాలు లభించేలా రిసార్ట్స్, హోటళ్లు, విశ్రాంతి గదులను ఏర్పాటు ఇప్పటికీ అమలు కాకపోవడంలో ఆంతర్యమేమిటని పర్యాటకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత ఆగస్టు 21న స్థానిక మంత్రి సీతక్కతో కలిసి రామప్ప పర్యటనకు వచ్చిన సందర్భంలో వెల్లడించారు. 10 లేదా 20 రోజుల్లో రామప్పకు సంబంధించిన పూర్తి నివేదిక తయారు చేసి సమర్పించాలని పేర్కొన్నారు.

ఎన్నో అనుకున్నాం కానీ, రామప్పలో ఏదీలేదు..

రామప్పలో పిల్లల ఆహ్లాదం కోసం ఓ ప్రత్యేక పార్కు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. కానీ.. దీని ఆమలు సంవత్సరాలు గడుస్తున్నా నోచుకోవడం లేదు. రిసార్ట్స్ హోటళ్లు, మానసిక ఉల్లాసం పెంపొందేలా అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పర్యాటకులు నష్టపోతున్నారు. ప్రపంచ పర్యాటక ముఖ చిత్రంలో చోటు సంపాదించినా అదే స్థాయిలో అభివృద్ధి జరుగకపోవడం పట్ల తీవ్ర సంతృప్తి వ్యక్తమవుతోంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా పర్యాటకశాఖ అధికారుల తీరు ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం..!

మంత్రి చెప్పినా పర్యాటక శాఖ అధికారులు మాత్రం అందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇంతవరకు సమర్పించకపోవడంతో పర్యాటకులు విమర్శలు చేస్తున్నారు. ఐలాండ్‌తో పాటు రోప్‌వే కూడా ఏర్పాటు చేయాలనే విషయాన్ని అధికారులు నీరుగారుస్తున్నారు. అధికారులు రామప్ప సమగ్ర నివేదిక సమర్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తే నిధులు వెంటనే మంజూరయ్యే అవకాశం ఉందని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


బతుకమ్మలతో తరలి వస్తున్న మహిళలు

పూల వనంలా సీతంపేట

- వైభవంగా దీపావళి బతుకమ్మ వేడుకలు
- ముగిసిన మూడు రోజుల సంబరం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న నేతకాని కులస్థులు


చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న యువతులు

హసన్‌పర్తి, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం సీతం పేట గ్రామంలోనే వినూత్నరీతిలో నేతకాని కులస్తులు మూడు రోజుల పాటు నిర్వహించుకునే దీపావళి బతుకమ్మ వేడుకలు ఆదివారం వైభవం గా ముగిశాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో గ్రామంలోని నేతకాని కులస్తులంతా కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా చెరువు గట్టుకు తరలిరావడంతో సీతంపేట గ్రామం పూల వనంలా తలపించింది. మహిళలు బతుకమ్మలను నెత్తిన ఎత్తుకొని పురుషులు కోలాటమాడుతూ పాటలు పాడుతూ నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. అనంతరం మహిళలంతా చెరువు గట్టున చేరి బతుకమ్మలను ఒక్క చోట చేర్చి చుట్టూ తిరుగుతూ ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్కజామా యే చందమామ.. అంటూ బతుకమ్మ పాటలతో సంబురంగా గడిపారు. అనంతరం బతుకమ్మతో తీసుకువచ్చిన గౌరమ్మ (పసుపు ముద్ద)ను మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. రకరకాల పిండి పదార్థాలతో కూడిన తీపి పదార్థాలు (సద్దిని) ఒకరికొకరు తినిపించుకొని బతుక మ్మలను చెరువులో నిమజ్జనం చేయడంతో మూడురోజుల నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగిశాయి.

బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే నాగరాజు

నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ సందర్భంగా మహిళల తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో నిర్వహించిన ఊరేగింపులో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలతో పాటు ఎమ్మెల్యే బతుకమ్మను నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కిసాన్ జిల్లా అధ్యక్షుడు పిం గిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్ తంగెళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, తోకల జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బండారి రజితా చేరాలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నేతకాని కుల పెద్దలు ఉన్నారు.


బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండలో సీఎం రేవంత్‌రెడ్డి


హెలీప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- జంగా రాఘవరెడ్డి కూతురి వివాహానికి హాజరు
- డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు సైతం..


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు


సీఎంకు స్వాగతం పలుకుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ/మడికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అయిల్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి కూతురి వివాహానికి హాజరయ్యారు. నూతన దంపతులు డాక్టర్ నిఖితారెడ్డి - డాక్టర్ అవినాష్‌లకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి ఆశీర్వదించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా వివాహానికి హాజరై నవదంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం ఉదయం 11.20 గంటలకు హెలీక్యాప్టర్‌లో మడికొండకు చేరుకున్నారు. మడికొండలోని సెయింట్ పాల్ స్కూల్ గ్రౌండ్ సమీపం లోని హెలీప్యాడ్‌లో దిగారు. హెలీప్యాడ్ వద్ద సీఎంకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరా జు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మేయర్ గుండు సుధా రాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం సీఎం అక్కడి నుంచి సత్యసాయి గార్డెన్ హాల్‌లోని వివాహ వేదిక వద్దకు చేరుకున్నారు. జంగా రాఘవరెడ్డి దంపతులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. వివాహ వేదిక వద్దకు తీసుకువెళ్లారు. నూతన దంపతులను పరిచయం చేశారు. నూతన వధూవరులు డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్ రెడ్డిలకు సీఎం పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీర్వదించారు. అభినందనలు తెలియజేశారు. సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కొత్త దంపతులను ఆశీర్వదించారు. ఇక్కడ పెళ్లి మండపం వద్ద ముఖ్యమంత్రి 20 నిమిషాలు గడిపారు. అనం తరం రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, మంత్రులు ఉదయం 11.40 గంటలకు హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు. కాగా, సీఎం రాక సంద ర్భంగా మడికొండలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలీప్యాడ్, వివాహ వేదిక సత్యసాయి గార్డెన్ వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు.



ఏనుగులు, గుర్రాల నీళ్ల తొట్టె

కాకతీయుల రాతి ఆనవాళ్లు

ఖిలావరంగల్ మధ్యకోటలో కాకతీయ రాజులకాలం నాటి రాయిని తొలచి చేసిన భారీ నీళ్ల తొట్టి పర్యాటకులను ఆశ్చర్య పరుస్తోంది. క్రీ.శ. 11వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు కాకతీయ రాజులు పరిపాలించిన కాలంలో గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు తదితర రాజులు ఖిలావరంగల్ కోటను రాజధానిగా చేసుకొని పరిపాలించారు. వారి కాలంలో యుద్ధాల కోసం సైనికులతో పాటు ఏనుగులు, గుర్రాలను పెంచేవారు. సైనికులకు యుద్ధం నేర్పేవారి కోసం కత్తికోట, ఏనుగులు, గుర్రాలను కట్టేసేందుకు గుర్రపుశాలలు ఖిలావరంగల్ మధ్యకోటలో ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలకు నీళ్లను పెట్టేందుకు ఖిలావరంగల్ కోటలో 10మీటర్ల పొడవు, 1 మీటర్ వెడల్పుతో రాయిని తొలిచి అందులో లోతుగా నీళ్లతొట్టిని ఏర్పాటు చేశారు. దానిలో నీళ్ల నింపడంతో ఏనుగులు, గుర్రాలు అందులోని నీటిని తాగి దాహార్తిని తీర్చుకునేవని పూర్వీకులు తెలుపుతున్నారు. ఇలాంటి నీళ్ల తొట్టిలు ఖిలావరంగల్‌కోటలోని పలుప్రదేశాల్లో కనిపిస్తుంటాయి. కాగా, దానిని ఖిలావరంగల్ మధ్యకోటలోని మ్యూజియం ముందు భారీ రాతితో చేసిన నీళ్ల తొట్టిని పర్యాటకులు, సందర్శకులు తిలకించేందుకు ఇక్కడ ఏర్పాటు చేశారు. 10 మీటర్ల పొడవు, 1 మీటర్ వెడల్పు గల భారీ నీళ్ల తొట్టిని చూసి దేశ, విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు ఔరా.. ఇంత భారీ (పెద్ద) నీళ్ల తొట్టి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. - ఖిలా వరంగల్(ఆంధ్రజ్యోతి)


పైప్‌లైన్ లీకేజ్‌తో ఎగసి పడుతున్న నీరు

ఉవ్వెత్తున ఎగిసిన నీరు

- 100 అడుగుల పైనే..
- దేవాదుల పైప్‌లైన్ లీక్

శాయంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున దేవాదుల పైప్‌లైన్ లీకైంది. దీంతో గంటల తరబడి సుమారు 100 అడుగుల పైన నీరు ఎగసిపడింది. ఈ క్రమంలో నీరు పక్కనే ఉన్న వరిపంటలలోకి చేరింది. చలివాగు నుంచి ధర్మసాగర్‌కు వెళ్లే దేవాదుల ఫేజ్-2 పైప్‌లైన్ లీకేజీ అయిందని స్థానిక రైతులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మోటార్‌లను నిలిపివేసి, పక్కనున్న కుంటలోకి నీటిని మళ్లించారు. కోతకు వచ్చిన తమ వరిపంటలలోకి భారీగా నీరు చేరిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే విద్యుత్ లైన్‌లు ఉన్నాయని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉన్నతాధికారులు సందర్శించి, లీకేజీకి గల కారణాలను విశ్లేషించి, తగిన మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గోదావరి.. నమోస్తుతే..

- సర్వపాప హరిణి.. ముక్తి ప్రసాద కల్పవల్లి..
- త్రివేణి సంగమంలో నిత్యం పూజలు
- కార్తీక మాసంలో భక్తుల రద్దీ


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సప్తాదాస్సాగరం యాంతి.. గోదావరి నమోస్తుతే.. త్రయంబకంలో పుట్టి పుణ్య స్నానాలతో పాపాలను హరించే మహాతల్లి గోదావరి.. గోదావరిలో కార్తీకమాసం స్నానాలు ప్రత్యేక మైనవి. నది స్నానం ప్రత్యేకమైనది.. అందులో త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానమాచరిస్తే పాపాలు తొలగిపోతాయని పురాణాలు చెబుతున్నాయి. గోదావరి హారతి చేస్తే ఎన్నో జన్మల పుణ్య ఫలం లభిస్తుందని , కార్తీక మాసంలో నదీ స్నానం ఎంతో మేలు చేస్తుందని పురోహితులు చెబుతున్నారు.

మూడు నదుల కలయిక..

కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల సంగమం ఉంటుంది. గోదావరి అంటే గోహత్యా పాతకాన్ని దూరం చేసిన నది అని పేరు. గౌతమ మహర్షి తాను పొందిన వర ప్రభావంతో దేశమంతా క్షామం వచ్చి తిండి దొరకని సమయంలో ఎంతో మందికి అన్నదానం చేసేవాడు. దీనిని చూసి ఓర్వలేని కొందరు మాయ గోవుని గౌతముడి పొలంలోకి పంపించారు. దాన్ని బయటకు తోలడానికి ఆయన ఒక గరిక విసిరాడు. వెంటనే గోవు మరణించింది. పండితులంతా గౌతముని గోహత్యా పాతకాన్ని చూసి గంగానదిని తీసుకుని తెచ్చి ఈ ప్రాంతాన్ని జలమయం చేస్తే పాతకం పోతుందని సూచించారు. గౌతముడు శివుడి గురించి తపస్సు చేసి నాసికా త్రయంబకం నుంచి తీసుకొచ్చాడు. అలా బయలుదేరిన గోదావరి మంజీర, మాండవి, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉప నదులను తనలో ఐక్యం చేసుకుని సప్త చీలికలుగా మారి సముద్రంలో కలుస్తోంది. కాళేశ్వరంలో తన తీరంలో ముక్తీశ్వరుడిగా స్వయంభువుగా వెలసి భక్తులకు ముక్తి కలిగించాలని గోదావరి శివుడి గురించి తపస్సు చేసి సాధించింది. భక్తులు స్నానాలు, దానాలు, పిండ ప్రధా నాలు చేసి పునీతులవడానికి వీలు కల్పించింది. కాళేశ్వ రంలో అష్ట తీరాలతో త్రివేణి సంగమంగా విరా జిల్లుతోంది.

గోదావరి హారతి ప్రత్యేకం..

త్రివేణి సంగమం ఒడ్డును కాళేశ్వరుడికి కార్తీక మాసం అంటే ఎంతో ప్రీతికరం.. నదీ స్నానం ఆచరించి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ప్రతీ పౌర్ణమి నాడు, ప్రత్యేక రోజుల్లో అఖండ గోదావరి హారతి నిర్వహిస్తుంటారు. అలహాబాద్ తర్వాత త్రివేణి సంగ మంలో కొలువైన క్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం. ఈ క్షేత్రం దగ్గర ఉన్న నదిని అమ్మవారిగా పూజిస్తారు.

సాయంకాలం నదీ హారతి ఇస్తారు.. అంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి గోదావరి నదీ స్నానాలు చేస్తారని నానుడి. గోదావరి మాతకు చీర, సారెతో పాటు ప్రదోషకాలం హారతి ఇవ్వడం చాలా గొప్ప ఆవిష్కరణ అంశమని పురోహితులు తెలుపుతున్నారు.

కార్తీక మాసంలో నది స్నానం మేలు



ఫణీంద్రశర్మ, ముఖ్య అర్చకుడు, ముక్తీశరస్వామి దేవస్థానం

కార్తీక మాసంలో గోదావరి స్నానం ఎంతో మేలు.. అన్ని పంటలు.. పూలు.. పండ్లు.. ఇతర ఆకులు వరదీ నీటి ప్రవాహం ద్వారా గోదావరిలోకి కొట్టుకు వస్తాయి.. ఈ క్రమంలో నదీ నీళ్ల ఔషధంలా మారుతాయి.. నదీ స్నానం పుణ్యంతో పాటు పాపాలు తొలగుతాయి.. త్రివేణి సంగమంలో గోదావరి స్నానం మరింత మేలు చేకూరుస్తుంది.

భక్తుల కోర్కెలు నెరవేరుతాయి..



శరత్‌శర్మ, కాళేశ్వరాలయ అర్చకుడు

గోదావరి నది స్నానం చేస్తే సమస్త పాపాలు పోతాయి. భక్తుల కోర్కెలు నెరవేరుతాయి. పంచ భూతాల్లో ఒకటైన నీటిని ప్రకృతిని పూజించడం సనాతన ధర్మం గొప్పదనం. సమస్త ప్రాణకోటికి ప్రాణాధారమైన నదికి ప్రతీ పౌర్ణమి, కార్తీక మాసంలో విశేషంగా శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు ప్రతీ రోజు హారతి ఇవ్వడం జరుగుతుంది.

పత్తి పలు విధాలా మేలు

- కాటన్‌తో దుస్తుల తయారీ
- గింజలతో ఆయిల్ తయారీ
- పశువుల దాణాగా వ్యర్థాలు

వరంగల్ వ్యవసాయం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో పత్తి ప్రధాన వాణిజ్య పంట. పత్తి నుంచి దుస్తులు తయారు చేస్తారని అందరికీ తెలుసు కానీ... పత్తి గింజల నుంచి నాణ్యమైన నూనెను తీస్తారని, నూనె నుంచి వచ్చిన వ్యర్థాన్ని పశువులకు దాణాగా వాడతారని ఎంతమందికి తెలుసు ? పత్తి పలు విధాలుగా ఉపయోగపడుతుందన్న విషయాన్ని తెలుసుకుందాం....

తెలంగాణాలో పత్తి సాగు అధికం

తెలంగాణలో ప్రధాన పారిశ్రామిక పంట పత్తి. ఉమ్మడి పది జిల్లాలో 60 శాతం కంటె ఎక్కువ మంది రైతుల జీవనాధారంగా పండించే పంట పత్తి. పత్తి నుంచి దారం, దారం నుంచి బట్టల తయారీ, గింజల నుంచి ఆయిల్ తీసే మిల్లులు ఇక్కడ లేవు. కష్టపడి పంట పండించి ఇతర రాష్ట్రాలకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులది. దీంతో ఇక్కడి రైతులు నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఆయిల్ మిల్లులు, టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేసుకుని కోట్లు గడిస్తున్నారు.

రాష్ట్రంలో సాల్వెంట్ మిల్లు

తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ఏకైక సాల్వెంట్ మిల్లు ఒకటి ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో 18 వరకు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సాల్వెంట్ అయిల్ మిల్లులు టెక్స్‌టైల్ పార్కులు లేకపోవడంతో జిన్నింగ్ మిల్లుల నుంచి బయటకు వచ్చిన గింజలను బస్తాల్లో ప్యాక్ చేసి వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు అమ్ముతుంటారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాలతో వరంగల్‌లో నలుగురు పత్తి గింజల సాల్వెంట్ లైవ్ అయిల్ మిల్లుల ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.

క్వింటాల్ పత్తిలో 66 కిలోలు గింజలే..

రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని వ్యాపారులు టీఎంసీ మిల్లుల ద్వారా జిన్నింగ్ చేసి బెయిళ్లు తయారు చేస్తారు. క్వింటాల్ పత్తిని జిన్నింగ్ చేస్తే అందులో 60 నుంచి 66 కిలోల (మూడోవంతు) గింజలు కన్వేయర్ ద్వారా బయటకు వస్తాయి. పత్తి(దూది) ఒక వైపు వెళతుంది. ఆ దూదిని బేయిళ్లగా తయారు చేస్తారు.

సాల్వెంట్ మిల్లులో నూనె తయారీ

జిన్నింగ్ మిలుల్ల నుంచి వచ్చిన గింజల(సీడ్స్)ను సాల్వెంట్ ఆయిల్ మిల్లుల ద్వారా నూనెను తీస్తారు. క్వింటాల్ గింజలకు మామూలు మిల్లులో 8 నుంచి 12 కిలోల నూనె తయారవుతుంది. సాల్వెంట్ అయిల్ మిల్లులో మాత్రం 15 కిలోల నాణ్యమైన నూనె తయారవుతుంది. పత్తి నుంచి తయారయ్యే నూనె పామాయిల్ నూనె కంటే నాణ్యమైనదని వ్యాపారులు చెబుతున్నారు. పత్తి నూనెను పలు నూనెలతో మిక్సింగ్ చేస్తున్నట్లు సమాచారం. పత్తి నూనెను ఎక్కువగా హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, పంజాబ్‌రాష్ట్రాల్లో వినియోగిస్తారు. మొత్తం పత్తి గింజల్లో 90 శాతం నూనె తయారీకే వినియోగిస్తారు. పది శాతం మాత్రం పైన తెలిపి రాష్ట్రాల్లో పశువుల దాణాకు వినియోగిస్తున్నారు. ఈ నూనెను ఎక్కువగా కేక్‌ల తయారీ, ఫిషరీష్ ఫ్యాక్టరీల్లో వాడుతున్నారు.

ఆయిల్ వేస్టేజ్.. పశువుల దాణా..

పత్తి గింజల నుంచి నూనె తీసిన తర్వాత వచ్చే పిప్పిని (వేస్టేజ్) పైన తెలిపిన రాష్ట్రాలో పశువుల దాణాగా వాడుతున్నారు. అందుకే ఆయా రాష్ట్రాల్లోని పశువులు మన రాష్ట్రంలోని పశువుల కన్నా ఎక్కువగా పాలు ఇస్తాయి. పత్తి గింజల వ్యర్థాన్ని చేపల పెంపకంలో దాణాగా వినియోగిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.


ఏనుమాముల మార్కెట్‌కు రైతులు అమ్మకానికి తెచ్చిన పత్తి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం
4 నవంబరు 2024

వినూత్నం

అలంకరణ చేపలతో ఆదాయం ఆర్జించవచ్చనే ఆలోచనే వినూత్నమైనది. అయినా ఆ వ్యాపారాన్ని ఒక సవాలుగా స్వీకరించడమే కాకుండా, నెలకు అర లక్షకు పైగా లాభాలను ఆర్జించే స్థాయికి ఎదిగింది కేరళకు చెందిన **పార్వతి వినోద్**. చేపల పెంపకంలో పద్దెనిమిదేళ్ల ప్రస్థానాన్నీ, అనుభవాలనూ ఇలా వివరిస్తోంది.

అలంకరణ చేపలతో ఆదాయం...



"నేను సోషియాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాను. వివాహమైనతరవాత కేరళలోని కొల్లాం వచ్చేనాటికి నాకు చేపల గురించి అసలు ఏమీ తెలియదు. కానీ మా అత్తగారి కుటుంబమంతా చేపల పెంపకం, వ్యాపారాల్లో అనుభవజ్ఞులు. ప్రతిరోజూ ఈ వ్యవహారాలు చూస్తుండడంతో క్రమంగా నాకు కూడా ఆసక్తి మొదలైంది. చేపల పెంపకంలో మెలకువలు నేర్చుకోవాలనుకున్నాను. అందుకు నాకు కొన్నేళ్లు పట్టింది. ఒక్కోసారి చెరువులో పెంచుతున్న చేపలన్నీ చనిపోయేవి. ఆర్థికంగా నష్టపోయేవాళ్లం. అప్పుడే ఇది చాలా కష్టమైన పనని నాకర్థమైంది. అయినా నేర్చుకోవాలన్న తపనతో పట్టుదలతో చాలా విషయాలు తెలుసుకున్నాను.

గుప్పీ, ఏంజిల్, కోయ్ కార్ప్

మాకు ఎనిమిది చేపల చెరువులు ఉండేవి. వీటిలో ఆహారంగా ఉపయోగించే చేపలతోపాటు అలంకరణ కోసం అక్వేరియంలో ఉంచే చేపలను కూడా పెంచేవాళ్లం. గుప్పీ, ఏంజిల్, కోయ్ కార్ప్ వంటి అలంకరణ చేపలు త్వరగా చేతికంది వచ్చేవి. వీటి పెంపకంలో రిస్క్ తక్కువగా ఉండేది. దీంతో ఈ అలంకరణ చేపల వ్యాపారాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించాలని మావాళ్లకి సూచించా! మొదట ఇంట్లోనే గదుల్లో కొన్ని చేపలను పెంచడం ప్రారంభించాను. తరవాత సిమెంట్ ట్యాంక్‌లు, గ్లాస్ ట్యాంక్‌లు నిర్మించుకున్నాం. తర్వాత ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీమ్ కింద కొంత రుణం తీసుకొని మొత్తం పదిహేను లక్షల పెట్టుబడితో మూడేళ్ల కిందట కొల్లాంలో 'దేవూస్ ఆక్వాఫామ్' అనే హేచరీని ప్రారంభించాం. ఈ హేచరీలో వివిధ రకాల సైజుల్లో 21 సిమెంట్ ట్యాంకులు, 150 గ్లాస్ ట్యాంక్‌లు ఉన్నాయి. వీటితో పాటు, బయట వేర్వేరు ప్రదేశాల్లో మరో ఏడు ట్యాంక్‌లు ఉన్నాయి. సిమెంట్ ట్యాంక్‌ల్లో ఒక్కోదానిలో లక్ష వరకు కోయ్ కార్ప్ చేప పిల్లలను, గ్లాస్ ట్యాంక్‌ల్లో ఒక్కో దానిలో అయిదు వందల వరకు ఏంజిల్ ఫిష్ చేప పిల్లలను పెంచుతున్నాం. వీటితోపాటు మార్ఫ్, క్రిబిన్‌సిస్, జులిడోక్రోవిస్, బుటికాపురీ, ఫ్రంటోసా, జేబ్రాడానియస్, రెయిన్‌బో సిచ్లిడ్, హెకెల్లీ, మూన్‌లైట్ గౌరామీ వంటి అరుదైన అలంకరణ చేపలనూ పెంచుతున్నాం. అంతేకాదు ఈ హేచరీలో ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇస్తున్నాం.

ట్యాంక్‌ల నిర్వహణ కష్టం

ట్యాంక్‌ల్లో అలంకరణ చేపలను పెంచేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక్క చేప చనిపోయి కనిపించినా దానిని వెంటనే తీసివేయాలి. ట్యాంక్ నీటిలో చేపలు వదిలిన వ్యర్థాలను, మిగిలిన ఆహారాన్ని ట్యూబ్‌ల సహాయంతో తీసివేయాలి. లేనిపక్షంలో నీటిలో అమ్మోనియా గ్యాస్ విడుదలై చేపలు చనిపోతాయి. తొట్టిని పరిశుభ్రమైన నీటితో నింపిన తరవాతనే చేపలకు ఆహారాన్ని వేయాలి. తొట్టి బాగా మురికిగా మారినపుడు చేపలన్నింటినీ మరో తొట్టిలోకి మార్చాల్సి ఉంటుంది. మొదట్లో ఇది చాలా కష్టంగా అనిపించేది. దీనికే చాలా సమయం పడుతూ ఉంటుంది.

గోల్డ్ ఫిష్‌కే డిమాండ్...

కస్టమర్ల నుంచి వస్తున్న డిమాండ్‌ను అనుసరించి వైవిధ్యమున్న చేపలను అందించాల్సి ఉంటుంది. గోల్డ్‌ఫిష్, ఫైటర్, ఏంజిల్, గుప్పీ చేపలకు డిమాండ్ ఉన్నప్పటికీ కొత్తవాటి గురించి అడుగుతుంటారు. ఎప్పుడూ పాత రకాలనే మార్కెట్లోకి పంపితే ఒక్కోసారి నష్టపోక తప్పదు. వ్యాపారమన్నాక ఒడిదొడుకులు సహజం. ప్రస్తుతం గోల్డ్ ఫిష్, కియోకార్ప్ రకాల చేపలకు ఆదరణ ఎక్కువగా ఉంది. వీటి ఉత్పత్తిని ఏడాదికి మూడు లక్షల నుంచి అయిదు లక్షల వరకు పెంచాం. కియోకార్ప్ ధర అంగుళానికి రూపాయిన్నర, బనానా మార్ఫ్ ధర రెండు అంగుళాలకు నలభై రూపాయలు, బ్లూ మార్ఫ్ ధర రెండు అంగుళాలకు ఇరవై రూపాయలు, ఎర్రని కళ్లున్న అల్బినో క్రిబెన్‌సిస్ ధర ఒక్కోటి అయిదు వందలకు అమ్ముడుపోతున్నాయి. చేపల ఆహారానికి నెలకు 20 వేలు, విద్యుత్తుకు ఐదు వేలు ఖర్చవుతాయి. మెడిసిన్స్, బ్రూడ్‌స్టాక్ ఖర్చులు అదనం. అన్నీ పోను ఒక్కోసారి అత్యధికంగా లాభపడతాం. మరోసారి ఏమీ మిగలదు. ప్రస్తుతం ఇళ్లలో, కార్యాలయాల్లో వాస్తుప్రకారం అక్వేరియం పెట్టుకోవడం మంచిదనే అభిప్రాయం ఉంది. దీనివల్ల రకరకాల చేపలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే అయిదు, ఆరు, పది సెంటీమీటర్ల సైజున్న ఫిష్ పాండ్లను రూపొందించే ఆలోచనలో ఉన్నా. అన్ని పెంపుడు జంతువుల మాదిరిగానే ఈ చేపలు కూడా మనతో బంధాన్ని ఏర్పరచుకుంటాయి. వీటితో సమయం గడపడం మనసుకి అహ్లాదాన్నిస్తుంది.

శిక్షణనిస్తూ...

మొదట అలంకరణ చేపలను పెంచాలని అనుకున్నపుడు అందరూ నిరుత్సాహపరిచారు. కానీ మా వారు, వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఆయన నుంచే ప్రాథమికంగా చాలా మెలకువలు నేర్చుకున్నా. శాస్త్రీయంగా అవగాహన ఉండాలన్న ఆలోచనతో కేరళ యూనివర్సిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ స్టడీస్‌లో చేపల పెంపకానికి సంబంధించిన కోర్సు పూర్తిచేశాను. ఈ పరిజ్ఞానంతోనే 2014 నుంచి ఫిషరీస్ స్కూళ్లు, కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నా. నా అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడం నాకెంతో ఆనందాన్ని ఇస్తుంది.

వినూత్నం

బుద్ధిమాంద్యం పట్ల అవగాహన లేని రోజుల్లో బిడ్డలోని లోపాన్ని తొలినాళ్లలోనే పసిగట్టలేకపోయింది ఆ తల్లి. ఆలస్యంగా కనిపెట్టిన తర్వాత ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బాసటగా మారాలనే లక్ష్యంతో, అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఎర్లీ ఇంటర్వెన్షనల్ క్లినిక్‌ను స్థాపించింది. ఈ క్లినిక్ ద్వారా తన లాంటి తల్లులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, పిల్లలకు థెరపీలను కూడా అందిస్తోన్న ఆటిజం నిపుణురాలు, **మాధవి ఆదిమూలం** నవ్యతో పంచుకున్న విశేషాలు.



ఆటిజం పిల్లలు ఎంతో ప్రత్యేకం

"నాకు ఇద్దరు పిల్లలు. వరుణ్, ప్రణవ్. పెద్ద బాబు వరుణ్‌కు ఇప్పుడు 26 ఏళ్లు. రెండేళ్ల వయసొచ్చేవరకూ వరుణ్‌కు మాటలు రాలేదు. ఆలోగా రెండో బాబు ప్రణవ్ పుట్టాడు. ఎదుగుదలలో ఆ ఇద్దరు పిల్లల మధ్య వ్యత్యాసాలున్నట్టు గమనించాను. వెంటనే పిల్లల వైద్యులను సంప్రతించి పెద్ద బాబు పరిస్థితిని వివరించాను. కానీ వైద్యులు నా అనుమానాలను తేలికగా కొట్టిపారేశారే తప్ప, నా ప్రశ్నకు సూటి సమాధానాలు ఇవ్వలేకపోయారు. అయితే ఐటి రంగంలో పని చేస్తున్న నాకు ఇంటర్నెట్ సౌలభ్యం ఉండడంతో, సమాధానాల కోసం ఇంటర్నెట్‌ను ఆశ్రయించాను. ఆన్‌లైన్‌లో ఆటిజం సొసైటీ ఆఫ్ అమెరికా వెబ్‌సైట్ కనిపించింది. దాన్లో, పిల్లల్లోని ఆటిజంను అనుమానిస్తున్న తల్లితండ్రుల కోసం కేటాయించిన ప్రశ్నాపత్రం పూరించాను. ఫలితం మా అబ్బాయి లక్షణాలతో సరిపోలడంతో, ఆ కాగితం ప్రింట్ తీసుకుని మళ్లీ పిల్లల వైద్యుల దగ్గరకు పరుగులు తీశాను. 'ఆటిజం ఉన్నంత మాత్రాన ఏం చేయగలుగుతావు?' అని ప్రశ్నించిందా వైద్యురాలు. ఆవిడ ఉన్నంత రిలాక్స్‌డ్‌గా నేను ఉండలేను. వరుణ్ నా బిడ్డ. వాడి సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని, పరిష్కారం వెతకవలసిన బాధ్యత తల్లిగా నాదే! ఆ క్రమంలో క్లినికల్ సైకాలిజిస్టును కలవడం, బాబుకు ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అని తేలిపోవడం చకచకా జరిగిపోయాయి. బాబు హైపర్ యాక్టివిటీతో బడిలో కూడా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. వైద్యులే ఆ సమస్యను గుర్తించలేనప్పుడు, టీచర్లకు దాని పట్ల అవగాహన లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. కాబట్టి బాబు సమస్యకు పరిష్కారాన్ని వెతికే పూర్తి బాధ్యత నేనే తీసుకున్నాను. భారతదేశంలో ఆటిజం చికిత్సావకాశాలు కూడా లేవని నా పరిశోధనలో తేలిపోయింది. దాంతో నేనొక కీలకమైన నిర్ణయం తీసుకున్నాను.

ఆటిజం పట్ల అవగాహన పెంచుకుని...

ఆ రోజుల్లో నేను ఐటి కంపెనీ తరఫున యూరప్ రీజియన్ కోసం పని చేస్తున్నాను. విదేశాల్లో ఆటిజం పట్ల అవగాహన, చికిత్సలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి కాబట్టి భాష సమస్యలు లేని యుకెకు ట్రాన్స్‌ఫర్ చేయమని మా బాస్‌ను అడిగాను. కారణం తెలుసుకున్న ఆయన వెంటనే నన్ను ట్రాన్స్‌ఫర్ చేసేశారు. అలా 2001లో బాబును తీసుకుని యుకె వెళ్లిపోయాను. అక్కడి బడుల్లో ఈ కోవకు చెందిన పిల్లలకు ప్రత్యేక సదుపాయాలున్నాయి. బాబుకు అర్థం కాని పాఠాలను విడిగా వివరించడం కోసం సపోర్ట్ టీచర్ కూడా ఉండేది. అలా కొన్నేళ్లు అక్కడే ఉండిపోయాను. ఆటిజం పట్ల పూర్తి అవగాహన పెంచుకున్నాను. పేరెంట్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. దాంతో బాబుతో ఎలా నడుచుకోవాలో అర్థమైపోయింది. కాబట్టి ఇండియా వచ్చేసి స్వయంగా నేనే వాడికి విద్యాబుద్ధులు నేర్పించాలని నిర్ణయించుకుని, 2007లో ఇండియా తిరిగొచ్చేశాను. కానీ అప్పటికీ హైదరాబాద్‌లో ఆటిజం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. బడిలో చేర్చినా మా బాబును ఎలా స్టిమ్యులేట్ చేయాలో టీచర్లకు తెలియడం లేదు. ఊరికే తరగతిలో కూర్చోబెడితే, ప్రయోజనం ఏముంటుంది? అందుకే నేను కూడా అదే బడిలో టీచర్‌గా చేరిపోయాను. కానీ ప్రతి రోజూ బడికెళ్లి, మా బాబుకు నేనే టీచర్‌గా మారే బదులు, ఆ పనేదో ఇంట్లోనే చేయొచ్చు కదా? అనిపించింది. అలా ఐటి ఉద్యోగానికి రాజీనామా చేసి, 2008, ఏప్రిల్ రెండున, అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఎర్లీ ఇంటర్వెన్షనల్ క్లినిక్‌ను మొదలుపెట్టాను.

వర్చువల్ ఆటిజంకు అడ్డుకట్ట

వర్చువల్ ఆటిజం అనే పదం కొవిడ్‌లో పుట్టుకొచ్చింది. నిజానికి ఇది ఆటిజం కాదు. ఇదొక డెవలప్‌మెంటల్ డిజార్డర్. దీన్ని సరిదిద్దడం కూడా చాలా తేలిక. కొవిడ్ కాలంలో పిల్లలను వేరే పనిలో ఎంగేజ్ చేసేసి, సొంత పనులు చేసుకోవచ్చనే ఆలోచనతో తల్లితండ్రులే పిల్లలకు గ్యాడ్జెట్స్ అందించడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇలా చిన్న వయసులోనే ఫోన్లు, ఐప్యాడ్‌లకు పిల్లలు అతుక్కుపోవడం వల్ల డెవలప్‌మెంటల్ డిలేస్ తలెత్తుతాయి. వయసుకు తగిన ఎదుగుదల మందగించి, మాటలు రాకపోవడం, సాధారణ నైపుణ్యాలు కొరవడడం లాంటి సమస్యలు మొదలవతాయి. ఈ సమస్యను సరిదిద్దడం కంటే, సమస్య తలెత్తకుండా ముందుగానే జాగ్రత్త పడడం తల్లితండ్రుల బాధ్యత. పిల్లలతో సఖ్యంగా మెలుగుతూ, వాళ్లతో మాట్లాడుతూ, ఆడుతూ పాడుతూ, నాణ్యమైన సమయాన్ని గడపాలే తప్ప, వాళ్లకు గ్యాడ్జెట్స్ అలవాటు చేయకూడదు.



సమస్యను ప్రారంభంలోనే కనిపెడితే...

ఇప్పుడు వరుణ్‌కి 26 ఏళ్లు. బాబుకు సంగీతం పట్ల ఆసక్తి ఎక్కువ. ఈ విషయాన్ని గ్రహించిన నేను క్లాసికల్ మ్యూజిక్ నేర్పించాను. బాబుకు భాషల పట్ల కూడా ఆసక్తి ఎక్కువే! 18 ఏళ్ల నుంచీ హిందుస్తానీ క్లాసికల్ మ్యూజిక్ నేర్చుకుంటున్నాడు. టీచర్లతో కలిసి ప్రదర్శనలు కూడా ఇస్తున్నాడు. వీకీపీడియా ద్వారా 80 నుంచి 90 భాషలు నేర్చుకున్నాడు. బుద్ధిమాంద్యం పిల్లల పట్ల సాధారణంగా జాలి, దయ వ్యక్తపరుస్తాం! ఆ పిల్లలెందుకూ పనికిరారనీ, వాళ్లకెలాంటి తెలివితేటలూ ఉండవని అనుకుంటాం! కానీ ఈ పిల్లలెంతో ప్రత్యేకం. వాళ్లకూ నైపుణ్యాలుంటాయి. వాటిని వెతికి మెరుగుదిద్దడం తల్లితండ్రుల బాధ్యత. అన్నిటికంటే ముఖ్యంగా ఈ పిల్లలను ప్రారంభంలోనే గుర్తించి, థెరపీ ఇప్పించగలిగితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఈ విషయం చాలా మంది తల్లితండ్రులకు తెలియదు. సాధారణంగా తల్లితండ్రులందరూ ఆటిజం విషయంలో ఒక పెద్ద పొరపాటు చేస్తూ ఉంటారు. మా పిల్లలు 'నార్మల్'గానే ఉన్నారనే నిశ్చితాభిప్రాయంలో ఉంటూ ఉంటారు. త్వరగా బాగైపోయి, పెద్ద చదువులు చదివేసి ఏ డాక్టరో, ఇంజనీరో అయిపోవాలనే ఆరాటపడతారు తప్ప, బిడ్డకు ఉన్న సమస్యను అర్థం చేసుకునే ప్రయత్నం చేయరు. నిజానికి ఈ పిల్లల సమస్యను ప్రారంభంలో తేలికగానే కనిపెట్టవచ్చు. పేరుతో పిలిస్తే పలకకపోవడం, వేరే పిల్లలతో కలవకుండా విడిగా ఆడుకోవడం, సామాజిక నియమనిబంధనలు, ప్రవర్తనల పట్ల అవగాహన లేకపోవడం లాంటి లక్షణాలను పసిగట్టాలి.

టైలర్డ్ థెరపీతో...

డెవలప్‌మెంటల్ డిలేస్ వేరు ఆటిజం వేరు. అయితే సమస్య మాటలు రాకపోవడానికి డెవలప్‌మెంటల్ డిలే కారణమైతే, ఆరు నెలల థెరపీతో పిల్లలు మాట్లాడడం మొదలుపెట్టేస్తారు. కానీ ఆటిజంలో ఇది సాధ్యపడదు. ఈ తేడాలను తల్లితండ్రులు తెలుసుకోవాలి. ఆటిజం తీవ్రతలో కూడా తేడాలుంటాయి. అలాగని థెరపీతో ఉపయోగం ఉండదని అనుకోకూడదు. ఇప్పుడు అనన్యలో పని చేస్తున్న కౌన్సెలర్లు అందరూ అత్యున్నత అర్హత ఉన్నవాళ్లే! వీళ్లందరూ థెరపీలో భాగంగా ఆక్యుపేషనల్ థెరపీ, సోషల్ ఇంటరాక్షన్, పీర్ ప్లే సేవలందిస్తూ ఉంటారు. తల్లితండ్రులకు వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తూ ఉంటాం. వాళ్లకూ శిక్షణనిస్తాం! ఇంట్లో పిల్లలతో నడుచుకోవలసిన విధానాలను నేర్పిస్తాం. క్లినికల్ అబ్జర్వేషన్, పేరెంట్ ఇంటర్వ్యూ, డెవలప్‌మెంటల్ అసెస్‌మెంట్ ఆధారంగా పిల్లల్లో ఆటిజం తీవ్రతను అంచనా వేసి, టైలర్డ్ థెరపీని తయారు చేసుకుంటాం. ప్రతి బిడ్డకూ తగినంత సమయాన్ని కేటాయిస్తూ, మాట్లాడడం, నడవడిక, ప్రవర్తనలను గాడిలో పెడుతూ, తల్లితండ్రులకు గైడెన్స్ ఇస్తూ బిడ్డకు మెరుగైన జీవితాన్ని అందించడం కోసం కృషి చేస్తూ ఉంటాం. మా సేవలను ఆన్‌లైన్‌లో కూడా పొందవచ్చు.

> మా వారు, మోహన్ ఫ్రీల్యాన్స్ కార్పొరేట్ ట్రైనింగ్ ఇస్తూ ఉంటారు. మా రెండో బాబు, ప్రణవ్, ఎమ్‌బిబిఎస్ పూర్తి చేసి ప్రస్తుతం పిజికి సిద్ధపడుతున్నాడు. బంజారాహిల్స్, మాధాపూర్, మణికొండ, కోకాపేట్, నల్లగండ్లలో అనన్య బ్రాంచెస్ ఉన్నాయి. అన్ని చోట్లా థెరపిస్ట్‌లతో పాటు, పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలూ ఉంటాయి.

పిల్లల్లో ఆటిజంను పూర్తిగా నయం చేయడం నా లక్ష్యం కాదు. అది సాధ్యపడదు కూడా! ఈ సమస్య ఉన్న పిల్లలతో తల్లితండ్రులు ఎలా నడుచుకోవాలో నేర్పించడం, వాళ్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు పిల్లలకు వ్యక్తిగత, సామాజిక ప్రవర్తనలు, నియమనిబంధనలు నేర్పించడం నా పని.

● గోగుమళ్ల కవిత



నుదిటి మీద మొటిమలు వస్తున్నాయా!

చలికాలంలో నుదిటిమీద ఎక్కువగా మొటిమలు వస్తుంటాయి. ఇవి చిన్నగా ఉన్నప్పటికీ విపరీతమైన నొప్పిని కలిగిస్తాయి. హార్మోన్ల అసమతుల్యత, జన్యువుల తీరు, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోయి ఈ రకం మొటిమలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం!

- శీతాకాలంలో అందరికీ తలలో చుండ్రు ఉంటుంది. ఇది నుదిటి భాగంపై రాలినపుడు అందులోని బ్యాక్టీరియా చర్మ రంధ్రాల్లోకి చేరి వాటిని మూసివేయడం వల్ల మొటిమలు ఏర్పడతాయి. అందుకే తలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుండ్రు, పేలు వంటివి ఉంటే వాటి నివారణకు చికిత్స చేయించుకోవాలి.
- శరీరంలో హార్మోన్ల పనితీరు సరిగా లేనప్పుడు చర్మ రంధ్రాల నుంచి అధికంగా నూనె ఉత్పత్తవుతుంది. ఇది చర్మం మీద ఉన్న మృత కణాలు, చెమట, ఇతర బ్యాక్టీరియాలతో కలసి చర్మ రంధ్రాలు మూసుకుపోయేలా చేస్తుంది. అప్పుడు కూడా మొటిమలు వస్తాయి. జిడ్డు చర్మం ఉన్నవారికి ఈ సమస్య అధికంగా ఉంటుంది. వీలైనన్ని సార్లు ముఖాన్ని కడుక్కోవడం, దిండు గలీబులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నుదిటిని చేతితో తాకకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే మొటిమలు తగ్గుముఖం పడతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా ఆయిల్ లేదా కొబ్బరి నూనె వేసి దానికి రెండు చుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి ఆ మిశ్రమాన్ని కాటన్ బాల్ సహాయంతో నుదుటి మీద రాస్తే మొటిమల్లోని సూక్ష్మజీవులు నశించిపోతాయి. రెండు చెంచాల పసుపుకు తగినంత తేనె కలిపి ఆ మిశ్రమాన్ని మొటిమల మీద రాసినాకూడా మంచి ఫలితముంటుంది. ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్‌కు మూడు చెంచాల నీళ్లు కలిపి ఆ మిశ్రమాన్ని నుదుటికి పట్టించి రాత్రంతా అలాగే ఉంచుకొని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా రెండు రోజులకోసారి చేయడం వల్ల మొటిమలు పెరగకుండా ఉంటాయి.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. భూల్ భులాయా (భూల్ భులాయా3)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
6. సాజినీ రే (లాపతా లేడీస్)
7. అఖియా గులాబ్ (తేరీబాతోమే ఐసా ఉల్జా జియా)
8. నైనా (క్రూ)
9. అపనా బనాలే (బేడియా)
10. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

ఆమె పాట... చిన్నారి గుండెలకు రక్ష

పలక్ ముచ్చల్ పాట సంగీతాభిమానుల వీనులకు విందే కాదు... చిన్నారి గుండెలకు రక్షా కవచం కూడా! ఏడేళ్ల వయసులోనే పలక్‌లో చిగురించిన ఔదార్యం ఆమె గాన ప్రతిభతోపాటే ఎదిగింది. మూడువేల మందికి పైగా పిల్లలకు కొత్త జీవితాన్నిచ్చింది.

ముంబయిలోని తన ఇంట్లో ఒక గది పలక్ ముచ్చల్‌కు ఎంతో ప్రత్యేకం. మ్యూజిక్ కాన్సర్ట్ కోసం వేరే ఊళ్లకు వెళ్తే తప్ప... ప్రతి రోజూ ఆ గదిలో కొంతసేపైనా ఆమె గడుపుతారు. ఇంతకీ ఆ గదిలో ఉండేవి... అలమరాల్లో పేర్చిన రకరకాల సైజుల్లోని బొమ్మలు మాత్రమే. ఇప్పటివరకూ మూడువేల మందికి పైగా నిరుపేద పిల్లలకు ఆమె గుండె ఆపరేషన్లు చేయించారు. అందుకు బదులుగా వారి నుంచి ఒక బొమ్మను మాత్రమే ఆమె తీసుకుంటారు. వాటన్నిటి కోసం ఒక గదిని ఆమె కేటాయించారు. "ఒక్కొక్క బొమ్మ వెనుకా ఒక్కొక్క గుండె ఉంది. గది నిండా ఎన్నో గుండెల జాలి కథలున్నాయి. అవి నాలో ఉద్వేగాన్ని కలిగించడమే కాదు... ప్రేరణ కలిగిస్తాయి. కర్తవ్యాన్ని బోధిస్తాయి" అంటారు పలక్. ఆమె సేవా ప్రయాణం ప్రారంభమై సరిగ్గా పాతికేళ్లయింది.

కార్గిల్ అమరుల కుటుంబాల కోసం...

పలక్ స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్. ఆమె తండ్రి రాజ్‌కుమార్ ముచ్చల్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి అమిత సంగీతాభిమాని. ఆ అభిరుచితోనే పలక్‌కు, ఆమె సోదరుడు పలాశ్‌కు సంగీతంలో శిక్షణ ఇప్పించారు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు కళ్యాణ్‌జీ-ఆనంద్‌జీ బాల గాయకులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన "లిటిల్ స్టార్" అనే బృందంలో నాలుగేళ్ల వయసులో పలక్ చేరి, తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో తన గళాన్ని వినిపించేవారు. కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు ఆమెకు ఏడేళ్లు. సైనికుల మరణాల గురించి విని చలించిపోయిన ఆమె... మృత జవాన్ల కుటుంబాలకు సహాయం అందించడానికి... ఇండోర్‌లోని దుకాణాల ముందు నిలబడి... పాటలు పాడారు. దాదాపు పాతిక వేల రూపాయలకు పైగా పోగు చేసి... కేంద్ర ప్రభుత్వానికి పంపారు. అదే ఏడాది ఒడిశా తుపాను బాధితుల కోసం కూడా నిధులు సేకరించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ సంగతి తెలుసుకొని... గుండెకు సంబంధించిన లోపంతో బాధపడుతున్న తమ విద్యార్థి ఆపరేషన్ కోసం ఒక చారిటీ షో నిర్వహించాల్సిందిగా పలక్‌ను, ఆమె తల్లితండ్రులను కోరారు. "ఆ విద్యార్థి తండ్రి చెప్పుల వ్యాపారి. ఆపరేషన్ చేయించే స్తోమత ఆ కుటుంబానికి లేదు. అందుకే మరో ఆలోచన లేకుండా అంగీకరించాం. నాలుగు రోడ్ల కూడలిలో... తోపుడు బండి మీద నిలబడి పాటలు పాడాను. విరాళాలుగా రూ.51 వేలు వచ్చాయి. ఇది చదివి... బెంగళూరుకు చెందిన కార్డియాలజిస్ట్ దేవీ ప్రసాద్ శెట్టి ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఆపరేషన్ చెయ్యడానికి ముందుకు వచ్చారు. ఒక మనిషి ప్రాణాలను కాపాడితే కలిగే సంతృప్తి ఎలా ఉంటుందో అప్పుడే నాకు తెలిసింది" అని గుర్తు చేసుకున్నారు పలక్. ఆ తరువాత.. గుండె ఆపరేషన్లు అవసరమైన పేద పిల్లల విరాళాల సేకరణ కోసం పలక్ ఎప్పుడైనా పాడడానికి సిద్ధమంటూ పత్రికల్లో ఆమె తల్లితండ్రులు ఒక ప్రకటన ఇచ్చారు. వారం రోజుల్లోనే 33 మంది పిల్లల సర్జరీల కోసం విజ్ఞాపనలు వచ్చాయి. పలక్ వరుసగా ప్రోగ్రామ్‌లు చేయడం ప్రారంభించారు. దీనికి పలు ఆసుపత్రులతో పాటు వైద్యులు కూడా చార్జీల తగ్గింపుతో, ఫీజుల మినహాయింపుతో తమ వంతు సాయం అందించారు.

> "ఇప్పటికి మూడు వేలకు పైగా సర్జరీలు పూర్తయ్యాయి. అదృష్టవశాత్తూ నా పాటలకు ప్రాచుర్యం ఉంది. నా సంగీత కార్యక్రమాలకు ఆదరణ కూడా బాగానే ఉంది. వాటి ద్వారా వచ్చే ప్రతి పైసా దాని కోసమే ఖర్చు చేస్తున్నాను.



అది గొప్ప అదృష్టంగా భావిస్తా...

ఒక వైపు చారిటీ షోల్లో పాల్గొంటూనే మరో వైపు చదువును, సంగీత సాధనను పలక్ కొనసాగించారు. 2001లో... 'చైల్డ్ ఫర్ చిల్డ్రన్' పేరిట తొలి మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేశారు. "ఆ తరువాత పదేళ్లలో మరో అయిదు ఆల్బమ్స్ చేశాను. సినీ పరిశ్రమలో గాయనిగా పేరు తెచ్చుకోవాలనేది నా కల. దానికోసం ఇండోర్ నుంచి ముంబయికి మా కుటుంబం వచ్చేసింది. 2011లో... హిమేష్ రేష్మియా సంగీత దర్శకత్వంలో 'దమాదమ్' సినిమా టైటిల్ సాంగ్ పాడే అవకాశం వచ్చింది. ఆ తరువాత 'ఆషికీ 2', 'ఏక్తా టైగర్', 'ప్రేమ్ రతన్ ధన్‌పాయో', 'కిక్' తదితర చిత్రాల్లో వరుసగా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో 'కౌన్ తుఝే' పాట నాకు ప్రేక్షకుల నుంచి, సినీ రంగం నుంచి గొప్ప ప్రశంసల్ని తెచ్చిపెట్టింది" అంటున్న పలక్ హిందీతోపాటు తెలుగు, బెంగాలీ, భోజ్‌పురి, ఉర్దూ, గుజరాతీ, పంజాబీ, మరాఠీ, తమిళ్, కన్నడ తదితర భాషల్లో తన గళాన్ని వినిపించి మెప్పించారు. అలాగే మ్యూజిక్ కాన్సర్ట్స్‌లో పాల్గొని... వాటి ద్వారా వచ్చే డబ్బును... 'పలక్ ముచ్చల్ ఫౌండేషన్' తరఫున 'సేవింగ్ లిటిల్ హార్ట్స్ ప్రాజెక్ట్ ద్వారా... పేద పిల్లల గుండె ఆపరేషన్లకు ఖర్చు చేస్తున్నారు. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్', 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' లో చోటు సంపాదించుకున్న ఆమె కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రీయ బాల పురస్కార్, ఆమెరికన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌తో సహా సినీ, సామాజిక రంగాల్లో చేసిన సేవలకు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆమె కథను మహారాష్ట్ర ప్రభుత్వం ఏడో తరగతి మోరల్ సైన్స్‌లో పాఠంగా చేర్చింది. అది గొప్ప అదృష్టంగా భావిస్తానంటారు పలక్. "ఇప్పటికి మూడు వేలకు పైగా సర్జరీలు పూర్తయ్యాయి. అదృష్టవశాత్తూ నా పాటలకు ప్రాచుర్యం ఉంది. నా సంగీత కార్యక్రమాలకు ఆదరణ కూడా బాగానే ఉంది. వాటి ద్వారా వచ్చే ప్రతి పైసా దానికోసమే ఖర్చు చేస్తున్నాను. ఇప్పుడు ఒక కాన్సర్ట్ చేస్తే వచ్చే డబ్బుతో 13-14 సర్జరీలకు సాయం చేయగలుగుతున్నాను. రెండేళ్ల క్రితం సంగీత దర్శకుడు మిథున్‌తో నాకు వివాహమయింది. ఆయన కూడా నన్ను ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. నా ద్వారా సాయం పొందిన కుటుంబాలన్నీ నావిగానే భావిస్తాను. వారి నుంచి నేను తీసుకొనేది... వారి జ్ఞాపకంగా ఒక్క బొమ్మ మాత్రమే. సర్జరీల కోసం నా సాయం కోరిన వారి జాబితాలో మరో 400 మందికి పైగా ఉన్నారు. ఇప్పుడు వారందరి బాధ్యత నా మీద ఉంది. ఇలాగే... జీవితాంతం ఈ కార్యక్రమాన్ని కొనసాగించే శక్తి నాకు ఇవ్వాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంటున్నారు పలక్.



రూ.6 వేల కోట్ల రికవరీ లక్ష్యం

కెనరా బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ రాజు



న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రూ.6,000 కోట్ల మొండి బకాయిల వసూలు తమ లక్ష్యమని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు తెలిపారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో ఇంచుమించుగా సమానంగా రూ.3,000 వంతున వసూలు చేయగలమని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. మాఫీ చేసిన బాకీల రికవరీ సహా మొత్తం రూ.2,905 కోట్లు క్యూ2లో వసూలు చేయగలిగామని ఆయన వెల్లడించారు. రికవరీలతో పోల్చితే ఎన్‌పీఏలుగా మారేందుకు అవకాశం ఉన్న రుణాల పరిమాణం తక్కువగానే ఉన్నట్టు చెప్పారు. కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ నాలుగో త్రైమాసికంలో ఉండవచ్చునని ఆయన తెలిపారు. త్వరలోనే దీనికి ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతి లభిస్తుందని భావిస్తున్నామన్నారు. బీమా విభాగంలో 51 శాతం వాటాలున్న కెనరాబ్యాంక్ ఈ ఇష్యూ ద్వారా 13 శాతం వాటా విక్రయించాలని భావిస్తోంది.

యూఎస్ నుంచి రెడ్డీస్ ఔషధం రీకాల్

న్యూఢిల్లీ: రక్తంలో అధిక కాల్షియం స్థాయిల అదుపు, హైపర్ పారాథైరాయిడిజమ్ చికిత్సలో ఉపయోగించే సినాకాల్సెట్ టాబ్లెట్లను అమెరికన్ మార్కెట్ నుంచి రీకాల్ చేస్తున్నట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. తయారీలో లోపాలున్నాయంటూ అమెరికన్ ఎఫ్‌డీఏ నివేదికను ఆధారం చేసుకుని ఈ టాబ్లెట్లున్న 3,31,590 బాటిల్స్‌ను ఉపసంహరిస్తున్నట్టు పేర్కొంది. రెడ్డీస్ లేబరేటరీస్ న్యూ జెర్సీ అనుబంధ విభాగం రీకాల్ చేస్తున్న వాటిలో 30 ఎంజి పరిమాణం గల 2,85,126 బాటిల్స్ ఉన్నాయి. మిగతా బాటిల్స్ 60 ఎంజి, 90 ఎంజి డోసేజిలలోనివని కంపెనీ పేర్కొంది.

ఎఫ్‌ఎంసీజీ వస్తువుల ధరలు సుర్రు?



ద్రవ్యోల్బణం సెగ, పట్టణ మార్కెట్లు నిస్తేజం

తగ్గిన మార్జిన్లతో కంపెనీలు అతలాకుతలం

న్యూఢిల్లీ: వేగంగా అమ్ముడయ్యే వినియోగ వస్తువుల (ఎఫ్‌ఎంసీజీ) మార్కెట్ నీరసిస్తోంది. మొత్తం విక్రయాల్లో 65-68 శాతం వాటా ఉండే పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలు సెప్టెంబరు త్రైమాసికంలో డీలా పడ్డాయి. మరోవైపు ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం సెగలు కక్కుతోంది. పామాయిల్, కాఫీ, కోకో వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు కొండెక్కాయి. దీంతో రెండో త్రైమాసికంలో హెచ్‌యూఎల్, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్), మారికో, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపీఎల్) వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలన్నీ డీలా పడ్డాయి. కొన్ని ఎఫ్‌ఎంసీజీ కంపెనీల లాభాలకూ గండి పడింది. ఈ పరిస్థితి నుంచి కొద్దిగానైనా కోలుకునేందుకు స్వల్ప స్థాయిలోనైనా ధరలు పెంచే అవకాశం ఉందని కంపెనీలు సూచనప్రాయంగా తెలియజేస్తున్నాయి. 'మేము దీన్ని స్వల్పకాలిక ప్రతికూలతగా భావిస్తున్నాం. ధరలు స్థిరీకరించడం, స్వల్ప స్థాయిలో ధరలు పెంచడం ద్వారా ఈ పరిస్థితి నుంచి బయటపడవచ్చని భావిస్తున్నాం' అని జీసీపీఎల్ ఎండీ, సీఈఓ సుధీర్ సీతాపతి ఇటీవల కంపెనీ క్యూ2 ఆర్థిక ఫలితాలు వెల్లడిస్తూ చెప్పారు.

గ్రామీణ డిమాండూ అంతంతే : ప్రస్తుతం పట్టణ ప్రాంత డిమాండ్‌తో పోలిస్తే గ్రామీణ డిమాండ్ కొద్దిగా మెరుగ్గానే ఉంది. అయితే ఇది కూడా ఆశించిన స్థాయిలో మాత్రం లేదు. ప్రాంతం ఏదైనా ప్రస్తుతం ప్రీమియం/ఈ-కామర్స్ ఉత్పత్తులు జోరుగా అమ్ముడవుతున్నాయి. అధిక వాటా గల మాస్ ఉత్పత్తుల అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నట్టు ఎఫ్‌ఎంసీజీ కంపెనీల ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆహార ద్రవ్యోల్బణం, పట్టణ ప్రాంత డిమాండ్ పడకేయడం క్యూ2లో తాము ఎదుర్కొన్న పెద్ద సవాల్ అని డాబర్ ఇండియా తెలిపింది. దీంతో డాబర్ కంపెనీకి చెందిన చవన్‌ప్రాశ్, పుదీనాహర, రియల్ జ్యూస్ అమ్మకాలు క్యూ2లో 17.65 శాతం పడిపోయాయి. మరో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియాదీ ఇదే పరిస్థితి. క్యూ2లో ఈ కంపెనీకి చెందిన ఆహార, పానీయాల విభాగం అమ్మకాల వృద్ధిరేటు సింగిల్ డిజిట్‌కు పడిపోయినట్టు కంపెనీ సీఎండీ సురేశ్ నారాయణన్ చెప్పారు. ముడి పదార్థాల ధరల పెరుగుదల, పట్టణ ప్రాంత డిమాండ్ పడకయేయడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఎడతెగని వర్షాలు కూడా సెప్టెంబరు త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ కంపెనీల అమ్మకాలను దెబ్బతీశాయి.

సిమెంట్‌దీ అదే పరిస్థితి: సిమెంట్ కంపెనీల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. ధరలు తక్కువగా ఉండడం, అమ్మకాలు పడిపోడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో క్యూ2లో కంపెనీల అమ్మకాలు, లాభాలకూ గండి పడింది. అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ కంపెనీల అమ్మకాలు మాత్రమే కొద్దిగా పెరిగాయి. ఇది కూడా వేరే కంపెనీల కొనుగోళ్ల పుణ్యమే తప్ప, మరోటి కాదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. నైరుతీ రుతుపవనాలతో ఎక్కువ రోజులు వర్షాలు కొనసాగడం, దేశంలోని కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తడం, ప్రభుత్వ శాఖల నుంచి డిమాండ్ పెరుగుదలతో మందకొడితనం ఇందుకు ప్రధాన కారణం. ఇదే సమయంలో విద్యుత్, ఇంధన, ఇతర ఖర్చులు పెరిగిపోవడం సిమెంట్ కంపెనీలను మరింత కుంగదీసింది. ఈ ఏడాది జూన్‌లో రూ.348 వరకు ఉన్న 50 కిలోల బస్తా సిమెంట్ ధర సెప్టెంబరులో రూ.330కి పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.35 నుంచి రూ.45 తక్కువ. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు కొన్ని కంపెనీలు గత నెల మొదటి వారంలో ధరలు కొద్దిగా పెంచాయి. అయితే కొన్ని కంపెనీలు కలిసి రాకపోవడంతో ఆ ప్రయత్నం పెద్దగా విజయవంతం కాలేదు. ధరలతో పాటు అమ్మకాలు కూడా తగ్గడంతో కంపెనీల ఉత్పత్తి సామర్థ్య వినియోగమూ పడిపోయింది.

నవంబరులోనూ పండగ ఆఫర్లు : మారుతీ

నవంబరు నెలలో కూడా తమ కార్లపై పండగల ఆఫర్లు కొనసాగుతాయని మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఈ నెల దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పెళ్లిళ్లుండడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. పండగల సీజన్ కలిసి రావడంతో గత నెల కంపెనీ రికార్డు స్థాయిలో 2,02,402 వాహనాలు విక్రయించింది. ఈ నెల పెద్ద ఎత్తున జరిగే పెళ్లిళ్ల భారీ అమ్మకాలకు దోహదం చేస్తాయని భావిస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు. అయితే ఈ పెళ్లిళ్ల సీజన్ ఆఫర్లు ప్రాంతాన్ని బట్టి మారతాయని తెలిపారు.

24500 పైన బుల్లిష్

(నవంబరు 4-8 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ వాచ్

గత వారం నిఫ్టీ : 24205 (+24)

నిఫ్టీ గత వారం 24498-24173 పాయింట్ల మధ్యన కదలాడి 24 పాయింట్ల లాభంతో 24205 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24325, 24330, 24567, 24972 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24600 బ్రేక్‌డౌన్ స్థాయి: 23800

నిరోధ స్థాయిలు: 24400, 24500, 24600 (24300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 24000, 23900, 23800 (24100 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	111	అనంతపురం	115
గోదావరి	125		

అప్రమత్తంగా ఉండడమే బెటర్

స్టాక్ మార్కెట్ ఈ వారం మిశ్రమంగా ట్రేడ్ కావచ్చు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండడమే మంచిది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన కొన్ని కంపెనీల షేర్లు, ప్రస్తుతం ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత ధరల్లో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడం ప్రారంభించవచ్చు. ఐటీ, ఫార్మా రంగాలకు చెందిన కొన్ని ప్రముఖ కంపెనీల షేర్లు కూడా ప్రస్తుతం ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అయితే మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్ల కొనుగోళ్లలో మాత్రం జాగ్రత్తలు పాటించక తప్పదు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

ఐషర్ మోటార్స్: సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లు, గత ఆరు నెలలుగా కన్సాలిడేట్ అవుతున్నాయి. ఈపీఎస్, సేల్స్ మెరుగ్గా ఉండడంతో నిఫ్టీతో పోలిస్తే మంచి జోరు మీద ఉన్నాయి. కీలక మద్దతు స్థాయి రూ.4,500 వద్ద మళ్లీ పుంజుకున్నాయి. గత శుక్రవారం రూ.4,593 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.4,970/5,050 టార్గెట్ ధరతో రూ.4,900 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.4,860.

ఐఆర్ఎఫ్‌సీ: జూలైలో జీవిత కాల గరిష్ఠ స్థాయికి చేరిన ఈ షేర్లు ఇప్పటికే 42 శాతం దిద్దుబాటుకు లోనయ్యాయి. రూ.133 వద్ద కీలక మద్దతుతో అప్‌ట్రెండ్ బాట పట్టి గత వారం రూ.158 వద్ద ముగిశాయి. రూ.162/168 స్వల్పకాలిక టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.157 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.155

బ్యాంక్ ఆఫ్ బరోడా: తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో బీఓబీ షేర్లపై మళ్లీ ఆసక్తి పెరిగింది. జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం దిద్దుబాటు జరిగాక రూ.230 స్థాయిలో స్థిరమైన కన్సాలిడేషన్ కనిపిస్తోంది. గత వారం రూ.230 వద్ద ముగిసిన ఈ షేర్లను మదుపరులు రూ.275 టార్గెట్‌తో రూ.250 వద్ద కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ : రూ.245.

మోతీలాల్ ఓస్వాల్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రతి త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించడం, పెరుగుతున్న అమ్మకాలు, ఈపీఎస్ కంపెనీకి కలిసి వచ్చే ప్రధాన సానుకూలాంశాలు. బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల్లో ఉన్నా మోతీలాల్ ఓస్వాల్ కంపెనీ షేర్లు ఇప్పటికీ మంచి లాభాలతో ట్రేడవుతున్నాయి. గత వారం రూ970 వద్ద ముగిసిన ఈ షేర్లను ఇన్వెస్టర్లు రూ.995 టార్గెట్‌తో రూ.975 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.970.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24500 పైన నిలదొక్కుకోవాలి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 24000 పైన రికవరీ సాధించి 24500 వరకు వెళ్లింది. కాని ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక కరెక్షన్‌లో పడి చివరికి 24300 వద్ద ముగిసింది. గత వారం పరిమిత పరిధిలోనే కదలాడుతూ వారం మొత్తం మీద అనిశ్చిత ట్రెండ్‌లో క్లోజయింది. టెక్నికల్‌గా మార్కెట్ ఇప్పటికీ డౌన్‌ట్రెండ్‌లోనే ఉంది. గత వారం మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 1200 పాయింట్ల మేరకు లాభపడింది. అయితే అక్టోబరు నెల మొత్తం మీద 4000 పాయింట్లు నష్టపోయింది. స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా పునరుజ్జీవం సాధించి 950 పాయింట్ల మేరకు లాభపడింది. నిఫ్టీ ఇప్పటికీ ప్రధాన మానసిక అవధి 24000 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. శుక్రవారం అమెరికన్ మార్కెట్ల కదలికల ఆధారంగా నిఫ్టీ ఈ వారంలో నెగెటివ్‌గానే ప్రారంభమై మద్దతు స్థాయిల వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ప్రారంభమైతే ఎగువన 24420 వద్ద మైనర్ నిరోధం, 24500 వద్ద ప్రధాన నిరోధం ఉన్నాయి. గత వారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి 24500 వద్దనే సూచీ నిలదొక్కుకోలేక కరెక్షన్‌లో పడింది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24150 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24000. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత కొనసాగుతున్నట్టుగా భావించి స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 900 పాయింట్ల మేరకు రికవరీ సాధించినా వారం మధ్య స్థాయిలో 51670 వద్ద అనిశ్చితంగా క్లోజయింది. మరింత సానుకూలత కోసం ప్రధాన నిరోధం 52000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: నిఫ్టీ 100 డిఎంఏ 24500 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రేఖ" కన్నా స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం దాన్ని బ్రేక్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,420, 24,500
మద్దతు	24,220, 24,150

నవ్య | చిత్రజ్యోతి

ఇతర భాషా చిత్రాలను తొక్కేస్తున్న బాలీవుడ్

తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్



ఉత్తరాదిన హిందీ చిత్రాలు మాత్రమే రాజ్యమేలుతున్నాయని, బాలీవుడ్‌లో కేవలం హిందీ చిత్రాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర భాషలైన మరాఠీ, బిహారీ, భోజ్‌పురి, హర్యానా, గుజరాత్ తదితర ఉత్తరాది సినిమాలను తొక్కేస్తున్నారని తమిళనాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హీరో ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. ఉత్తరాదిలో కొన్ని రాష్ట్రాలకు సొంతంగా చిత్రపరిశ్రమలే లేవని, బాలీవుడ్ అంటే ఒక్క హిందీ చిత్రాలకే పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. కానీ, దక్షిణాదిలో తమిళంతో పాటు తెలుగు, కన్నడం, మలయాళ భాషల చిత్రపరిశ్రమలు పోటీపడుతూ వృద్ధి చెందుతున్నాయన్నారు. కేరళ రాష్ట్రంలోని కోళికోడ్‌లో ఓ మలయాళ పత్రిక ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిలో తమిళ చిత్రపరిశ్రమతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ పరిశ్రమలు కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నాయన్నారు. కానీ, దక్షిణాది తరహాలో ఉత్తర భారతదేశంలో హిందీ కాకుండా మరే ఇతర భాష అయినా శక్తిమంతమైన చిత్రపరిశ్రమను కలిగివుందా? అని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో మాట్లాడే దాదాపు అన్ని భాషలు హిందీకి దూరమయ్యాయి అని చెప్పారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

భారీ బందోబస్తుతో సల్మాన్‌ఖాన్ షూటింగ్



సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా ఏ. ఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న 'సికందర్' చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. దర్శకుడు మురుగదాస్, కథానాయిక రష్మిక మందన్నతో కలసి ఆదివారం సల్మాన్‌ఖాన్ హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. ఈ నెల 7వ తేదీ వరకూ సల్మాన్‌ఖాన్ చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ షెడ్యూల్‌లో సల్మాన్, రష్మికపై ఓ పాటతో పాటు కొంత టాకీపార్ట్‌ను చిత్రీకరించనున్నారు. సల్మాన్‌ఖాన్‌ను చంపుతామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరించిన నేపథ్యంలో భారీ బందోబస్తు మధ్య ఆయన చిత్రీకరణలో పాల్గొంటున్నారు. సినిమా యూనిట్‌ను తప్ప షూటింగ్ పరిసర ప్రాంతాల్లోకి ఎవరినీ పోలీసులు అనుమతించడం లేదు. కాజల్ అగర్వాల్, సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

తెలుగువారితో అనుబంధం ఏర్పడింది

దుల్కర్ సల్మాన్



'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. అక్టోబరు 31న విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించిన నేపథ్యంలో విజయోత్సవ సభను చిత్రబృందం ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. ఇక్కడి వారితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నాగ్, స్వప్న 'మహానటి' కోసం నన్ను సంప్రదించినప్పుడు నాకు తెలుగు రాదు అన్నాను. కానీ నన్ను తీసుకొచ్చి ఈ రోజు ఇలా నిలబెట్టారు. ఆ తర్వాత హను రాఘవపూడి 'సీతారామం'తో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాన్ని అందించారు. ఇప్పుడు వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' చిత్రంలోని పాత్రలకు ప్రాణం పోశారు' అని అన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ' ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను. టీమ్ అందరం ఎంతో కష్టపడి పనిచేశాం. ఆ కష్టానికి తగ్గ ఫలితంగా ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది' అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ "ఏబీసీడీ' సినిమా చూసినప్పటి నుంచి దుల్కర్‌తో పని చేయాలనుకున్నాను. ఇప్పుడు 'లక్కీ భాస్కర్'తో కుదిరింది. కథ విన్న వెంటనే ఏ మాత్రం ఆలోచించకుండా సినిమా చేయడానికి దుల్కర్ అంగీకరించారు. ఒక మంచి సినిమా చూసిన ఫీలింగ్ మనతో లైఫ్ లాంగ్ ఉంటుంది. అందుకే ఒకేసారి మూడు మంచి సినిమాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అని అన్నారు.

రిలీజ్ డేట్ ఫిక్స్



లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఈనెల 22న తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన ఎనిమిది ఫైట్లు హైలెట్‌గా నిలుస్తాయి. లక్ష్మీ రాయ్ చేసిన మూడు క్యారెక్టర్స్ డిఫరెంట్ షేడ్స్‌లో ఉంటాయి' అని అన్నారు. నటి ఆక్షఖాన్ మాట్లాడుతూ 'గతంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు ఎన్నో వచ్చాయి. కాని లక్ష్మీరాయ్ నటించిన ఈ చిత్రానికి ప్రత్యేకత ఉంది' అని చెప్పారు. నటుడు జె.వి.ఆర్ మాట్లాడుతూ 'మంచి పబ్లిసిటీతో, అత్యధిక థియేటర్లలో రిలీజ్ అవుతున్న ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

వినోదం గ్యారంటీ

డైరెక్టర్ సాయికిషోర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా సాయికిషోర్ మచ్చా దర్శకత్వంలో నటించిన చిత్రం 'ధూం ధాం'. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. ఈనెల 8న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సాయి కిషోర్ మాట్లాడుతూ 'రచయిత గోపీ మోహన్ 'ధూం ధాం' ప్రాజెక్ట్ గురించి చెప్పారు. కథ నాకు బాగా కనెక్ట్ అయ్యింది. అలా ఈ సినిమా మొదలైంది. మొత్తం షూటింగ్ అమెరికాలో చేయాలని అనుకున్నాం. అనుమతుల కోసం ఆరు నెలలు ప్రయత్నించినా కుదరలేదు. ఆ తర్వాత యూరప్‌లోని పోలెండ్‌ను సెలెక్ట్ చేసుకున్నాం. నిర్మాత రామ్‌కుమార్, ఆయన మంచితనం గురించి, సినిమా మీద ఆయనకున్న ప్యాషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ సినిమాలో తండ్రీ కొడుకుల మధ్య ఉన్న అనుబంధం చుట్టూ కథ సాగుతుంది. దాంతోపాటు మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. సినిమా సరదాగా మొదలై ఇంటర్వెల్ దాకా మంచి సాంగ్స్, లవ్ ట్రాక్‌తో ప్లెజెంట్‌గా వెళ్తుంది. చేతన్ మంచి టాలెంటెడ్ హీరో. అతనిలో మంచి టైమింగ్ ఉంది. హెబ్బా పటేల్ కూడా తన క్యారెక్టర్‌లో ఆకట్టుకునేలా నటించారు. ఈ మధ్య మనం థ్రిల్లర్, పీడియారిక్, స్కామ్ మూవీస్ చూస్తున్నాం. వాటిలో కామెడీ మిస్ అయ్యాం. ఆ విస్ అయిన ఎంటర్‌టైన్‌మెంట్ 'ధూం ధాం'లో చూస్తారు' అని తెలిపారు.


కొత్తగా..

నార్నే నితిన్ నిశ్చితార్థం

జూనియర్ ఎన్టీఆర్ బావమరిది, టాలీవుడ్ యువ కథానాయకుడు నార్నే నితిన్ ఓ ఇంటివాడవ్వబోతున్నారు. తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్- స్వరూప దంపతుల కుమార్తె శివానిని నితిన్ పెళ్లాడనున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలో జూనియర్ ఎన్టీఆర్, ఆయన శ్రీమతి లక్ష్మీప్రణతి, కుమారులు అభయ్, భార్గవ్ ప్రత్యేకాకర్షణగా నిలిచారు. కల్యాణ్‌రామ్, వెంకటేశ్ ఈ వేడుకలో పాల్గొని కాబోయే వధువరులను ఆశీర్వదించారు. 'మ్యాడ్, ఆయ్' చిత్రాలతో నితిన్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు.



ఒక సినిమా.. మూడు అవార్డులు!



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా నటించిన 'బేబి' చిత్రానికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. సాయిరాజేశ్ దర్శకత్వంలో ఎస్కేఎన్ ఈ సినిమా నిర్మించారు. ఇందులోని 'ఓ రెండు మేఘాలిలా' పాటకు ఇటీవల ఐఫా అవార్డు అందుకొన్నారు గీత రచయిత అనంత శ్రీరామ్. ఇప్పటి వరకూ 'బేబి' సినిమాకు ఫిల్మ్‌ఫేర్, సైమా, గామా అవార్డులు లభించాయి. అవార్డులు పొందిన అనంత్ శ్రీరామ్‌ను దర్శక నిర్మాతలు అభినందించారు.

ఓ నిరుద్యోగి కథ



విప్లవ్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటించి, నిర్మించిన సినిమా 'ఈసారైనా'. అశ్విని హీరోయిన్. ఈనెల 8న సినిమా విడుదలవుతోంది. ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, హీరో విప్లవ్ మాట్లాడుతూ 'కథ అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ఒక నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ, అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా సాగుతాడు అనేది ప్రధాన కథ. ఈ సినిమాకి నేనే డైరెక్టర్‌ని, ప్రొడ్యూసర్‌ని. కష్టమైనా అన్నింటినీ మేనేజ్ చేశాను' అని అన్నారు.

స్పోర్ట్స్

వరంగల్ ● సోమవారం 4 నవంబరు 2024

తమ టెస్టు చరిత్రలో భారత జట్టు స్వదేశంలో మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ కావడం ఇదే తొలిసారి.

సుదీర్ఘ ఫార్మాట్‌లో కివీస్ వరుసగా మూడు టెస్టుల్లో గెలవడం ఇదే తొలిసారి. అలాగే భారత్‌ను ఇక్కడ మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ చేసిన తొలి టీమ్‌గానూ నిలిచింది.

1

టెస్టు చరిత్రలో నాలుగు ఇన్నింగ్స్‌లోనూ లెఫ్టామ్ స్పిన్నర్లు (జడేజా, ఎజాజ్) 5+ వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

భారత్‌లో ఒకే వేదికపై ఎక్కువ వికెట్లు (25) తీసిన పర్యాటక బౌలర్‌గా ఎజాజ్. ఇయాన్ బోథమ్ (22)ను అధిగమించాడు.

2

టెస్టుల్లో స్వల్ప లక్ష్యాన్ని కాపాడు కోవడం కివీస్‌కిది రెండోసారి. గతంలో ఇంగ్లండ్‌పై 137 పరుగులకు కాపాడుకుంది.

200లోపే టార్గెట్‌ను ఛేదించకపోవడం భారత్‌కిది రెండోసారి. 1997లో విండీస్‌పై 120 పరుగులను పూర్తి చేయలేకపోయింది.

స్వదేశంలో వైట్‌వాష్‌తో సిరీస్‌లను కోల్పోయిన మూడో భారత కెప్టెన్‌గా రోహిత్. గతంలో గుండప్ప విశ్వనాథ్ (1980), సచిన్ టెండూల్కర్ (2000) ఉన్నారు.

3

రెండు ఇన్నింగ్స్‌లోనూ 100+ స్ట్రయిక్ రేట్‌తో అర్ధ సెంచరీలు చేసిన మూడో భారత బ్యాటర్‌గా పంత్. గతంలో సెహ్వాగ్, జైస్వాల్ ఈ ఫీట్ సాధించారు.

కివీస్ తరఫున రెండు ఇన్నింగ్స్‌లోనూ 5+ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా ఎజాజ్. గతంలో వెటోరి, శాంట్నర్ ఉన్నారు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న అనంతరం భార్య, కుమార్తెతో కివీస్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్



గిల్(1) క్లీన్‌బౌల్డ్

వేటు తప్పదా?

న్యూజిలాండ్‌తో సిరీస్ వైట్‌వాష్‌తో టీమిండియాలో కొందరు క్రికెటర్ల టెస్టు కెరీర్‌కు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ తర్వాత ఆ ఆటగాళ్లకు ఉద్వాసన ఖాయమని సమాచారం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, అశ్విన్‌లలో ఇద్దరికి బోర్డర్-గవాస్కర్ సిరీస్ నిస్సందేహంగా చివరిది. వయసుమీద పడుతున్న క్రికెటర్ల భవిష్యత్‌పై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్, కోచ్ గంభీర్‌లు త్వరలో చర్చించనున్నారని తెలుస్తోంది. అయితే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం దరిమిలా ఆస్ట్రేలియా వెళ్లే జట్టులో మార్పు, చేర్పులు జరగాలనే డిమాండ్ లేకపోలేదు. కానీ జట్టును ఇప్పటికే ప్రకటించినందున అలాంటి వాటికి ఏమాత్రం అవకాశంలేదని బీసీసీఐ వర్గాలు స్పష్టంజేశాయి. ఈనెల 10న భారత జట్టు ఆసీస్ పయనం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడంలో రోహిత్ సేన విఫలమైతే సూపర్ సీనియర్లకు ఉద్వాసన తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంటే..ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల టూర్‌కు ఆ దేశం వెళ్లే భారత జట్టులో వారెవరూ ఉండరన్నమాట. పుష్కరకాలంగా స్వదేశంలో టెస్టు సిరీస్‌లలో టీమిండియా



కోహ్లీ (1)

సాధించిన అద్భుత విజయాలలో విరాట్, అశ్విన్, జడేజా, రోహిత్‌ల పాత్ర అనన్య సామాన్యం. అయితే వయస్సు వారి ఆటతీరుపై ప్రభావం చూపుతోంది. ఈక్రమంలో ఆ నలుగురు క్రికెటర్లు స్వదేశంలో చివరి టెస్టు సిరీస్ ఆడేసినట్టే. ఇక 2011లో సీనియర్లు జట్టును వీడినప్పుడు ఏర్పడిన పరిస్థితులు పునరావృతం కాకూడదంటే..వయస్సు మీరిన ఆటగాళ్ల భవిష్యత్‌కు సంబంధించి అజిత్ అగార్కర్, గౌతమ్ గంభీర్ వారితో వెంటనే చర్చించాల్సిన అవసరం ఎంతో ఉంది.

తదుపరి ఎవరంటే..

తదుపరి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ సైకిల్‌ను జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌తో టీమిండియా ప్రారంభించనుంది. భారత జట్టు సుదీర్ఘ ప్రణాళికల కోణంలో చూస్తే..బ్యాటింగ్ విభాగంలో సాయి సుదర్శన్, దేవత్ పడిక్కళ్‌కు టెస్టు జట్టులో స్థానం దక్కగలదు. ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ జట్టులో పాతుకుపోయినట్టే. రవిచంద్రన్ అశ్విన్ టెస్టు భవిష్యత్‌పై ఆస్ట్రేలియా పర్యటన తర్వాత సెలక్టర్లు నిర్ణయం తీసుకోనున్నారు. ఫిట్‌నెస్, విదేశీ పిచ్‌లపై బ్యాటింగ్ చేయగల సామర్థ్యం దృష్ట్యా రవీంద్ర జడేజా మరికొంత కాలం కొనసాగొచ్చు. కానీ అక్షర్ పటేల్, మానవ్ సుతార్ రూపంలో ఇద్దరు ఆల్‌రౌండర్లు జడేజా స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. టెస్టు జట్టు వైస్-కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రా పేరును ప్రకటించారు. కానీ పని భారం యాజమాన్య నిర్వహణ రీత్యా అతడు అన్ని టెస్టులూ ఆడకపోవచ్చు. అప్పుడు శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ కెప్టెన్సీ రేసులో ముందుంటారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పరువూ దక్కలేదు

స్వదేశంలో తొలిసారి 0-3తో భారత్ సిరీస్ ఓటమి

అసలేం జరుగుతోంది?.. స్వల్ప ఛేదన కోసం ఆదివారం బరిలోకి దిగిన టీమిండియా పరిస్థితి చూశాక ప్రతీ అభిమాని ఆవేదన ఇదే. టన్నుల కొద్దీ పరుగులు.. అబ్బురపరిచే రికార్డులు ఖాతాలో ఉన్న స్టార్ బ్యాటర్లు అసలు బ్యాటింగే తెలీదన్నట్టు చకచకా పెవిలియన్‌కు చేరారు. కానీ న్యూజిలాండ్ జట్టు మొత్తానికీ, రిషభ్ పంత్ ఒక్కడు మాత్రం సవాల్ విసిరాడు. స్పిన్నర్లను ఎలా ఎదుర్కోవాలో తన సీనియర్లకు చూపిస్తూ.. భారత్‌ను విజయం వైపు నడిపించాడు. కానీ తను వివాదాస్పద రీతిలో నిష్క్రమించాక ఇక చేసేదేమీ లేకపోయింది. చివరకు ఏదైతే జరుగకూడదనుకున్నామో అదే జరిగింది. నేటి తరం క్రికెట్ ప్రేమికులు ఎన్నడూ చూడని విధంగా సొంత గడ్డపై భారత్ తొలిసారి మూడు టెస్టుల సిరీస్‌ను ప్రత్యర్థికి కోల్పోవాల్సి వచ్చింది. కివీస్ విజయంలో లెఫ్టామ్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్ (11 వికెట్లు) అత్యంత కీలకంగా నిలిచాడు.

పంత్ పోరాటం వృధా

6 వికెట్లతో ఎజాజ్ విజృంభణ

క్లీన్‌స్వీప్‌తో న్యూజిలాండ్ చరిత్ర

ముంబై: స్వదేశంలో తమను కొట్టేవారే లేరన్నట్టుగా జైత్రయాత్ర సాగించిన టీమిండియాను న్యూజిలాండ్ చావుదెబ్బ తీసింది. శ్రీలంకపై రెండు టెస్టుల సిరీస్‌ను కోల్పోయి ఇక్కడి వచ్చిన ఈ జట్టు.. ఒక్క టెస్టులో గెలిస్తే గొప్పే అనుకున్నారు. కానీ అనూహ్య ఆటతీరుతో ఏకంగా సిరీస్‌నే 3-0తో క్లీన్‌స్వీప్ చేసేసింది. చివరిదైన మూడో టెస్టులోనూ స్పిన్‌ను ఆడలేక బ్యాటర్లు చేతులెత్తేయడంతో రోహిత్ సేన 147 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేకపోయింది. ఫలితంగా



రెండున్నర రోజుల్లోనే ముగిసిన ఈ టెస్టులో పర్యాటక కివీస్ 25 పరుగుల తేడాతో గెలిచింది. వాస్తవానికి భారత జట్టు టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ కావడం కూడా 24 ఏళ్లలో ఇదే తొలిసారి. 2000లో దక్షిణాఫ్రికా ఇక్కడ 2-0తో నెగ్గింది. స్పిన్నర్ ఎజాజ్ పటేల్ (6/57), ఫిలిప్స్ (3/42) ఇబ్బందిపెట్టడంతో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 29.1 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. జట్టులో పంత్ (64) మాత్రమే రాణించాడు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 174 పరుగులు సాధించింది. జడేజాకు ఐదు, అశ్విన్‌కు మూడు వికెట్లు దక్కాయి. అలాగే తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 235, భారత్ 263 పరుగులు చేశాయి. ఇక మూడు టెస్టుల్లో ఎక్కువ పరుగులు (244) సాధించిన విల్ యంగ్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఎజాజ్ పటేల్‌కు దక్కింది.

పంత్ ఒక్కడే..: మూడో రోజు ఆదివారం కివీస్ రెండో ఇన్నింగ్స్ 14 బంతుల్లోనే ముగిసింది. ఎజాజ్ (8)ను జడేజా అవుట్ చేయడంతో భారత్ 147 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగింది. బంతి విపరీతంగా టర్న్ అవుతున్నప్పటికీ, లక్ష్యం మరీ భారీగా లేకపోవడం.. కావాల్సినంత సమయం ఉండడంతో భారత్‌కు విజయం కష్టం కాబోదనిపించింది. కానీ స్పిన్నర్ ఎజాజ్ పటేల్ మరోమారు చుక్కలు చూపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన తను ఈసారి కూడా వరుసగా వికెట్లు తీస్తూ ఓటమిని కళ్లముందుంచాడు. క్రీజులో ఉన్నంతసేపు ఆదుర్దాగా కనిపించిన కెప్టెన్ రోహిత్ (11) అనవసరంగా పుల్ షాట్ ఆడి చేజేతులా పేసర్ హెన్రీకి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే ఎజాజ్ బంతిని సరిగ్గా అంచనా వేయలేక గిల్ (1) బౌల్డ్ అయ్యాడు. అటు విరాట్ కోహ్లీ పేలవ ఫామ్ కొనసాగిస్తూ (1) ఎజాజ్ ఓవర్‌లోనే వెనుదిరిగాడు. పంత్ మాత్రం సిక్సర్‌తో ఖాతా తెరిచి ఫ్యాన్స్‌ను జోష్‌లో నింపాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం మాత్రం ఆగలేదు. జైస్వాల్ (5)ను ఫిలిప్స్, ఓ ఫుల్‌టాస్ బంతితో సర్ఫరాజ్ (1)ను ఎజాజ్ బోల్తా కొట్టించారు. ఈ స్థితిలో జట్టు కేవలం 41 బంతుల్లోనే 5 వికెట్లు కోల్పోయి దయనీయంగా కనిపించింది. అప్పటికి స్కోరు 29 పరుగులు మాత్రమే కాగా కనీసం వంద రన్స్ అయినా చేయగలుగుతుందా? అనిపించింది. అయితే పంత్ మాత్రం ఎలాంటి బెరుకు లేకుండా బ్యాటింగ్ సాగించాడు. జడేజా (6)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఫిలిప్స్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో చెలరేగగా, అతడి ప్రతీ పరుగుకు కూడా వాంఖడే ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. అయితే 12వ ఓవర్‌లో ఎజాజ్ వేసిన బంతికి తను ఎల్బీ కావాల్సి ఉన్నా కివీస్ రివ్యూకు వెళ్లకపోవడంతో బతికిపోయాడు. అప్పటికి అతడి స్కోరు 21 మాత్రమే. ఇక ఆరో వికెట్‌కు 42 పరుగులు జత చేరాక జడేజా వెనుదిరిగాడు. ఎజాజ్ ఈ వికెట్ తీసి కివీస్‌కు రిలీఫ్‌నిచ్చాడు. పంత్ మాత్రం ఎజాజ్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో అర్ధసెంచరీ పూర్తి చేసి తొలి సెషన్‌ను ముగించాడు.

ఆశలు ఆవిరి: లంచ్ బ్రేక్ సమయానికి భారత్ చేతిలో 4 వికెట్లు ఉండగా, మరో 55 పరుగులు చేస్తే చాలు. పంత్ సాధికారికంగా ఆడుతుండగా, అతడికి జతగా సుందర్ ఉండడంతో విజయంపై ఆశలు రేగాయి. అలాగే అశ్విన్ కూడా బరిలోకి దిగాల్సి ఉంది. కానీ భారత్ అంచనాలపై ఎజాజ్ నీళ్లు చల్లాడు. రెండో సెషన్ రెండో ఓవర్‌లోనే గట్టి దెబ్బ తీశాడు. రెండు వరుస ఫోర్లు బాదిన పంత్‌ను నాలుగో బంతికి పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో వాంఖడే ఒక్కసారిగా మూగబోయింది. దీనికితోడు ఫిలిప్స్ ఒకే ఓవర్‌లో అశ్విన్ (8), ఆకాశ్ (0)లను అవుట్ చేయడం.. తర్వాతి ఓవర్‌లోనే సుందర్ (12)ను ఎజాజ్ బౌల్డ్ చేయడంతో భారత్ పరాభవం పూర్తయ్యింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235;
భారత్ తొలి ఇన్నింగ్స్: 263;
న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 174;
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) ఫిలిప్స్ 5; రోహిత్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; గిల్ (బి) ఎజాజ్ 1; విరాట్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 1; పంత్ (సి) బ్లండెల్ (బి) ఎజాజ్ 64; సర్ఫరాజ్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; జడేజా (సి) యంగ్ (బి) ఎజాజ్ 6; సుందర్ (బి) ఎజాజ్ 12; అశ్విన్ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 8; ఆకాశ్ (బి) ఫిలిప్స్ 0; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 29.1 ఓవర్లలో 121 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-13, 2-16, 3-18, 4-28, 5-29, 6-71, 7-106, 8-121, 9-121, 10-121. **బౌలింగ్:** హెన్రీ 3-0-10-1; ఎజాజ్ 14.1-1-57-6; ఫిలిప్స్ 12-0-42-3.

డబ్ల్యూటీసీ ఫైనల్ కష్టమే..

న్యూజిలాండ్‌తో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో చోటు సాధించడం అత్యంత క్లిష్టంగా మారింది. ఈ ఓటమితో జట్టు 58.33 విజయాల శాతంతో పట్టికలో రెండో స్థానానికి పడిపోగా ఆసీస్ (62.50) టాప్‌లో నిలిచింది. శ్రీలంక (55.56), కివీస్ (54.55) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక భారత్‌కు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ మాత్రమే మిగిలి ఉంది. ఫైనల్‌కు చేరాలంటే ఇందులో కచ్చితంగా నాలుగు టెస్టుల్లో గెలవాల్సిందే. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా ఓకే. అలా అయితేనే ఎలాంటి సమీకరణాలు లేకుండా రోహిత్ సేన తుది పోరుకు అర్హత సాధిస్తుంది. ఇప్పుడున్న స్థితిలో కంగారూలను వారి గడ్డపై క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కు దాదాపు అసాధ్యమే.



కెప్టెన్‌గానూ విఫలమయ్యా..

సిరీస్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. గెలుస్తామనుకున్నా ఇలా జరిగింది. కివీస్ మాత్రం అన్ని టెస్టుల్లోనూ మాపై ఆధిపత్యం చూపింది. మేం చాలా తప్పులు చేశాం. తొలి రెండు టెస్టుల్లో మొదట ఆశించిన పరుగులు చేయలేకపోయాం. టర్నింగ్ పిచ్‌పై ఎలా ఆడాలో పంత్, గిల్, జైస్వాల్ ఆడి చూపించారు. ఇక కెప్టెన్‌గా, ఆటగాడిగానూ నేను విఫలమయ్యాను. ఓటమికి పూర్తి బాధ్యత నాదే. కానీ సమష్టిగానూ మేం మంచి ప్రదర్శన కనబర్చలేకపోయాం.

-రోహిత్ శర్మ

ఇదో అద్భుత విజయం

మూడు టెస్టుల్లోనూ అద్భుతంగా ఆడాం. బెంగళూరులో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్లు భారత్‌ను కట్టడి చేయగలిగారు. ఎజాజ్ ముంబైలో బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదించాడు. భారత్ ముందు మంచి టార్గెట్‌ను ఉంచామనే భావించాం. మిగతా పని మా బౌలర్లు కానిచ్చారు. మూడు వారాల క్రితం కలగా భావించిన విజయాన్ని ఇప్పుడు సాధించాం.

- కివీస్ కెప్టెన్ లాథమ్



పంత్ అవుటేనా?

ఛేదనలో జోరు కొనసాగిస్తున్న రిషభ్ పంత్‌ను అవుట్ చేశాక కివీస్ విజయం సులువైంది. అయితే అతడి అవుట్‌పై థర్డ్ అంపైర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇన్నింగ్స్ 21వ ఓవర్ నాలుగో బంతిని డిఫెన్స్ ఆడబోగా బంతి గాల్లోకి లేచి కీపర్ చేతిలో పడింది. దీంతో అవుట్ కోసం అప్పీల్ చేశారు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో కివీస్ డీఆర్ఎస్ కోరుకుంది. రీప్లేలో బంతి బ్యాట్ అంచును తాకి తర్వాత ప్యాడ్‌ను తాకినట్టుగా కనిపించింది. దీంతో థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. అయితే ప్యాడ్‌కు బ్యాట్ తాకినందుకే అల్ట్రా ఎడ్జ్‌లో స్పైక్స్ వచ్చాయని, బంతి తగల్లేదంటూ పంత్ ఫీల్డ్ అంపైర్‌కు చెప్పడం కనిపించింది. కానీ బ్యాట్‌కు సమీపంలో బంతి వచ్చినప్పుడు కూడా స్పైక్స్ కనిపించాయి. మూడో అంపైర్ నిర్ణయం ప్రకారం పంత్ మైదానం వీడక తప్పలేదు. అటు సోషల్ మీడియాలో పంత్ అవుట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. అలాగే రీప్లేలో ఏ విషయం స్పష్టంగా తేలనప్పుడు ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికే వదిలేయాలని కెప్టెన్ రోహిత్, ఏబీ డివిల్లీర్స్ చెప్పారు.



కోచ్‌కు విషమ పరీక్ష

కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లో టీమిండియాకు ఊహించని ఓటములు ఎదురయ్యాయి. శ్రీలంక, న్యూజిలాండ్ చేతిలో పరాజయాలతో గంభీర్‌పై ఎంతో ఒత్తిడి నెలకొంది. గౌతీని బీసీసీఐ ఏరికోరి కోచ్‌గా నియమించుకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జట్టు ఎంపికలో కూడా అతడు కలజేసుకొనే అవకాశం కల్పించింది. కానీ, తాజా పరిణామాలు గంభీర్ తీరును వేలెత్తి చూపే విధంగా ఉన్నాయి. ఏదైతే అది అనే విధంగా దూకుడుగా ఆడాలనే అతడి మంత్రం పనిచేయడం లేదనిపిస్తోంది. మూడో టెస్టులో సిరాజ్‌ను నైట్ వాచ్‌మన్‌గా పంపడం, తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్‌ను 8వ నెంబర్‌లో పంపడానికి అంగీకరించడం లాంటివి వ్యూహాత్మక తప్పిదాలని మాజీలు విమర్శిస్తున్నారు. ఆస్ట్రేలియా టూర్‌కు హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ ఎంపికయ్యారంటే అంతా గంభీర్ వల్లేనని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. కానీ, వారి సామర్థ్యాలపై ఎన్నో అనుమానాలున్నాయని చెప్పాడు. మొత్తంగా చూస్తే రాబోయే ఆస్ట్రేలియా టూర్‌తో కొందరు సీనియర్లతోపాటు గంభీర్ భవిష్యత్ తేలిపోనుంది.

ఆత్మపరిశీలన చేసుకోవాలి

స్వదేశంలో 0-3తో ఓడడం ఏమాత్రం జీర్ణించుకోలేనిది. ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం. సన్నాహకాల్లో లోపమా? షాట్‌ల ఎంపికలో పొరబాట్లా? లేదా మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడమా? అయితే పంత్ మాత్రం.. పిచ్ నుంచి సవాళ్లు ఎదురవుతున్నా చక్కని ఫుట్‌వర్క్‌తో అద్భుతంగా పోరాడాడు. - సచిన్ టెండూల్కర్

స్పిన్‌ను ఆడే విషయంలో మనోళ్లు ఎంతో మెరుగుపడాలి. షార్ట్ ఫార్మాట్‌లో కొన్ని ప్రయోగాలు చేయడం మంచిదే. కానీ, టెస్టు క్రికెట్‌లో మాత్రం అనవసరం. - వీరేంద్ర సెహ్వాగ్

- మెలికలు తిరిగే వికెట్లే మనకు శత్రువులుగా మారాయి. - హర్భజన్ సింగ్
- స్పిన్‌ను ఎదుర్కోవడంలో చాలా జట్ల తరహాలోనే భారత్ కూడా ఇబ్బంది పడుతోంది. - ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ వాన్

వివాదాస్పదమైన 'బంతి మార్పు'

7 వికెట్లతో భారత్-ఎ ఓటమి



మెకెకే (ఆస్ట్రేలియా): అనధికార టెస్టు తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా-ఎ జట్టు 7 వికెట్ల తేడాతో భారత్-ఎపై గెలిచింది. భారత్-ఎ నిర్దేశించిన 225 పరుగుల ఛేదనలో కిందటిరోజు స్కోరు 139/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. వికెట్ కూడా చేజార్చుకోకుండా 226 పరుగులు చేసి గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (88 నాటౌట్), వెబ్‌స్టర్ (61 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించారు. భారత్-ఎ 107, 312 స్కోర్లు చేయగా.. ఆసీస్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 195 రన్స్ చేసింది. రెండో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ గురువారం మెల్‌బోర్న్‌లో మొదలవనుంది.

అంపైర్‌తో కిషన్ వాగ్వాదం: ఈ మ్యాచ్‌లో బంతిని మార్చడం వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటకుముందు.. బంతిపై గీతలు పడడంతో మార్చినట్టు అంపైర్ స్వాన్ క్రెయిగ్ చెప్పడంతో భారత ఆటగాళ్లు అతనితో వాగ్వాదానికి దిగారు. 'మీరే బంతిని గీకారు.. అందుకే మార్చాం. ఎలాంటి వాదోపవాదాలకు తావులేదు. ఆటను మొదలుపెట్టండి' అని క్రెయిగ్ చెప్పడం స్టంప్ మైక్‌లో వినిపించింది. దీనిపై భారత జట్టు కీపర్ ఇషాన్ కిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'అయితే, ఈ బంతితో మేం ఆడాలా? ఇదో తెలివితక్కువ నిర్ణయమ'ని ఫైర్ అయ్యాడు. దీంతో 'అమర్యాదకర ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తాం. మీరు చేసిన పని కారణంగానే బంతిని మార్చాల్సి వచ్చింద'ని క్రెయిగ్ బదులిచ్చాడు. కాగా, బంతి ఆకారం దెబ్బతిన్న కారణంగానే మార్చాల్సి వచ్చిందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. ఇరుజట్ల కెప్టెన్లు, మేనేజ్‌మెంట్‌కు ముందుగానే సమాచారం ఇచ్చినట్టు పేర్కొంది. కిషన్‌పై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోబోమని తెలిపింది. నిబంధనల ప్రకారం ఉద్దేశపూర్వకంగా బంతి ఆకారాన్ని దెబ్బతీశారని భావిస్తే.. బాల్‌ను మార్చడంతోపాటు బ్యాటింగ్ జట్టుకు పెనాల్టీ కింద ఐదు పరుగులు ఇస్తారు. కానీ, భారత్‌పై ఎటువంటి పెనాల్టీ విధించలేదు.

హైలో ఓపెన్
రన్నరప్ మాళవిక

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ హైలో ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరినా టైటిల్ మాత్రం అందుకోలేకపోయింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో మాళవిక 10-21, 15-21తో మియా బ్లిచ్‌ఫీల్డ్ (డెన్మార్క్) చేతిలో ఓటమిపాలైంది.

రెండో వన్డేలో ఇంగ్లండ్ గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): కెప్టెన్ లివింగ్‌స్టోన్ (124) అజేయ శతకంతో అదరగొట్టడంతో వెస్టిండీస్‌తో రెండో వన్డేలో ఇంగ్లండ్ 5 వికెట్లతో నెగ్గింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. మ్యాచ్‌లో తొలుత విండీస్ 50 ఓవర్లలో 328/6 స్కోరు చేసింది. కెప్టెన్ హోప్ (117) సెంచరీతో, కార్టీ (71), రూథర్‌ఫోర్డ్ (54) అర్ధ శతకాలతో మెరిశారు. అనంతరం ఇంగ్లండ్ 47.3 ఓవర్లలో 329/5 స్కోరు చేసి గెలుపొందింది. లివింగ్‌స్టోన్‌తో పాటు సామ్ కర్రాన్ (52) సత్తా చాటాడు.

అనహత్ అదిరెన్

భారత స్క్వాష్ స్టార్‌కు చాలెంజర్ టైటిల్



న్యూఢిల్లీ: భారత స్క్వాష్ టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ అంతర్జాతీయ వేదికపై అదరగొట్టింది. ఆస్ట్రేలియాలోని కాఫ్ హార్బర్‌లో జరిగిన కోస్తా నార్త్ కోస్ట్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ అనహత్ 11-6, 11-6, 11-7తో జపాన్‌కు చెందిన ఆరో సీడ్ అకారి మిదోరికావను చిత్తుచేసి టైటిల్ అందుకుంది. 16 ఏళ్ల అనహత్‌కు ఇది ఈ ఏడాదిలో ఆరో పీఎస్ఏ చాలెంజర్ టైటిల్ కావడం విశేషం.



హరియాణాపై బెంగాల్ విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుస టైలకు ముగింపు పలుకుతూ బెంగాల్ వారియర్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ 40-38తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 35-28తో యు ముంబాపై నెగ్గింది.

మరో మూడు స్వర్ణాలు

● అండర్-19 వరల్డ్ బాక్సింగ్

కొలరాడో (అమెరికా): అండర్-19 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఆదివారం మూడు స్వర్ణ పతకాలు లభించాయి. హేమంత్ సంగ్వాన్ (90 కిలోలు), పార్థవి గరేవాల్ (65 కి), వన్షిక గోస్వామి (80+ కి) పసిడి పంచ్‌లు విసిరారు. నిషా (51 కి), సుప్రియ (54 కి), క్రితిక (80 కి) రజతాలతో సరిపెట్టుకొన్నారు. దీంతో ఈ టోర్నీలో భారత్ మొత్తం 17 పతకాలు సాధించింది.

ఆసీస్-ఎతో 'టెస్టు'కు రాహుల్!

న్యూఢిల్లీ: సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, రిజర్వ్ కీపర్ ధ్రువ్ జురెల్ నిర్ణీత సమయానికంటే ముందే ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా 'ఎ'తో భారత్ 'ఎ' జట్టు ఆడే రెండో అనధికార టెస్టులో పాల్గొనేందుకే వారిద్దరినీ ముందుగా ఆసీస్‌కు వెళ్లాలని సూచించినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. ఈ మ్యాచ్ ఈనెల 7నుంచి మెల్‌బోర్న్‌లో జరగనుంది. ఈనెల 22 నుంచి ఆస్ట్రేలియా జట్టుతో జరిగే తొలిటెస్టుకు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ లభించేందుకు రాహుల్, జురెల్‌ను పంపుతున్నారు. కివీస్‌తో ముగిసిన మూడు టెస్టులకు రాహుల్ టీమిండియాలో ఉన్న సంగతి తెలిసిందే. కానీ తొలిటెస్టు తర్వాత రాహుల్ తుదిజట్టులో చోటు కోల్పోయాడు.

పంటల కొనుగోళ్లలో సర్కారు విఫలం

» సీఎం, మంత్రులు జిల్లాల్లో పర్యటించాలి: హరీశ్ రావు



నంగునూరు, హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ తదితర పథకాలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వం రైతుల నమ్మకాన్ని కోల్పోయిందని తెలిపారు. వరి కోతలు ప్రారంభమై నెలరోజులు కావొస్తున్నా ఇప్పటికీ కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌ను వీడి జిల్లాల్లో పర్యటించి రైతుల బాధలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, లేదంటే రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు.

60మంది విద్యార్థులు ఆస్పత్రిపాలైతే చీమ కుట్టినట్టు లేదా?

గురుకుల పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైతే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 60మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటనపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. విద్యార్థులకు సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.

అనుమతుల్లేకుండా టెండర్లు ఎలా పిలిచారు?

» మత్స్యకారుల జీవితాల్లో మట్టికొట్టిన సర్కార్: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): "అవినీతి జరిగిందని బురద జల్లి.. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కక్షగట్టి రైతుల పొట్టగొట్టిన మీరు.. సీతారామ ఎత్తిపోతల పథకానికి అనుమతి లేకుండానే రూ.1074కోట్ల పనులకు టెండర్లు ఎలా పిలిచారు?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాపాలన అని పొద్దుకు పదిమార్లు ప్రగల్భాలు పలికేటోళ్లు.. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల పనుల్లో నిబంధలు ఎలా తుంగలో తొక్కారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన నిలదీశారు. కాగా.. తెలంగాణలోని మత్స్యకారుల జీవితాల్లో రేవంత్ సర్కార్ మట్టికొట్టిందని, కాంగ్రెస్ పాలనలో పథకాలను నామరూపాల్లేకుండా చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మూసీ మురికిలో కోట్లు కుమ్మరించడంపై ఉన్నప్రేమ.. జలాశయాల్లో జలపుష్పాలను వదలడంలో లేదని, ముదిరాజ్ సోదరుల దీనస్థితిపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టిపెట్టడం లేదని ఆయన విమర్శించారు.

త్వరలో ప్రజాస్వామ్య తెలంగాణ

» విధి విధానాలు రూపొందిస్తున్నాం: కోదండరాం

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలోనే ప్రజాస్వామ్య తెలంగాణను స్థాపిస్తామని, అందుకోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. తెలంగాణలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో చర్చలు జరుపుతున్నారని చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆదివారం టీజేఎస్, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌర సమాజంతో మాటా ముచ్చట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిందని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. త్వరలోనే విద్య, వైద్యంపై పూర్తి స్థాయిలో విశ్లేషణ చేసి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని మొత్తం అప్పుల పాలు చేసిందని, దానిని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకొంటున్నది కాంగ్రెసే

» రేవంత్‌పై మాల ప్రజా ప్రతినిధుల ఒత్తిడి: మందకృష్ణ

కామారెడ్డి టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): "ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నది.. వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలను ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ పార్టీనే" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల ఒత్తిడికి సీఎం రేవంత్ తలొగ్గి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీ చేపడుతున్నారని విమర్శించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 'మాదిగల ధర్మయుద్ధ మహాసభ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై మంత్రులతో కమిటీ వేసిన సీఎం రేవంత్.. మళ్లీ కమిషన్ ఎందుకు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని సీఎం రేవంత్ అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు.

బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

» అద్దె భవనాల్లో విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు: ఆర్.కృష్ణయ్య

» మెస్ చార్జీల పెంపుపై విద్యార్థుల సంబరాలు

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కనీస వసతులు లేని అద్దె భవనాలలోని హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో వారు చదువుకోలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లు, గురుకుల పాఠశాల మెస్‌చార్జీలు పెంచినందుకు ఆదివారం నగరంలోని పలు కాలేజీ విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీగా విద్యానగర్‌లోని బీసీ భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ కాలేజీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు ఒక్కదానికీ సొంత భవనాలు లేవని పేర్కొన్నారు.

కులగణనను వ్యతిరేకిస్తే రాజకీయ సమాధే: జాజుల

పంజాగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుల గణనను వ్యతిరేకించే పార్టీలకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు నిర్వహించే కుల గణన చైతన్య సదస్సుల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుల గణన మీద బీసీ కులాల్లో అవగాహన కల్పించడానికి ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. కుల గణనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఎన్ని రోజులు మౌనం వహిస్తారని, అనుకూలమా, వ్యతిరేకమా..? తమ నిర్ణయాన్ని ఎందుకు ప్రకటించడం లేదని ఆయన ప్రశ్నించారు.

గ్రూప్-4 సర్టిఫికెట్ వెరిఫికేషన్.. మరో 15 మందికి టీజీపీఎస్సీ చాన్స్

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 కొలువుల భర్తీలో భాగంగా మరో 15 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసిన వెబ్‌నోట్‌లో పేర్కొంది. స్పోర్ట్స్ కోటాలో షార్ట్‌ఫాల్‌ను భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. వీరిని 1:5 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తున్నట్లు పేర్కొంది. వెబ్‌నోట్‌లో సూచించిన అభ్యర్థులు వెబ్‌ఆప్షన్ ఇచ్చేందుకు మంగళవారం దాకా గడువు ఇచ్చామని, వారంతా సోమవారం 10 గంటల నుంచి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించింది. అయితే.. వెరిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు వెబ్‌నోట్ ఇస్తే.. అభ్యర్థులు ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, స్థానికతపై బోనఫైడ్ లేకుంటే.. తహసీల్దార్ సర్టిఫికెట్, గెజిటెడ్ అధికారి సంతకం.. ఇతర పత్రాలను తీసుకునేందుకు సమయం సరిపోతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షుగర్ ఉన్నా లేనట్టే!

(మొదటి పేజీ తరువాయి)



బాధపడేవారి శరీరంలో ఇతర అవయవాలపైనా దాని ప్రభావం పడుతుంది. కళ్లు దెబ్బతింటాయి. కిడ్నీల పనితీరు మందగిస్తుంది!! కొంచెం కొంచెంగా ప్రాణాలు తీసే ఈ తియ్యటి జబ్బుకు కళ్లాలు వేసి దాని జోరు తగ్గించేది ఇన్సులిన్. కానీ.. ఇన్సులిన్ మోతాదు ఎక్కువ తక్కువ అయితే దానివల్ల వేరే దుష్ప్రభావాలుంటాయి. ఎందుకంటే.. రక్తంలో చక్కెర స్థాయులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. షుగర్ లెవల్స్ తక్కువగా ఉన్నప్పుడు.. రోజువారీ రొటీన్‌గా ఇన్సులిన్ తీసుకుంటే.. చక్కెరస్థాయులు మరింతగా పడిపోయి హైపోగ్లైసీమియాకు దారితీయొచ్చు. కొన్నిసందర్భాల్లో అది ప్రాణాంతకం కూడా అవుతుంది. అందుకే.. షుగర్ లెవల్స్ ఆధారంగా తగు మోతాదులో ఇన్సులిన్ విడుదల అయ్యే/విడుదల చేసే పరిజ్ఞానంపై 1970ల నుంచి.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన శాస్త్రజ్ఞులు రకరకాల పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగానే.. డెన్మార్క్, యూకే తదితర దేశాలకు చెందిన ఫార్మా సంస్థల శాస్త్రజ్ఞులు మానవ ఇన్సులిన్ హార్మోన్‌లోని బీ29 (మాక్రోసైకిల్) ప్రాంతాన్ని, బీ1 (గ్లూకోసైడ్) ప్రాంతాన్ని మార్చడం ద్వారా.. రక్తంలోని చక్కెర స్థాయులకు అనుగుణంగా పనిచేసే ఇన్సులిన్ సంయోజకాన్ని తయారు చేశారు! దానికి 'ఎన్ఎన్‌సీ 2215' అని పేరు పెట్టారు. ఈ స్మార్ట్ ఇన్సులిన్‌లోని మాక్రోసైకిల్ భాగం రింగు ఆకారంలో ఉంటుంది. గ్లూకోసైడ్ మాలిక్యూల్ గ్లూకోజ్ తరహాలో ఉంటుంది. రక్తంలో చక్కెరస్థాయులు పడిపోయినప్పుడు గ్లూకోసైడ్ మాలిక్యూల్ ఆ విషయాన్ని గ్రహించి వెళ్లి రింగ్ భాగానికి అతుక్కుంటుంది. అప్పుడు ఇన్సులిన్ పనిచేయడం మానేస్తుంది. దీనివల్ల చక్కెరస్థాయులు తగ్గడం ఆగుతుంది. అదే రక్తంలో చక్కెరస్థాయులు ఎక్కువగా ఉన్నప్పుడు.. గ్లూకోసైడ్ స్థానాన్ని గ్లూకోజ్ భర్తీ చేస్తుంది. వెంటనే తగు మోతాదులో ఇన్సులిన్ పనిచేస్తుంది. షుగర్ లెవల్స్ సురక్షిత స్థాయులకు చేరుకుంటాయి. అయితే, ఇదంతా ప్రస్తుతానికి ప్రయోగాల దశలో ఉంది. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. మనుషులపై పరీక్షలు పూర్తయి.. మార్కెట్లో అందుబాటులోకి రావడానికి మరికొంత కాలం పడుతుంది.హ్యూమన్ ట్రయల్స్ కూడా విజయవంతమవుతాయని, ఈ స్మార్ట్ ఇన్సులిన్ కూడా మన శరీరంలోని సహజ ఇన్సులిన్ అంత సమర్థంగా పనిచేస్తుందని దీని రూపకర్తలు నమ్మకంగా చెబుతున్నారు.

దేవాదాయ శాఖలో అక్రమార్కులు!

ఈవోల పదోన్నతులు, పోస్టింగుల్లో పైసా వసూల్

» ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లో చక్రం తిప్పిన సిబ్బంది

» రంగంలోకి ఏసీబీ.. సీడీఆర్‌లో నిగ్గు తేలనున్న నిజాలు

» త్వరలో కొత్త కమిషనర్ సమీక్ష



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి కావాలా.. కావాల్సిన చోట పోస్టింగ్ కావాలా..? అర్హతలతో ఏ మాత్రం సంబంధం లేదు. అడిగిన మొత్తం ఇచ్చుకుంటే కావాల్సిన పని ఇట్టే చక్కబెట్టేస్తారు దేవాదాయ శాఖలోని కొందరు అధికారులు. ఇటీవల ఆలయ సూపరింటెండెంట్లుగా ఉన్న వారిలో కొందరికి గ్రేడ్-1 ఈవోలుగా, 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అన్ని అర్హతలుండి పదోన్నతి పొందని వారు, తమకు దక్కాల్సిన పోస్టింగ్‌ను డబ్బులు పోసి అవతలి వారు దక్కించుకున్నారని నిట్టూరుస్తున్నారు. జీవో 261 ప్రకారం.. జూనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-3 ఈవోలుగా, సీనియర్ అసిస్టెంట్లను గ్రేడ్-2 ఈవోలుగా, సూపరింటెండెంట్లను గ్రేడ్-1 ఈవోలుగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సర్వీస్ కింద నియమించాల్సి ఉంటుంది. కానీ ఇటీవలి పదోన్నతుల్లో ఆ నిబంధనను పక్కనపెట్టి నేరుగా పదోన్నతి ఇచ్చారు. రికార్డులు పరిశీలిస్తే మొత్తం అవినీతి బాగోతం బహిర్గతమవుతోంది. ఈ వ్యవహారం మొత్తం ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లోనే జరిగిందనే ఆరోపణలున్నాయి. సదరు అధికారి ఆదేశాల మేరకు కింద పనిచేసే ఇద్దరు, ముగ్గురు సిబ్బంది మొత్తం చక్రం తిప్పుతున్నారని చర్చ జరుగుతోంది. ఆ ఉన్నతాధికారి చెప్పిన వారికే మంచి పోస్టింగులని.. కొందరి కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించి మరీ పనులు చక్కబెడుతున్నారనే ఆరోపణలున్నాయి. దేవాదాయ శాఖలో ఈవోల కొరత ఉన్నప్పటికీ అయిన వారికి ఏళ్ల తరబడి ప్రధాన కార్యాలయంలోనే కొనసాగిస్తున్నారు. దేవాదాయ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఆ శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదులు వెళ్లాయి. సీరియస్‌గా తీసుకున్న మంత్రి వివరాలు అందజేయాలని దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయ అధికారుల్ని ఆదేశించినట్లు సమాచారం.

విషయం బయటకు రావడంతో..

పదోన్నతులు, పోస్టింగ్‌లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇటీవల ఇచ్చిన పదోన్నతుల్లో జిల్లాల వారీగా వచ్చిన ప్రతిపాదనల్ని మరోసారి పరిశీలించాలని జిల్లా స్థాయి అధికారులకు ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం పంపారు. ఎక్కడైనా అనర్హుల్ని ఎంపిక చేసినట్లు తేలితే తమ దృష్టికి తేవాలంటూ సమాచారమిచ్చి చేతులు దులుపుకొన్నారు. ఇటు.. ఈ అవినీతి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రంగంలోకి దిగింది. నిజాలేంటో నిగ్గు తేల్చి, బాధ్యులైన అధికారులపై చర్యలకు రంగం సిద్ధం చేసింది. అవినీతి ఆరోపణలున్న అధికారులు, సిబ్బంది కాల్ డేటా రికార్డు (సీడీఆర్) విశ్లేషణలో నిజాలు నిగ్గు తేలనున్నాయి.

మంత్రికి ఫిర్యాదులు..

పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఇటీవల కొందరు అధికారులు ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందాలంటే 4 కేటగిరీల్లో పొందాల్సి ఉంటుందని.. గ్రేడ్-1 ఈవో పోస్టులు క్యాడర్ స్ట్రెంత్ పెరిగి, మఫిసిల్ క్యాడర్ స్ట్రెంత్ పోస్టులు పెరగకపోవడంతో పదోన్నతుల్లో ఆ కేటగిరీ వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లలో 20 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా పనిచేస్తున్నారని గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై విచారణ జరిపించాలని మంత్రిని కోరారు.

కొత్త కమిషనర్ ముందు సవాళ్లెన్నో..

గత వారం ఐఏఎస్‌ల బదిలీల్లో దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా మంద మకరందు జెడ్ హనుమంత్ కొండిబాకు సర్కారు అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే కొత్త కమిషనర్ ముందు శాఖకు సంబంధించిన సవాళ్లేన్నో ఉన్నాయి. ఓ వైపు సిబ్బంది పదోన్నతులు, పోస్టింగుల్లో ఇష్టానుసారంగా నిర్ణయాలు, సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు, ఆలయ భూముల పరిరక్షణ, వ్యాపార సముదాయాల లీజు వ్యవహారంలో గందరగోళం.. ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన అధికారుల వల్ల శాఖకు ఎదురవుతున్న ఇబ్బందులు ఇలా.. వరుస సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలోనే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కొత్త కమిషనర్ త్వరలో సమీక్ష నిర్వహించి అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో ఆరా తీయనున్నట్లు సమాచారం.

బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్

(మొదటి పేజీ తరువాయి)



విషయంలో హైకోర్టు లేవనెత్తిన అంశాలపై సమీక్షించారు. అందరి ఏకాభిప్రాయం మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

బీసీ కులగణనపై చిత్తశుద్ధితో ఉన్నాం..

బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి కులగణన ప్రారంభించనున్న నేపథ్యంలో.. బీసీ రిజర్వేషన్లపై భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా కోర్టు తీర్పులకు అనుగుణంగా నడచుకోవాలని అన్నారు. కాగా, బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్వాగతించారు. రాష్ట్రంలోని బీసీ సమాజం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని, బీసీలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు.

కమిషన్‌కు చైర్మన్, ముగ్గురు సభ్యులు..

బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను చైర్మన్, ముగ్గురు సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీతో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఏర్పాటైన రాష్ట్ర బీసీ కమిషన్‌కు కూడా చైర్మన్, ముగ్గురు సభ్యులతోపాటు ఒక మెంబర్ సెక్రటరీ ఉన్న విషయం తెలిసిందే.

భూ వివాదంలో ఐపీఎస్!

» కొండాపూర్‌లో విలువైన 11 ఎకరాల భూమి వ్యవహారంలో జోక్యం

» సరిహద్దు గోడల్ని కొందరు కూల్చేశారంటూ బాధితుల ఫిర్యాదు

» కేసు నమోదు చేయని పోలీసులు

» ఐపీఎస్ అధికారి ఒత్తిడితోనేనంటున్న బాధితులు

» ఎస్సై, మరికొందరు అధికారులపైనా ఈడీకి, గవర్నర్‌కు ఫిర్యాదులు

» తమ భూమిని బడా రియల్టర్లు ఆక్రమించుకున్నారని ఆవేదన

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవలి కాలంలో రాష్ట్రంలో వరుసగా ఐపీఎస్ అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిలో యువ ఐపీఎస్‌ల నుంచి సీనియర్ ఐపీఎస్‌ల వరకు ఉంటున్నారు. ఆరోపణలు వచ్చిన ఐపీఎస్‌లపై నిఘా విభాగం విచారణ జరపడం, అత్యున్నత స్థాయి అధికారులు పిలిచి మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని చెప్పడం పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగానే, ఇప్పుడు మరో సీనియర్ ఐపీఎస్ అధికారి ఓ భూ వివాదంలో తలదూర్చిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీ స్థాయి అధికారుల మీదనే ఈ తరహా భూ వివాదాల ఆరోపణలు రాగా.. ఇప్పుడే ఏకంగా ఓ సీనియర్ ఐపీఎస్ మీదనే ఆరోపణలు రావటం గమనార్హం. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 105/2, 105/3, 106/3లో ఉన్న సుమారు 11 ఎకరాల స్థలం వివాదానికి సంబంధించి పలువురు వ్యక్తులు.. స్థానిక గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది మే 30న ఫిర్యాదు చేశారు. అంతకుముందు రోజు అర్ధరాత్రి 150 నుంచి 200 మంది అక్రమంగా తమ స్థలంలోకి చొరబడి, సరిహద్దు గోడల్ని కూల్చి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఈ ఫిర్యాదు విషయంలో పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సలహా ఇస్తూ.. రెండు నెలల తర్వాత గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్సై ఫిర్యాదుదారులకు ఒక లేఖ పంపించారు. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ ఐపీఎస్ నేరుగా రంగంలోకి దిగి.. అవతలి వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయవద్దని ఆదేశించడంతోనే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదని బాధితులు తాజాగా ఆరోపిస్తున్నారు. ఐపీఎస్ అధికారి, ఎస్సై, మరికొందరు కీలక అధికారుల వల్ల తమకు తీరని అన్యాయం జరిగిందని, తమ విలువైన భూమిని బడా రియల్టర్లు ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన ఐపీఎస్, ఎస్సైతో పాటు మిగతా అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఇతర కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే హైదరాబాద్ శివార్లలో విలువైన భూముల అన్యాక్రాంతానికి సంబంధించి హైదరాబాద్ ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్‌కు సమన్లు జారీ చేసి వరుసగా మూడు రోజుల పాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయడం సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఐపీఎస్ అంశం తెరపైకి రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

'పెద్దల' సభలో సత్తా చాటాలి!

» మండలిలో బలం పెంచుకోవాలి

» 3 ఎమ్మెల్సీ స్థానాలపై బీజేపీ గురి

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న మూడు శాసనమండలి స్థానాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి 29తో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రులు ఉపాధ్యాయ సెగ్మెంట్లతో పాటు ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సెగ్మెంటు ఖాళీ అవుతాయి. ఈ మూడింట్లో రెండు స్థానాలు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలోనే ఉండడంతో కమలం పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పెద్దల సభలో బలం పెంచుకోవాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే సీనియర్ నాయకులు, స్థానిక పార్టీ ముఖ్యులతో దశలవారీగా సమీక్షలు నిర్వహించిన పార్టీ నాయకత్వం.. త్వరలో అభ్యర్థులను ప్రకటించనుంది. ఇందుకోసం అభిప్రాయసేకరణ కూడా పూర్తిచేసింది. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు, కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించి, ముమ్మర ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు బీజేపీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. 'ఇప్పటికే ఓటరు నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. టికెట్లు ఆశిస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నందున అభ్యర్థులను ఖరారు చేస్తే ప్రచారం చేసుకోవడానికి సమయం ఉంటుంది' అని ఆయన తెలిపారు. ఈ స్థానాలు బీజేపీకి చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేల పరిధిలో ఉండడంతో, వారు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 'పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల్లో మా పార్టీ పట్ల ఆదరణ ఉందని విశ్వసిస్తున్నాం. విద్యావంతులు మావైపే మొగ్గు చూపుతారని నమ్ముతున్నాం' అని పార్టీ సీనియర్ నేత ఒకరు వివరించారు. అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ కోసం సీనియర్ నేత చింతల రాంచంద్రారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్యుల నుంచి అభిప్రాయాలు సేకరించి, జాబితాను జాతీయ నాయకత్వానికి సమర్పించింది.



టికెట్ల కోసం పోటాపోటీ..

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గాను రెండు చోట్ల టికెట్ల కోసం బీజేపీలో పోటీ నెలకొంది. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు రఘునాథ్‌రావు తదితరులు ఆశిస్తున్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ సెగ్మెంటు టికెట్‌ను డీపీఎస్-పల్లవి గ్రూప్ చైర్మన్ మల్కా కొంరయ్య, సీనియర్ నాయకులు మధుసూదన్‌రావు, సుధాకర్ రెడ్డి, అనంతరెడ్డి; ఖమ్మం- వరంగల్- నల్లగొండ టీచర్ల సెగ్మెంటు టికెట్ కోసం సరోత్తంరెడ్డి, కస్తూరి చరణ్, సాయిరెడ్డిలు పోటీపడుతున్నారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

బడ్జెట్‌తో సంబంధంలేని హామీలతో మోసం.. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు

» ఖర్గే వ్యాఖ్యలతో తేటతెల్లం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

హనుమకొండ టౌన్/హైదరాబాద్/నిజామాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రజలు ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటున్నారని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బడ్జెట్‌తో సంబంధంలేని 420 హామీలు ఇచ్చి.. వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలు చూస్తుంటే.. మాయ మాటలు చెప్పి రేవంత్ అధికారంలోకి వచ్చినట్లుగా ఉందన్నారు. అమలుకు నోచుకోని హామీలిచ్చి రేవంత్‌రెడ్డి పార్టీని తప్పుదోవ పట్టించారని ఖర్గే వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. ఆదివారం హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రధానికి బహిరంగ లేఖ రాయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. రేవంత్ కుటుంబం, కోటరీ, గుత్తేదారుల్లో వెలుగులు వచ్చాయని విమర్శించారు. కాంగ్రెస్ హామీల్లో ఏ ఒక్క హామీ అమలు చేసినట్లు ఒప్పుకున్నా.. బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రైతు డిక్లరేషన్, యువతకు 2 లక్షల ఉద్యోగాలు, వృద్ధులకు రూ.4వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 సాయం, అభయహస్తం పథకానికి చట్టబద్ధత హామీలు ఏమయ్యాయని నిలదీశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అని చెప్పి ఆయా వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వరి కోతలు పూర్తవుతున్నా రైతాంగంపట్ల ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేదని ఏలేటి విమర్శించారు.

కాంగ్రెస్ ఎన్ని ఉద్యోగాలిచ్చింది..?: లక్ష్మణ్

రైతు రుణమాఫీకి, రేషన్‌కార్డుకు లింకు పెట్టడం ఏంటని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతులకు రుణాలు ఇచ్చినప్పుడు రేషన్‌కార్డు ఆధారంగానే ఇచ్చారా..? అని మండిపడ్డారు. రుణమాఫీ చేస్తామని, రైతు బంధు పెంచి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. వాటిని ఎగ్గొట్టిందని విమర్శించారు. బోనస్ బోగస్ అయిందని, పంటలు కొనే దిక్కు లేదని, పత్తి రైతులకు మద్దతు ధర లేదని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న రేవంత్ రెడ్డి.. ఆ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షలు ఎప్పుడు నిర్వహించారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు జల్సాలు, తెలంగాణకు దమ్మిడీ ఉపయోగం లేని విదేశీ పర్యటనలు చేస్తున్నారని లక్ష్మణ్ ఒక ప్రకటనలో విమర్శించారు.

ఖర్గే నిజమే చెప్పారు: అర్వింద్

ఎన్నికల సమయంలో ఉచితాల ప్రకటనలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ అబద్ధపు హామీలను బయటపెట్టాయని ఎంపీ అర్వింద్ విమర్శించారు. ఎన్నికల సమయంలో దేవుళ్ల మీద ఒట్లు వేసి రేవంత్‌రెడ్డి రైతులను నట్టేట ముంచాడని, ఇప్పటికీ హామీలను అమలు చేయడం లేదని అన్నారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం అర్వింద్ మాట్లాడారు. కేటీఆర్‌ది అహంకార ధోరణి అని.. ఆయన పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మేడిపండులా ఉందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. ఉచిత బస్సు పేరుతో ఉన్న బస్సులను రద్దు చేశారని.. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హైడ్రా దెబ్బకు రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, పెట్టుబడులు నిలిచిపోయాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌కు, ప్రధాని మోదీని విమర్శించే అర్హత లేదని డీకే అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

8న గుట్టకు సీఎం రేవంత్‌రెడ్డి



యాదాద్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకోనున్నారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి పుట్టినరోజును పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వీరారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొండకింద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. 2024 మార్చి 11న కుటుంబసమేతంగా యాదగిరిగుట్టకు క్షేత్రానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. సీఎం హోదాలో రెండోసారి ఆయన గుట్ట క్షేత్ర పర్యటనకు వస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు పటిష్ఠ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

రెండో రాజధానిగా వరంగల్ : పొంగులేటి



వరంగల్ కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ విచ్చేసిన మంత్రి పొంగులేటి.. స్థానిక భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, భద్రకాళి చెరువు ఆక్రమణలను తొలగించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. భద్రకాళి జలాశయాన్ని మంచినీటి రిజర్వాయర్‌గా మారుస్తామని తెలిపారు. ఇక, కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే మామునూరు విమానాశ్రయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు కూల్చిన చరిత్ర బీజేపీది

» రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి : శ్రీధర్ బాబు



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుమ్మక్కయ్యాయని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కుట్రపూరితంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి వేసిన చరిత్ర బీజేపీకి ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో బీజేపీ నేతలు సిద్ధహస్తులను ధ్వజమెత్తారు. జూన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి మారతారంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో గెలిస్తే అధికారం చేపట్టడం, ఓడితే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషించడం ప్రజాస్వామ్యబద్ధ పార్టీల విధి అని, కానీ బీజేపీ మూడో మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్‌తో కలిసి ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా ? అని చూస్తోందని మండిపడ్డారు. కుట్రపూరితంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూల్చి వేసిందంటూ, మహారాష్ట్రలో బీజేపీ అనుసరించిన వైఖరిని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో బీజేపీకి తగిన పాఠం చెబుతారని అన్నారు. సీఎం మారుతారన్న ప్రకటన ద్వారా రాష్ట్ర ప్రజలకు బీజేపీ ఏ సంకేతం ఇవ్వదలుచుకుందని నిలదీశారు. ఇక, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండో రోజు నుంచి బీఆర్ఎస్ విషం చిమ్మడం మొదలుపెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది అధికార దాహమని, ప్రజలు ఆ పార్టీని గద్దె దించిన విషయాన్ని కూడా మరిచిపోతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయనీ, అందుకే ఆ పార్టీల నేతలు విపరీతమైన వ్యాఖ్యలు చేస్తున్నారని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

తేమ శాతం ఎక్కువున్నా... ధాన్యం తీసుకునేలా కేంద్రాన్ని ఒప్పించు

» బండి సంజయ్‌ని కోరిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్కారు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో వరి కొనుగోళ్లు జరుగుతున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కేంద్రం నిర్దేశించిన ప్రకారం ధాన్యంలో 17 శాతం తేమ ఉండాలన్నారు. ఆ మేరకే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం తేమ శాతం 22-27 వరకు ఉందని, అటువంటి ధాన్యాన్ని కొనడం వల్ల రంగు మారి పాడైపోయే అవకాశం ఉందన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్.. రాష్ట్ర ప్రజలు పాడైపోయిన, రంగు మారిన రుచిలేని బియ్యాన్ని తినాలని కోరుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. తేమ శాతంలో మార్గదర్శకాల సవరణ కోసం సంజయ్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఉత్తర్వులు వస్తే తాము అధిక తేమ శాతం ఉన్నా.. ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 7,735 ధాన్యం సేకరణ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం రాకను బట్టి అక్టోబరు రెండో వారం నుంచే కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ నెల 2 నాటికే 5,127 కేంద్రాలను ప్రారంభించామని.. 2,546 మంది రైతుల నుంచి 1,87,970 క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశామని వెల్లడించారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.4.04 కోట్లు జమ చేశామని చెప్పారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

అంతర్జాతీయ స్థాయిలో విద్యావ్యవస్థ: సీతక్క

ములుగు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. 16 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పాలనలో ఇది సాధ్యమైందన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి ములుగు జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క ఆదివారం పర్యటించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని సందర్శించిన మంత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమీకృత గురుకులాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని, అర్థంలేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యంలో ములుగులో నిర్మించిన గోదామును సీతక్క ప్రారంభించారు.

బడి పిల్లలను కేసీఆర్ మోసం చేశారు

» మెస్ చార్జీలు పెంచుతామని మాట తప్పారు: సీఎంవో

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెస్ ఛార్జీల పెంపు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో మెస్, కాస్మెటిక్ ఛార్జీలను భారీగా పెంచామని చెప్పింది. రాష్ట్రంలోని 7.50 లక్షల మంది ప్రభుత్వ గురుకుల, హాస్టల్ విద్యార్థులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని సీఎం కార్యాలయం విమర్శించింది. డైట్ ఛార్జీలు పెంచుతున్నట్లు 2023 జూలైలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారని.. తర్వాత ఛార్జీలను పెంచలేదని పేర్కొంది. గురుకులాలు, హాస్టళ్లల్లో నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపింది.

హై రయ్.. రయ్

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించనున్నారు. కేంద్ర క్యాబినెట్‌లో ఈ ప్రాజెక్టులకు ఆమోదం లభించిన తర్వాత నిర్మాణ వ్యయం, భూ సేకరణ, రూట్‌మ్యాప్‌లపై స్పష్టత రానుంది.

రెండు దశల్లో నిర్మాణాలు..

దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎలాంటి రోడ్లను నిర్మించాలి? ఏయే రాష్ట్రాల గుండా హైస్పీడ్ కారిడార్ల నిర్మాణాలు చేపడితే బాగుంటుంది? వంటి అంశాలపై సర్వే చేసే బాధ్యతల్ని కేంద్రం ఓ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ ప్రాథమిక సర్వే నిర్వహించి.. దేశంలోని పలు రాష్ట్రాలు, జిల్లాల మీదుగా నిర్మించాల్సిన హైస్పీడ్ కారిడార్లు, పోర్టులకు కనెక్టివిటీలు, జిల్లా కేంద్రాలు, పర్యాటక ప్రదేశాల నుంచి గ్రీన్‌ఫీల్డ్, హై స్పీడ్ కారిడార్లకు అనుసంధానం చేసే ఫీడర్ రోడ్లతో పాటు స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీ రోడ్లకు సంబంధించిన నివేదికను కేంద్రానికి అందించింది. దాని ప్రకారం.. హైస్పీడ్ కారిడార్లు తొలి దశలో 18 వేల కి.మీ., రెండో దశలో 20 వేల కి.మీ. కలిపి 39 వేల కి.మీ., ఫీడర్లు, స్పర్ రోడ్లు 6 వేల కి.మీ., పోర్టు కనెక్టివిటీ రోడ్లు 2,500 కి.మీ., పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న రోడ్ల వెడల్పుకు సంబంధించి 4 వేల కి.మీ., స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ రోడ్ల కింద దాదాపు 3 వేల కి.మీ., ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న చోట, హైవేల్లో మిస్సింగ్ లింక్‌ల కింద దాదాపు 2 వేల కిలోమీటర్లు కలిపి దేశవ్యాప్తంగా రెండు దశల్లో 59 వేల కిలోమీటర్లను నిర్మించాల్సి ఉందని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అయితే ప్రస్తుత ట్రాఫిక్, భవిష్యత్తులో పెరగబోయే రద్దీని దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. ఈ ప్రాజెక్టుల పనులు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించాలని, అనంతరం ఏటా ఆయా పనులకు అవసరమైన అనుమతులు ఇస్తూ నిర్మాణాలను చేపట్టాలని, మొత్తంగా 2047 నాటికి వీటిని పూర్తి చేయాలని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.




తెలంగాణకు రాబోయే హైస్పీడ్ కారిడార్‌లు..



- హైదరాబాద్- రాయపూర్ వరకు ఒకటి. ఇది ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మీదుగా రానుంది. మొత్తం 429 కిలోమీటర్లు ఉండగా తెలంగాణలో 165 కి.మీ. నిర్మాణం కానుంది.
- హైదరాబాద్- బెంగళూరు వరకు ఒకటి. కర్ణాటక, తెలంగాణ, ఏపీల మీదుగా నిర్మాణం కానుండగా రాష్ట్రంలో 190 కి.మీ. ఉండనుంది.
- నాగపూర్-హైదరాబాద్‌కు ఒకటి. ఇది తెలంగాణలో 297 కి.మీ. మేర నిర్మాణం కానుంది.
- హైదరాబాద్- చెన్నై వరకు ఒక హై స్పీడ్ కారిడార్. తెలంగాణలో 83 కి.మీ. ఉంటుంది.
- హైదరాబాద్- విశాఖపట్నం వరకు ఒక రోడ్డు ఉండగా ఇది రాష్ట్రంలో 244 కి.మీ. మేర ఉండనుంది.
- పూణె-సోలాపూర్-సంగారెడ్డి వరకు ఒక కారిడార్. ఇది మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రానుంది. మొత్తం 403 కి.మీ. ఉండగా, రాష్ట్రంలో 72 కి.మీ. నిర్మాణం జరగనుంది.

కాగా, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని విజన్-2047 కింద 2031లో అవార్డు పాస్ చేయాలని ప్రాథమిక నివేదికలో పేర్కొంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వమే ఆర్ఆర్ఆర్ నిర్మాణాన్ని చేపట్టేలా అడుగులు వేస్తుండడం గమనార్హం. ఇవిగాక మిస్సింగ్, లింక్ రోడ్లు కూడా రానున్నాయి.

ఏపీకి రాబోయే ప్రాజెక్టుల వివరాలు..



- హైదరాబాద్- బెంగళూరు వరకు ఒకటి. ఏపీలో 261 కి.మీ., కర్ణాటకలో 65 కి.మీ., తెలంగాణలో 190 కి.మీ. మేర కింద నిర్మాణం కానుంది.
- ఖరగ్‌పూర్- కటక్- విశాఖపట్నం వరకు బెంగాల్, ఒడిశా మీదుగా ఏపీకి రానుంది. మొత్తం 783 కి.మీ. కాగా, ఏపీలో 179 కి.మీ. ఉండనుంది.
- తెలంగాణలోని నల్లగొండ జిల్లా చౌటుప్పల్ ఎన్‌హెచ్-65 నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు ఒకటి; మొత్తం 140 కి.మీ.
- వైజాగ్- కాకినాడ- రామేశ్వరం- విజయవాడ- గుంటూరు- ఒంగోలు వరకు ఒకటి. ఏపీ పరిధిలో 335 కి.మీ.తో అతిపెద్ద హై స్పీడ్ కారిడార్.
- నాగపూర్-కాకినాడకు ఒక కారిడార్. ఇది ఒడిశాలో మొదలై మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఏపీకి అనుసంధానం కానుంది. మొత్తం 696 కి.మీ. ఏపీలో 113 కి.మీ. నిర్మాణం కానుంది.
- హైదరాబాద్-చెన్నై మార్గంలోనూ ఏపీలో 400 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది.
- కర్నూలు- కడప-తిరుపతి (బెంగళూరు-చెన్నై మార్గంలో భాగం) ఒకటి. ఇది ఏపీ పరిధిలో దాదాపు 377 కి.మీ. ఉండనుంది.

పోర్టు కనెక్టివిటీలు..

- కాకినాడ పోర్టు నుంచి ఉప్పాడ బీచ్ వరకు 41 కి.మీ. 4 లేన్ల రోడ్డు నిర్మాణం.
- నెల్లూరు సిటీ నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు 22 కి.మీ. మేర 4 లేన్ల రోడ్డు.
- గంగవరం పోర్టు నుంచి తంగలం వరకు 7 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం.
- సూళ్లూరుపేట- మోమిడి వరకు 62 కి.మీ. మేర ఒక రోడ్డు.
- గుంటూరు- తెనాలి- చందోల్- నిజాంపట్నం వరకు 31 కి.మీ. మేర ఒక రహదారి.
- భావనపాడు పోర్టు నుంచి ఖారాపూర్- విశాఖపట్నం రోడ్డుకు, రామాయపట్నం పోర్టు నుంచి హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్‌కు కనెక్టింగ్ రోడ్లు. (వీటిని స్పర్ రోడ్లు అంటారు.) వీటితో పాటు పట్టణ ప్రాంతాల్లో ఇరుకు రోడ్లను వెడల్పు చేసే ప్రాజెక్టులు కూడా నివేదికలో ఉన్నాయి.

సంపద ప్రజలకు ఉపయోగపడాలి

పాలకులు పంచుకోవడానికి కాదు.. ఇది ప్రజలు కోరుకున్న పేదల ప్రభుత్వం

» మేధావుల సూచనలతో కొత్త విద్యుత్ విధానం: భట్టి
» సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీరిస్తాం: ఉత్తమ్
» అభివృద్ధిని ఓర్వలేక విపక్షాల విమర్శలు: కోమటిరెడ్డి
» యాదాద్రి యూనిట్-1లో విద్యుదుత్పత్తి గ్రిడ్‌కు అనుసంధానం

హుజూర్‌నగర్, దామరచర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంపద ప్రజలకు ఉపయోగపడాలి కానీ, పాలకులు పంచుకోవడానికి కాదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసమే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎస్ఎల్బీసీ సొరంగంలో ఒక్క కిలోమీటరు అయినా తవ్వలేదని, తాము 20 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ.200 కోట్లతో మోడల్ కాలనీ పునర్నిర్మాణ పనులను భట్టి పరిశీలించారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని సమీకృత పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో విద్యార్థుల మెస్ చార్జీలను రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. తాము దేశంలో ఎక్కడా లేనివిధంగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గత ఏడాది బీఆర్ఎస్ సర్కారు గురుకుల పాఠశాలలకు రూ.70 కోట్లు కేటాయిస్తే, తాము రూ.5 వేల కోట్లు ఇచ్చి నిరుపేద పిల్లలపై చిత్తశుద్ధిని చాటుకున్నట్లు చెప్పారు. ప్రగతిశీల భావాలతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గం రోజుకు 18 గంటల పాటు పనిచేస్తోందని భట్టి తెలిపారు. ప్రభుత్వం పేదల చెంతకు వచ్చి పనిచేస్తోందని.. ఇందిరమ్మ అంటే పేదలకు భరోసా అని, పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఉత్తమ్ చెప్పారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అనుమానాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. వారు అభివృద్ధి చేయకపోగా ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని, తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. విద్యారంగాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు రూ.వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



దామరచర్ల మండలం వీర్లపాలెంలో బొగ్గు రవాణా వ్యాగన్‌ను ప్రారంభిస్తున్న భట్టి, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

బొగ్గు తరలింపు రైలుకు పచ్చజెండా

బీఆర్ఎస్ పాలనలో.. అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ విధానం తీసుకురాలేదని, తాము మేధావులతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు త్వరలో కొత్త విద్యుత్తు విధానం తెస్తామని భట్టి తెలిపారు. అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని వెల్లడించారు. గృహ, పారిశ్రామిక రంగాలకు విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుని రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలుపుతామన్నారు. కోమటిరెడ్డి, ఉత్తమ్‌లతో కలిసి నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ (వైటీపీఎస్) పనులను భట్టి పరిశీలించారు. రామగుండం నుంచి యాదాద్రికి బొగ్గును తరలించేందుకు దామరచర్ల వద్ద ఏర్పాటు చేసిన గూడ్స్ రైలుకు జెండా ఊపారు. యూనిట్-1లో విద్యుదుత్పత్తిని పవర్ గ్రిడ్‌కు అనుసంధానం (సింక్రనైజేషన్) చేసే ప్రక్రియకు స్విచ్చాన్ చేశారు. యాదాద్రి ప్లాంట్ 5 యూనిట్లకు గాను సెప్టెంబరులో రెండో యూనిట్‌ను, తాజాగా ఒకటో యూనిట్‌ను పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. మిగిలినవి మే నెల నాటికి పూర్తి చేస్తామన్నారు. 4 వేల మెగావాట్ల విద్యుత్తను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని భట్టి తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పడానికి వస్తున్న బహుళ జాతి సంస్థలు తప్పనిసరిగా కొంత గ్రీన్‌ఎనర్జీ (సౌర, పవన విద్యుత్)ని వినియోగించాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నదని, భవిష్యత్తులో కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని కోమటిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

ఉద్యోగులకిచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నెరవేర్చి తీరుతాం

జనవరి కల్లా అన్ని సమస్యలకు పరిష్కారం

ఖమ్మం జిల్లా సకల ఉద్యోగుల వనసమారాధనలో మంత్రులు తుమ్మల, పొంగులేటి



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని ప్రభుత్వం నెరవేర్చి తీరుతుందని, ప్రతీ ఉద్యోగి సంయమనం పాటిస్తే వచ్చే జనవరి నాటికి సమస్యలన్నీ పరిష్కారమవుతాయని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మంలోని చెరుకూరివారి తోటలో ఆదివారం జరిగిన ఖమ్మం జిల్లా సకల ఉద్యోగుల వనసమారాధన, ఆత్మీయ సమ్మేళనంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, రెవెన్యూ మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రభుత్వాల తలరాతను మార్చే శక్తి కలిగిన ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ దృష్టిలో ఉన్నాయని తెలిపారు. అయితే వాటిని పరిష్కరించేందుకు కొన్ని సమయం కావాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకుంటూ ప్రాధాన్య క్రమంలో ఒక్కో రంగం సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కొంత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని అన్నారు. వచ్చే జనవరి నాటికి సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. ఇక, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు నిరంతరం అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రాహుల్ గంటే ఉంటారు

» ఎన్నికల బిజీ షెడ్యూల్‌లోనూ కులగణన సదస్సుకు..: మహేశ్ గౌడ్



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నా కానీ.. టీపీసీసీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కులగణన సదస్సుకు అగ్రనేత రాహుల్ గాంధీ వస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చెప్పారు. ఈ అంశానికి ఆయన అంత ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బోయినపల్లిలోని గాంధీ నాలెడ్జ్ సెంటర్లో కులగణనపై సదస్సు జరగనున్న నేపథ్యంలో.. రాహుల్ సాయంత్రం 5 గంటలకు రానున్నారని వెల్లడించారు. బిజీ షెడ్యూల్ ఉండటంతో ఇక్కడ ఆయన గంటసేపు మాత్రమే ఉంటారన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆ సదస్సు సన్నాహక సమావేశం జరిగింది. ఏఐసీసీ నేత కొప్పుల రాజు, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కులగణన చేపట్టి ఆయా వర్గాల జనాభా ప్రకారం సంపద పంపిణీ జరగలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. అందుకే కులగణనను కాంగ్రెస్ ప్రాధాన్య అంశంగా స్వీకరించిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. బీఆర్ఎస్‌లో కొలువుల కొట్లాట మొదలైందని ఎంపీ చామల ఆరోపించారు. కేసీఆర్ రిటైర్ కావడంతో బీఆర్ఎస్‌లో అధ్యక్ష పదవి ఖాళీ అయిందని, దాని కోసం బావబామ్మర్దులైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు తన్నుకుంటున్నారన్నారన్నారు. అందులో భాగంగానే సర్కారుపై విషం చిమ్ముతూ చెరో దిక్కు ఉరుకులాడుతున్నారని విమర్శించారు. ఏదేమైనా అధ్యక్ష పదవి ఎవరికో ముందు తేల్చుకోవాలన్నారు. పది నెలల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలనపైన చర్చకు సిద్ధమా అంటూ హరీశ్‌కు సవాల్ విసిరారు. మీడియా ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే కేటీఆర్, హరీశ్ ఎక్స్ వేదికగా విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామంటూ ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని యాదవుల తరఫున సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పదోన్నతుల్లో సీనియారిటీకే ప్రాధాన్యం

సమర్థతను పక్కనపెట్టిన వైద్యశాఖ.. పాలనానుభవం లేకున్నా హెచ్‌వోడీగా నియామకం

గతంలోనూ చేయికాల్చుకున్న వైద్యశాఖ

సర్వీస్ నిబంధనలు మార్పు చేయని వైనం

రెగ్యులర్ డీఎంఈ నియామకంపై నేడు హైకోర్టులో హియరింగ్

హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో త్వరలోనే రెగ్యులర్ హెచ్‌వోడీల నియమించేందుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినా ఇంతవరకు కీలకమైన వైద్యశాఖలో కీలక విభాగాధిపతుల పోస్టులన్నింటినీ ఇన్‌చార్జిలతోనే నడిపిస్తున్నారు. పోస్టులు మంజూరై నెలలు గడుస్తున్నా.. రెగ్యులర్ హెచ్‌వోడీల నియామకంలో ఉన్నతాధికారులు మొద్దునిద్రపోతున్నారు. కోర్టులు చివాట్లు పెడుతున్నా.. వాయిదాలు కోరుతున్నారే తప్ప రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడం లేదు. రెగ్యులర్ డీఎంఈ నియామకంపై నేడు రాష్ట్ర హైకోర్టులో హియరింగ్ ఉంది. వాస్తవానికి గత ఏడాది మార్చి 16న రెగ్యులర్ డీఎంఈ పోస్టును నాటి సర్కారు కోర్టు ఆదేశాల మేరకు మంజూరు చేసింది. నాటి నుంచి నేటి వరకు రెగ్యులర్ డీఎంఈలను నియమించకుండా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ఏడాదిన్నరగా కోర్టుకు పదోన్నతి, వయసు పెంపు లాంటి కారణాలు చూపి సాగదీస్తూ వస్తున్నారు. గతవారం అదనపు వైద్యవిద్య సంచాలకుల పదోన్నతి వయసు పెంపునకు అడ్డంకిగా ఉన్న పాత సర్వీసు నిబంధనను కూడా మార్చారు. అయితే డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ సమావేశమై జాబితాను ఖరారు చేయాల్సివుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమయం ఇవ్వాల్సివుండగా సమయాభావం వల్ల టైమ్ ఇవ్వడం లేదు. దాంతో నెలల తరబడి డీపీసీ సమావేశం కాకపోవడంతో జాప్యం నెలకొంటుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

సీనియారిటీకే మొగ్గు

వైద్య ఆరోగ్యశాఖలో విభాగాధిపతుల పోస్టులను సీనియారిటీ ప్రాతిపదికన నియమించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో అనుభవరాహిత్యం ఉన్నా.. అడ్మినిస్ట్రేషన్ గురించి కనీస అవగాహన లేకున్నా.. జాబితాలో సీనియారిటీ ఉంటే చాలు హెచ్‌వోడీగా అవకాశం కల్పించనున్నారు. ఈ నిర్ణయం వల్ల ముందుందు వైద్యశాఖలో అనేక సమస్యలు, చిక్కులు వచ్చే అవకాశం కనిపిస్తోంది. హెల్త్‌లో వైద్యవిద్య సంచాలకులదే కీలక పాత్ర. మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రులన్నీ కూడా డీఎంఈ పరిధిలోనే ఉంటాయి. అలాగే ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో పీహెచ్‌సీలుంటాయి. క్షేత్రస్థాయి ప్రజారోగ్య పర్యవేక్షణ అంతా డీహెచ్ చేతుల్లో ఉంటుంది. అటువంటి ఈ రెండు కీలక విభాగాలకు క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్నవారిని నియమించాలి. అలాగే నిత్యం అనేక సవాళ్లు, సమస్యలు వస్తుంటాయి. వాటిని తక్షణమే సమయస్ఫూర్తితో పరిష్కరించగలిగే సమర్థత ఉన్నవారికే ఈ పోస్టులను అప్పగించాలి. అయితే ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సమర్థత కంటే సీనియారిటీ ప్రకారం హెచ్‌వోడీలను నియమించాలన్న నిర్ణయానికి వచ్చారు. దీనివల్ల కీలక విభాగాల పాలన వ్యవహారమంతా కుంటుపడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉదాహరణలెన్నో...

గతేడాది డిసెంబరు 21న రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాటి డీఎంఈ రమేశ్‌రెడ్డిని తప్పించి సీనియారిటీలో ముందున్న త్రివేణికి ఆబాధ్యతలు అప్పగించారు. కేవలం రెండు నెలలకే ఆమెను తప్పించారు. ఊపిరిసలపని పని, తీవ్ర ఒత్తిడిలో పనిజేయాల్సిన పరిస్థితుల్లో తాను డీఎంఈగా పనిజేయలేనని డాక్టర్ త్రివేణి సర్కారుకు మొరపెట్టుకున్నారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. అలాగే గతేడాది డిసెంబరు 21న నాటి డీహెచ్‌గా ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావును తప్పించి, సీనియారిటీలో ముందున్న రవీంద్ర నాయక్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. నిజానికి రవీంద్ర నాయక్ తన సర్వీస్ అంతా ఢిల్లీలోనే నిర్వహించారు. ఇక్కడ క్షేత్రస్థాయిలో పనిజేసింది కొద్ది నెలలు మాత్రమే.

డీపీసీ ఎన్నడో? రెగ్యులర్ డీఎంఈ ఎప్పుడో ?

రెగ్యులర్ డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ కమిషనర్ డీపీసీ విషయంలో వైద్యశాఖ ఉన్నతాధికారులు సాగదీత ధోరణితో వ్యవహరిస్తున్నారు.. కనీసం ఈ ఏడాదైనా రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తారా లేక ఇంచార్జిలతోనే నెట్టుకొస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చి 11 నెలలు అవుతోన్నప్పటికీ.. రెగ్యులర్ హెచ్‌వోడీల నియామకంలో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


సీజనల్ వ్యాధుల కట్టడిలో ప్రజారోగ్య విభాగం వైఫల్యం

ఈ ఏడాది సీజనల్ వ్యాధులు తీవ్రస్థాయిలో విజృంభించాయి. వాటి కట్టడిలో ప్రజారోగ్య విభాగం వైఫల్యం చెందింది. డెంగీ, చికున్ గున్యా కేసులు ఈ ఏడాదే గరిష్ఠంగా నమోదు అయ్యాయి. వరుసగా సమీక్షలు చేయడం, విభాగంపై పట్టు సాధించడం, తక్షణ నిర్ణయాలు తీసుకోవడం, క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం లాంటివి డీహెచ్‌లో ఇంతవరకు జరగడం లేదు. సీనియారిటీ జాబితాలో ఐదారుగురిని ఎంపిక చేసి, సమర్థత ఉన్న వారికే హెచ్‌వోడీగా ఇవ్వాలని సర్వీస్ నిబంధనలు మార్చితే ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చని నిపుణుల సలహా.

వైద్య ఖర్చు అత్యల్పం!

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ తక్కువే.. దేశంలోనే అగ్ర స్థానంలో తెలంగాణ

- తలసరి వినియోగ వ్యయంలోనూ టాప్ 1
- వైద్యంపై అత్యధిక ఖర్చులో ఏపీ నంబర్-4
- స్మార్ట్‌ఫోన్ వినియోగంలో మనం నంబర్ 3
- మద్యం ఖర్చులో నాల్గో స్థానంలో తెలంగాణ 6వ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్
- దేశంలో 82% చిన్నారులు సర్కారీ బడులకే!
- తెలంగాణలో మాత్రం ప్రైవేటు బడులకే ఓటు
- 'జాతీయ శాంపిల్ సర్వే'లో వెల్లడి



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య ఖర్చులు పెరిగిపోతుండగా.. తెలంగాణలో మాత్రం అతి తక్కువగా పెడుతుండడం విశేషం. అవును మీరు చదివింది నిజమే! వైద్యంపై అతి తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది! ఈ విషయంలో పొరుగు రాష్ట్రమైన ఏపీలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. వైద్యంపై అత్యధికంగా వెచ్చిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది! ఇక నెలవారీ తలసరి వ్యయంలో కూడా తెలంగాణ టాప్‌లో నిలిచింది! మద్యం, మాంసాహారంపై ఖర్చులో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి! ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'జాతీయ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ)' సర్వేలో వెల్లడయ్యాయి. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం, పట్టభద్రులు, నిరుద్యోగం.. లాంటి అనేక అంశాలపై ఎన్ఎస్ఎస్ఓ వివరాలు సేకరించింది. జూలై-2022 నుంచి జూన్-2023 మధ్య అన్ని రాష్ట్రాల్లో 3 లక్షలకు పైగా కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1.73 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.28 లక్షల కుటుంబాలు ఉన్నాయి. గ్రామీణ, పట్టణాల్లో కుటుంబాలు చేస్తున్న ఖర్చు, ఇతర అంశాలకు సంబంధించిన సర్వే వివరాలను ఇటీవలే విడుదల చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ ప్రాంతాల్లో వైద్యంపై అతి తక్కువ ఖర్చుతో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, అత్యధిక ఖర్చులో ఏపీ(12%) నాలుగో స్థానంలో నిలిచింది. పశ్చిమబెంగాల్ ప్రజలు తమ మొత్తం ఆదాయంలో అత్యధికంగా 15 శాతం వైద్యంపై ఖర్చు చేస్తుండగా.. 14.4%తో కేరళ, 12.4తో పంజాబ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ విభాగంలో తెలంగాణలో ఖర్చు 6.1 శాతం మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంతో కేరళ, 16.8తో పశ్చిమబెంగాల్ తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 16.6 శాతంతో ఏపీ తర్వాతి స్థానంలో ఉంది. ఈ విభాగంలో తెలంగాణ 10.3 శాతంతో తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా నిలిచింది.

తృణ ధాన్యాలపై 4% ఖర్చు..

2022-23లో సరాసరిగా ఓ కుటుంబం చేసిన మొత్తం ఖర్చులో తృణ ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలకు వెచ్చిస్తున్న దాన్ని చూస్తే.. బిహార్, అసోం ముందున్నాయి. ఈ రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో 55 శాతం ఖర్చు ఆహార పదార్థాలపై చేస్తుండగా.. ఇందులో 6 శాతం తృణధాన్యాలపై ఉంది. ఏపీలోని పట్టణ ప్రాంత జనాభా మొత్తం ఖర్చులో 43 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం ఆహారంపై ఖర్చు చేస్తున్నారు. తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో 39, గ్రామీణ ప్రాంతాల్లో 47 శాతం వెచ్చిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తృణ ధాన్యాలపై ఖర్చు సరాసరిగా 4 శాతంగా ఉంది.

మద్యం ఖర్చులో నాలుగో స్థానం..



ఆహారంపై చేస్తున్న మొత్తం ఖర్చు వివరాలను ఈ సర్వేలో వెల్లడించారు. ఇందులో మద్యం, ప్రాసెస్డ్ ఫుడ్‌పై అత్యధిక ఖర్చు చేస్తున్న టాప్-6 (గ్రామీణ ప్రాంతాలు) రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. 28.4 శాతంతో తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా.. కర్ణాటక 25.4, అసోం 24.6 తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 23.2 శాతంతో తెలంగాణ నాలుగో స్థానంలో నిలవగా.. 22.9తో ఒడిశా 5, 21.4 శాతంతో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉన్నాయి. ఇందులో జాతీయ సగటు 20.7 శాతంగా ఉండగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖర్చు జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 33.7 శాతం ఖర్చుతో తమిళనాడు, 32.9తో కర్ణాటక తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 32.4తో తెలంగాణ, 28.0తో ఏపీ 3, 4 స్థానాల్లో నిలిచాయి.

82 శాతం సర్కారు బడుల్లోనే..

ప్రైవేటు పాఠశాలలు పెరుగుతున్నా.. కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తున్నా.. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు సర్కారు బడుల్లోనే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 6-10 ఏళ్ల వయసు చిన్నారుల్లో 82.2 శాతం మంది సర్కారు పాఠశాలల్లో చదువుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో 54.7 శాతం మంది చదువుతున్నారు. తెలంగాణలో మాత్రం ప్రైవేటు బడుల్లోనే ఎక్కువ మంది అభ్యసిస్తున్నారు. 6-10 ఏళ్ల చిన్నారుల్లో 94.2 శాతం మంది బడులకు వెళ్తున్నారు. వీరిలో 52 శాత మంది ప్రైవేటులో.. 48శాతం మంది ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. దేశవ్యాప్తంగా 25 ఏళ్లు పైబడిన వారిలో కేవలం 38 శాతం మందే పదో తరగతిని పూర్తి చేశారు. 62 శాతం మంది విద్యార్హత పది లోపే. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 30.4 శాతం ఉండగా.. పట్టణాల్లో 56.6 శాతంగా ఉంది. తెలంగాణలో 25 ఏళ్లు పైబడిన మొత్తం జనాభాలో పదో తరగతి పూర్తి చేసుకున్నవారు 45.4 శాతం మాత్రమే ఉన్నారు.

10 కోట్ల మందికి ఉపాధి, శిక్షణ లేదు..

'స్కిల్ ఇండియా' పేరుతో నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే కేంద్రం చేపట్టిన ఈ సర్వేలో మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. దేశవ్యాప్తంగా 15-29 ఏళ్ల వారిలో 25.6 శాతం మందికి ఉద్యోగాలకు కావాల్సిన కనీస విద్య లేదు. ఉపాధి, నైపుణ్య శిక్షణకు దూరంగా ఉన్నారు. 2021 గణాంకాల ప్రకారం మొత్తం దేశ జనాభాలో 27.2 శాతం మంది 15-29 మధ్య వయసువారే. ఈ లెక్కన దేశ జనాభాలో దాదాపు 7 శాతం యువత విద్య, ఉపాధి, శిక్షణలకు దూరంగా ఉన్నారు. అంటే దాదాపు 10 కోట్ల మంది నిరుద్యోగులు. తెలంగాణలో 15-29 మధ్య వయసున్న మొత్తం జనాభాలో 16.1% మందికి ఉపాధి, నైపుణ్య శిక్షణ లేదు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 16.1 శాతం.. పట్టణాల్లో 16.4 శాతంగా ఉంది.

తలసరి వ్యయంలో నంబర్ వన్..



నెలవారీ సగటు తలసరి వినియోగ వ్యయంలో పట్టణ ప్రాంతాల్లో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో ఓ కుటుంబం సగటున రూ.6459 ఖర్చు చేస్తుండగా.. తెలంగాణలో రూ.8158 ఖర్చు చేస్తున్నారు. రూ.7911తో హరియాణా, రూ.7666తో కర్ణాటక, రూ.7630తో తమిళనాడు, రూ.7078 కేరళ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇది రూ.6782గా ఉంది.

ఫోన్లలో తెలంగాణ 3వ స్థానం



దేశవ్యాప్తంగా 96.1 శాతం మంది జనాభా మొబైల్ ఫోన్లు (స్మార్ట్ ఫోన్లతో సహా) వినియోగిస్తున్నారు. 99.40 శాతం మందికి ఫోన్లతో కేరళ అగ్రస్థానంలో.. 98.6 శాతంతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. 98.5 శాతంతో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 97.8 శాతం మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కేరళ మొత్తం జనాభాలో 99 శాతం మంది ఇంటర్నెట్ వినియోగిస్తుండగా.. తెలంగాణలో 94.4 శాతం మంది వినియోగదారులు ఉన్నారు. కర్ణాటకలో 92.4 శాతం, తమిళనాడులో 90.5, ఏపీలో 91.1% ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు.

మాంసాహారంలోనూ ముందే..



మాంసాహారంపై ఎక్కువ ఖర్చు చేయడంలో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ఐదో స్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల మొత్తం ఆదాయంలో కేరళ వాసులు 19.8 శాతం మాంసాహారంపై ఖర్చు చేస్తుండగా.. పశ్చిమబెంగాల్ 18.9, అసోం 17.0, తమిళనాడు 12.3 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సమానంగా నిలిచాయి. రెండు రాష్ట్రాల ప్రజలు మాంసాహారంపై 11.9 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇందులో జాతీయ సగటు 9.1 శాతంగా ఉంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో చూస్తే.. 23.5 శాతంతో కేరళ ప్రథమ, 20తో అసోం ద్వితీయ, 18.9తో పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానంలో ఉండగా.. 15.8తో తెలంగాణ నాలుగు, 14.8తో ఏపీ ఐదో స్థానంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు 10.6 శాతంగా ఉంది.

టెక్నాలజీ పట్టభద్రుల్లో టాప్..



సైన్స్ అండ్ టెక్నాలజీ పట్టభద్రుల సంఖ్యలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా 21 ఏళ్లు పైబడిన వారిలో మొత్తం పట్టభద్రుల్లో 34 శాతం ఈ కోర్సుల్లో పట్టా పొందుతుండగా.. తెలంగాణలో వీరి శాతం 62.3గా ఉంది. ఏపీ 58.5 శాతంతో రెండో స్థానంలో ఉంది. సంపూర్ణ అక్షరాస్యత కలిగిన కేరళలో సైన్స్ పట్టభద్రులు 47 శాతం, ఢిల్లీలో 26 శాతం, కర్ణాటకలో 41 శాతం, తమిళనాడులో 57 శాతంగా ఉంది. అలాగే 21-59 మధ్య వయసున్న పట్టభద్రుల్లోనూ 63 శాతంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. 59.8 శాతంతో ఏపీ రెండో స్థానంలో ఉంది. దేశంలోని మొత్తం పట్టభద్రుల్లో 38శాతం సైన్స్, టెక్నాలజీ గ్రాడ్యుయేట్లే.

86 లక్షల మందికి బడి తెలియదు..



దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారిలో 2.1 శాతం మందికి పాఠశాల అంటేనే తెలియదు. ఇలాంటివారు గ్రామీణ ప్రాంతాల్లో 2.2 శాతం.. పట్టణ ప్రాంతాల్లో 1.9 శాతం ఉన్నారు. దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారి సంఖ్య 43.10 కోట్లుగా ఉంది. ఈ లెక్కన 2 శాతం మంది అంటే 86 లక్షల మంది అక్షరాభ్యాసానికి దూరంగా ఉన్నారు. తెలంగాణలో 6-18 ఏళ్ల వారిలో 0.4 శాతం మందికి బడి అంటే తెలియదు. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే.. 82.2 శాతం మంది చిన్నారులకు అనారోగ్యం, అంగ వైకల్య సమస్యలు, 16.6 శాతం మంది చదువుపై అనాసక్తి, 1.2 శాతం మంది ఆర్థిక సమస్యలతో పాఠశాలలకు దూరంగా ఉన్నారు.



కోతైనా.. అమ్మ కదా..!!

- పిల్ల మృతితో తల్లి కోతి మూగ రోదన

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతి అనగానే ఆ మూగ జీవి చేసే అల్లరే ఎవరికైనా గుర్తుకు వస్తుంది. కానీ, ఈ ఫొటోలో కనిపిస్తున్న కోతిని చూశారా.. తన పిల్ల మృతదేహం వద్ద ఎంత దీనంగా కూర్చొని ఉందో.. కోతైనా.. అది కూడా ఓ అమ్మ కదా మరి.. కోతుల గుంపు రహదారి దాటుతుండగా గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొని ఆ పిల్ల కోతి మరణించింది. దీంతో తల్లి కోతి తన పిల్ల వద్ద ఇలా కూర్చొని సుమారు 45 నిమిషాలు పాటు కంటతడి పెట్టుకుంది. ఈ ఘటనతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న కోతులు అటుగా వెళుతోన్న వాహనదారులపై ఎగబడ్డాయి. దాదాపు గంట సేపు బీభత్సం సృష్టించాయి. ఆ తర్వాత చనిపోయిన పిల్లకోతిని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి శివారులోని శ్రీమిత్ర టౌన్ షిప్ వద్ద హైదరాబాద్ రహదారిలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది.

చెరువులో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృతి

మోపాల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు అందులో ఉన్న గుంతలో పడి మృతి చెందారు. హైదరాబాద్ చెంచల్‌గూడాకు చెందిన సయ్యద్ వాసిక్ (32), సయ్యద్ యాకుబ్ (32) మిత్రులతో కలిసి కారులో ఆదివారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప వద్ద ఉన్న దర్గా సందర్శనార్థం వచ్చారు. దర్శనం అనంతరం మిత్రులతో కలిసి పక్కనే ఉన్న మంచిప్ప చెరువులో స్నానానికి వెళ్లారు. సయ్యద్ వాసిక్ ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతుండగా గమనించిన సయ్యద్ యాకుబ్ అతడిని కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. స్థానికులు వెంటనే వీరిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే వాసిక్ మృతి చెందగా, యాకుబ్ జాడ కనిపించకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి యాకుబ్ మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువులో గుంతలు ఉండటం వల్ల ప్రమాదవశాత్తు అందులో పడి ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు.

గొంతులో గుడ్డు ఇరుక్కుని వృద్ధుడి మృతి

లింగాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బజ్జీల బండి వద్ద ఉడకబెట్టిన గుడ్డు తింటుండగా గొంతులో ఇరుక్కుని ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో జరిగింది. బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన తిరుపతయ్య (60) ఆదివారం లింగాలలోని బంధువుల ఇంటికి వచ్చాడు. బంధువులు ఎంత బతిమిలాడిన భోజనం చేయకుండా అప్పాయిపల్లికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. అప్పాయిపల్లి గ్రామంలోని కమాన్ దగ్గరున్న బజ్జీల బండి వద్ద ఉడకబెట్టిన గుడ్డు కొనుక్కుని తింటుండగా తిరుపతయ్య గొంతులో ఇరుక్కుంది. దీంతో శ్వాస ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు.

వృద్ధురాలిపై సైబర్ దొంగల వల..37 లక్షలకు టోపీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మనీలాండరింగ్ కేసుల పేరుతో ఓ 74 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగినిని భయపెట్టి ఆమె ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు పెన్షన్ డబ్బును సైబర్ నేరగాళ్లు కాజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆ రిటైర్డ్ ఉద్యోగినికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. తాము ముంబైలోని అంధేరి పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌పై రిజిస్టర్ అయిన నంబర్ నుంచి పలువురికి అసభ్య, వేధింపు సందేశాలు, ప్రకటనలు వెళ్లాయని, అందుకు మీపై కేసు నమోదయిందని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడమంటూ కొత్త వారిని రంగంలోకి దించారు. వారు సీబీఐ అధికారులమంటూ పరిచయం చేసుకొని మీ ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు డబ్బు తరలిందని, మీపై మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయని ఆమెకు చెప్పారు. అందుకు మీ బ్యాంకు ఖాతాల లావాదేవీలు పరిశీలించాలంటూ ఖాతాల వివరాలను తెలుసుకున్నారు. ఏ క్షణంలోనైనా పోలీసులు అరెస్ట్ చేయవచ్చని ఆమెను భయపెట్టారు. విషయం బయటకు చెబితే ఆమెకు, ఆమె కుటుంబ సభ్యుల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని బెదిరించారు. ఆమె ఖాతాల్లోని డబ్బును వెరిఫికేషన్ ఆర్‌బీఐ ఖాతాకు మళ్లించాలని, వెరిఫికేషన్ అనంతరం వడ్డీతో సహా డబ్బు తిరిగి ఇస్తామని నమ్మించి ఆమె పెన్షన్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొత్తం కలిపి రూ.37.90 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా వారు సూచించిన ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

మ్యాట్రిమోనీ సైట్‌ను వాడుకొని దంపతుల మోసం

- ఫేక్ ప్రొఫైళ్లతో యువకుల నుంచి డబ్బు వసూలు
- అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

మంచిర్యాల అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోనీ సైట్‌లో ఫేక్ ప్రొఫైళ్లతో అమాయకులను మోసం చేస్తున్న ఓ జంటను సైబర్ క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కేంద్రం అశోక్‌నగర్‌కు చెందిన ఎర్ర వెంకటనాగరాజు- సౌజన్య దంపతులు తెలుగు మ్యాట్రిమోనీ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌లో అమ్మాయిల పేరు, ఫొటోలతో ఫేక్ ప్రొఫైళ్ల క్రియేట్ చేస్తారు. వాటి నుంచి అబ్బాయిలకు రిక్వెస్ట్ పెట్టి స్పందించిన వారితో మాటలు కలుపుతారు. తర్వాత అమ్మకు ఆరోగ్యం బాగాలేదు.. ఆస్పత్రిలో ఉంది.. అర్జెంటుగా డబ్బు కట్టాలంటూ మాయమాటలు చెప్పి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తారు. ఇలాగే మంచిర్యాలకు చెందిన ఓ యువకుడి నుంచి రూ.17 లక్షలు దోచుకున్నారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేసి నిందితులను పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామంలో పట్టుకున్నామని సైబర్ క్రైమ్ ఏసీపీ ఎం వెంకటరమణ తెలిపారు. వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామని చెప్పారు.

రేపు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల ఐదో తేదీన ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో ఆరు, ఏడు తేదీల్లో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఆ తరువాత తమిళనాడుతోపాటు రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో ఆదివారం ఎండతీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అత్యధికంగా నర్సాపురంలో 35 డిగ్రీలు నమోదైంది. అలాగే పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నీటి పారుదల శాఖ..
సీఈ, ఈఎన్‌సీపై చర్యలు

- రాహుల్‌బొజ్జాను ఆదేశించిన మంత్రి ఉత్తమ్
- 'సీతారామ' ప్రాజెక్టుపై సమీక్షలో.. మంత్రుల ముందే.. సీఈ వర్సెస్ ఈఎన్‌సీ
- నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- అధికారులకు మంత్రి ఉత్తమ్ వార్నింగ్



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్(సీఈ) ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ-జనరల్) జి.అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టులో అనుమతుల్లేకుండా డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం, అనుబంధ పనుల టెండర్ల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అనుమతుల్లేకుండా పనులు చేపట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్ష సందర్భంగా.. డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు పరిపాలనపర అనుమతుల కోసం ప్రతిపాదనలను సమర్పించినా, ఈఎన్‌సీ(జనరల్) సహకరించడం లేదని సీఈ ఆరోపణలు చేశారు. దీనికి ఈఎన్‌సీ స్పందిస్తూ.. తమకు సవివర అంచనాలు(డిటైల్డ్ ఎస్టిమేట్స్) అందలేదని బదులిచ్చినట్లు తెలిసింది. ఈ వివరాలు లేకుండా అనుమతులు ఇస్తే.. అంచనాలు భారీగా పెరిగే ప్రమాదముందని వివరించారు. దాంతో సీఈ పెద్దగా అరుస్తూ.. ప్రభుత్వ ఆదేశాలతోనే టెండర్లను ఆహ్వానించినట్లు బదులిచ్చారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రుల ముందే ఒకరినొకరు ఏకవచనంతో పిలుచుకోవడంతో.. ఉత్తమ్ సీరియస్ అయినట్లు సమాచారం. దాంతో.. సీఈ, ఈఎన్‌సీని పిలిపించుకుని, తగిన చర్యలు తీసుకోవాలంటూ నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జాను మంత్రి ఆదేశించారు. కాగా.. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పరిపాలనపర అనుమతులివ్వగా, 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు పెంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని తప్పుబడుతూ రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని గుర్తు చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదివారం సామాజిక మాధ్యమం వేదికగా కేటీఆర్ ఆరోపణలు చేశారు.

గత నెలలోనే ప్రతిపాదనలు

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం సీఈ గత నెలలో నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. డిటైల్డ్ ఎస్టిమేట్స్ డిజైన్లు, డ్రాయింగ్స్ లేకపోవడంతో వాటిని సమర్పించాలని కోరుతూ ఈఎన్‌సీ(జనరల్) ఆ ప్రతిపాదనలను వెనక్కి పంపారు. గత నెలలో నిర్వహించిన ఓ సమీక్షలో మంత్రులు ఆదేశించడంతో ప్రాజెక్టు అధికారులు తొందరపడి టెండర్లను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. పరిపాలనాపరమైన అనుమతులే కాకుండా.. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా టెండర్లను ఆహ్వానించడం నిబంధనల ఉల్లంఘననే అని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. అయితే.. మంత్రుల సమీక్ష మినట్స్‌లో.. తక్షణమే టెండర్లను నిర్వహించాలని మంత్రులు ఆదేశించిట్లు స్పష్టంగా ఉందని, అందుకే టెండర్లను పిలిచినట్లు బాధ్యులైన అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

బిడ్లను తెరవడానికి అనుమతులు తప్పనిసరి

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన ఆరు టెండర్లకు ఈ నెల 8తో, ఒక టెండర్‌కు ఈ నెల 4తో బిడ్ల దాఖలు గడువు ముగియనుంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్(సీఓటీ)లోని చీఫ్ ఇంజనీర్ల కమిటీ బిడ్లను పరిశీలించి ఎల్-1 బిడ్డర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. సంబంధిత పనులకు పరిపాలనపర అనుమతులు, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా బిడ్లను తెరిచి.. పరిశీలించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారవర్గాలు గుర్తుచేస్తున్నారు. ఇదే విషయాన్ని ఈఎన్‌సీ(జనరల్) పదేపదే ప్రస్తావించడమే వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరుగుతోంది. విజిలెన్స్ విచారణలు కూడా అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విషయం తెలిసిందే.!

పక్క రాష్ట్రాల నుంచి అక్రమ ధాన్యం

- 500 బోనస్‌తో వ్యాపారుల అడ్డదారులు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల్లో ధాన్యం ధర తక్కువగా ఉండడంతో కొందరు అక్రమార్కులు.. అక్కడ ధాన్యాన్ని కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఆనుకొని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల గ్రామాలు, పట్టణాలున్నాయి. అక్కడ పండించే ధాన్యానికి క్వింటాలుకు 1700 నుంచి 1800 రూపాయలు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తున్నారు. తెలంగాణలో మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, సన్న వడ్లకు ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్టు ప్రకటించింది. దీంతో కొందరు వ్యాపారులు దళారుల అవతారం ఎత్తి మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని ఇక్కడికి చేరవేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో చెల్లించిన ధరతో పోల్చుకుంటే బోనస్‌తో కలుపుకొని క్వింటాలుకు రూ.1000-రూ.1100 అదనంగా వస్తుందన్న దురాశతో ఈ అక్రమ దందాకు తెరలేపినట్టు తెలుస్తోంది. సరిహద్దుల్లో చెక్‌పోస్టులున్నా రాత్రివేళల్లో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్ర నుంచి 80క్వింటాళ్ల వరి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీని అధికారులు చింతలమానేపల్లి మండలం గూడెం వద్ద పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన జిల్లాలోని గూడెం, వెంకటాపూర్, హుడ్కులి, వాంకిడి మీదుగా నిత్యం ఈ అక్రమ దందా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.